

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం | 29-1-2019 | పేజీలు: 14 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 202 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 2.41 తదుపరి దశమి; నక్షత్రం: విశాఖ మ. 3.15 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 7.29-9.11; దుర్ముహూర్తం: ఉ. 9.08-9.52, రా. 10.17-11.06; అమృతఘడియలు: తె. ఉ. 7.49, తె. 5.39 మొదలు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 6.04 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



పేదకు రొక్కం

నెలవారీ కనీస ఆదాయ పథకం.. రాహుల్ హామీ



- అధికారంలోకి వస్తే అమలు
- ఇది కాంగ్రెస్ విజన్.. హామీ కూడా
- అప్పుడు దేశంలో ఆకలీ.. పేదలూ ఉండరు
- రాహుల్ వ్యాఖ్యలు
- పేదలకు కోటాకు పోటీగానా?

"లక్షలాదిమంది సోదరులు, సోదరీమణులు పేదరికంలో మగ్గుతుంటే నవ భారత్‌ను మనం నిర్మించలేం. అందుకే, ఓ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం కనీస ఆదాయానికి హామీ ఇవ్వనుంది. ఇది మా విజన్. హామీ కూడా. అంటే, దేశంలోని ప్రతి పేదవాడికీ కనీస ఆదాయం వస్తుంది. తద్వారా, దేశంలో ఆకలి ఉండదు. పేదలూ ఉండరు"

-రాహుల్‌గాంధీ

రాయ్‌పూర్, జనవరి 28: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే, దేశంలోని ప్రతి పేదవాడికీ నెలవారీగా కనీస ఆదాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రుణ మాఫీ అమలు చేస్తామని ఇప్పటికే ప్రకటించిన రాహుల్.. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేశారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ 15 సంవత్సరాల తర్వాత విజయం సాధించిన విషయం తెలిసిందే. దాంతో, అక్కడి ప్రజలకు, మరీ ముఖ్యంగా రైతులకు కృతజ్ఞత తెలిపేందుకు సోమవారం రాయ్‌పూర్‌లో 'కిసాన్ ఆభార్ సమ్మేళన్' నిర్వహించారు. దీనికి హాజరైన రాహుల్ కొందరు రైతులకు రుణ మాఫీ సర్టిఫికెట్లను జారీ చేశారు. అనంతరం రాహుల్ తన ప్రసంగంలో ఈ పథకాన్ని ప్రకటించారు. ప్రధాని మోదీ, కేంద్రంలోని అధికార బీజేపీ రెండు భారత్‌లను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వీటిలో ఒకటి రాఫెల్ స్కాం, అనిల్ అంబానీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా,

మిగతా 14వ పేజీలో...



ఖమ్మం జిల్లా మధిరలో భారీ వర్షాలకు మిర్చి కల్లంలో నిలిచిపోయిన నీటిని బయటకు తీసేందుకు కాలువ చేస్తున్న రైతు

అపార నష్టం

అకాల వర్షానికి తడిసిన పత్తి, మిర్చి, మొక్కజొన్న, ధాన్యం

35 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు.. సర్కారు లెక్క 3,845 ఎకరాలే!

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యాయి. వర్షాల ప్రభావం ముఖ్యంగా కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటపై ఎక్కువగా పడింది. 10 నుంచి 15 శాతం వరకు నష్టం ఉంటుందని, తాలు శాతం పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు జిల్లాల్లో మామిడి పూత కూడా రాలిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. 34,839 ఎకరాల్లో మిర్చి, పత్తి, వేరుశనగ, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ అధికారుల నివేదికలో మాత్రం కేవలం 3,845 ఎకరాల్లోనే

మిగతా 2వ పేజీలో...

వణికిస్తున్న చలిగాలులు 2

భాగ్యనగరం గజగజ

229 గొర్రెల మృతి

కొత్త యూపీ.. దక్షిణాది!

అయిదు రాష్ట్రాలపై ప్రధాని మోదీ ఆశలు

ప్రాంతీయ పార్టీలపై విమర్శలకు దూరం

హిందీ రాష్ట్రాల్లో ఓటమితో ముందుజాగ్రత్త



14

ప్రియాంకకు దక్షిణాది బాధ్యత?



- తెలంగాణపై యువనాయకురాలి ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలో ఓటమిపై సీరియస్‌గా అధిష్ఠానం
- ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్!
- వచ్చే నెల తొలివారంలో సమీక్షించే అవకాశం
- మరో వారంలో డీసీసీ అధ్యక్షుల ప్రకటన



'కవి కృష్ణుడి'కి సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం 2

సీఎం కేసీఆర్ అభినందనలు



పశుసంవర్ధక శాఖ డైరెక్టర్

వెంకటేశ్వర్లు హఠాన్మరణం

తిరుమల క్యూలైన్‌లో ఉండగా గుండెపోటు 2

ఆస్పత్రిలో కన్నుమూత

ఎస్‌ఐ పోస్టుల భర్తీకి హైకోర్టు లైన్ క్లియర్ 12

స్టే ఉత్తర్వుల నిలుపుదల

ఉద్యోగులకు స్థాన చలనం

- ఫిబ్రవరిలో పెద్దఎత్తున బదిలీలు
- లోక్‌సభ షెడ్యూల్ ప్రకటనలోగా పూర్తి
- పలువురు ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్‌కు కసరత్తు
- ఈసీ లేఖతో అప్రమత్తమైన అధికారులు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే నెలలో పెద్దఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి రెండేళ్లు పూర్తయింది. చాలామంది కలెక్టర్లు, ఎస్పీలు రెండేళ్లుగా ఒకేచోట కొనసాగుతున్నారు. వీరిలో చాలామందికి స్థాన చలనం కలగనుందని తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు కొన్ని బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. జనవరి నెలాఖరుతో పంచాయతీ ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఆ తర్వాత, మార్చి మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. దాదాపు మూడు నెలలపాటు కోడ్ అమల్లో ఉండనుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు చేపట్టాల్సిందిగా ఆయా రాష్ట్రాల సీఎస్‌లు, సీఈవోలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. సొంత జిల్లాలు, నియోజక వర్గాల్లో పని చేస్తున్నవారు, మూడేళ్లకుపైబడి ఒకేచోట పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని సూచించింది. అయితే వారు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇతర చోట్ల పనిచేసి ఉంటే.. తిరిగి వారిని ఆ ప్రాంతాలకు బదిలీ చేయవద్దని పేర్కొంది. దాంతో, పంచాయతీ కోడ్ ముగిసిన వెంటనే క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు బదిలీలు చేపట్టేందుకు సర్కారు

మిగతా 12వ పేజీలో...



జనార్దన్ రెడ్డి ఆకస్మిక బదిలీ

- అమెరికా పర్యటనకు వెళ్లిన హెచ్‌ఎండీఏ కమిషనర్
- సోమవారం తిరుగు ప్రయాణంలో ఉండగానే వేటు
- పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగులో.. కోకాపేట భూములే కారణం?
- 4 వేల కోట్ల భూములపై ఒత్తిళ్లకు తలొగ్గనందుకేనా?

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) కమిషనర్ బి.జనార్దన్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. సోమవారం రాత్రి 7.30 గంటలకు ఆయన హైదరాబాద్‌లో అడుగు పెట్టారు. కానీ, సోమవారం మధ్యాహ్నమే ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో 229 జారీ చేసింది. పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది. విదేశీ పర్యటన నుంచి తిరిగి రాగానే సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని జీవోలో సర్కారు ఆదేశించింది. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. సాధారణంగా విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు ఉన్నతాధికారులను బదిలీ చేయరు. కానీ, నిజాయతీపరుడు, కష్టపడి పని చేస్తారనే పేరున్న జనార్దన్ రెడ్డిని తప్పిస్తూ విదేశీ పర్యటన నుంచి తిరిగి వస్తున్న కొద్ది గంటల ముందు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. సమస్యలున్న సంస్థలకు ట్రబుల్ షూటర్‌గా పంపిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆయనను పక్కన పెట్టిందా అన్న ప్రచారం జరుగుతోంది. నిజాయతీపరుడిగా పేరున్న జనార్దన్ రెడ్డిని ఎందుకు అకస్మాత్తుగా తప్పించారు...? సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని పేర్కొనడంలో ఆంతర్యమేంటి..? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. జనార్దన్ రెడ్డిపై వేటు వేశారని కొందరు చెబుతుంటే.. కీలక బాధ్యతలు అప్పగించేందుకే ఈ బదిలీ అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. నిజానికి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా

మిగతా 12వ పేజీలో...



119 గురుకులాలు.. 4,322 పోస్టులు

- మంజూరు చేసిన ప్రభుత్వం.. నాలుగేళ్లలో భర్తీకి అనుమతి
- రెగ్యులర్ పోస్టులు 3,689.. వచ్చే ఏడాది భర్తీ 1,904
- టీజీటీ పోస్టులే 1,071.. ఔట్ సోర్సింగ్‌లో 595 మంజూరు
- వచ్చే విద్యా సంవత్సరంలోనే ఇవన్నీ భర్తీ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 119 మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల విద్యా సంస్థల్లో 4,322 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిని రాబోయే నాలుగేళ్లలో దశలవారీగా భర్తీ చేస్తారు. వీటిలో రెసిడెన్షియల్ స్కూళ్లలో పని చేసేందుకు టీచింగ్, నాన్ టీచింగ్ కలిపి 3,689 పోస్టులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, గురుకుల సొసైటీలో పని చేసేందుకు మరో 28 రెగ్యులర్, 10 ఔట్ సోర్సింగ్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. టీచింగ్, నాన్ టీచింగ్‌తోపాటు బీసీ గురుకులాల్లోని వివిధ కేటగిరీల్లో 595 ఔట్ సోర్సింగ్ పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిని వచ్చే (2019-20) విద్యా సంవత్సరంలోనే భర్తీ చేయనున్నారు. అలాగే 1,071 టీజీటీ

మిగతా 2వ పేజీలో...

ఎంబీబీఎస్ ప్రశ్నపత్రం తారుమారు 12

రెండు రకాల ప్రశ్నపత్రాలు.. తెలియక పరీక్ష రాసిన విద్యార్థులు

పరీక్షను రద్దు చేసిన హెల్త్ వర్సిటీ.. ఫిబ్రవరి 12న మళ్లీ పరీక్ష

బుద్ధగయ పేలుడుకు హైదరాబాద్‌లో స్కెచ్

3 నెలల ముందే రాక.. సికింద్రాబాద్‌లో మకాం



బుద్ధగయలో పేలుడు దృశ్యం (ఫైల్)

2

- నిధుల కోసం బెంగళూరు పరిసర ప్రాంతాల్లో దోపిడీలు
- బంగ్లాదేశ్ ఉగ్ర సంస్థ జమాతుల్ ముజాహిదీన్ పనే
- మయన్మార్‌లో రోహింగ్యాలపై అకృత్యాలకు నిరసనగానే
- ఎన్‌ఐఏ విచారణలో వెల్లడి
- చార్జిషీటు దాఖలు



అటవీ ప్రాంతాల్లో తనిఖీలు

అటవీ నేరాలకు ఏడేళ్ల ఖైదు

అడవుల రక్షణకు త్వరలో కొత్త చట్టం

బెయిల్ రాకుండా కఠిన నిబంధనలు

6లోగా కార్యాచరణ.. సీఎస్ జోషి ఆదేశం 12

ఆర్టిజన్లకు 10 లక్షల బీమా

మరణానికి, అంగ వైకల్యానికి వర్తింపు





వర్తమానంలో జీవించడమే జీవితం



పరంజ్యోతి

ఒక పశువు తనకు తిండి దొరికేవరకూ వెతుకుతుంది. తిండిదొరకగానే తినడం మొదలు పెడుతుంది. అంటే రోజు మొత్తంలో కొంతసేపైనా వర్తమానంలో బతుకుతోంది. అలాగే ఒక పక్షి.. నింగిలో స్వేచ్ఛగా విహరిస్తుంటుంది. ఆక లేస్తే.. ఎగిరెగిరి మునకలేసే చేపలున్న చెరువు మీదుగా ఎగురుతూ తన ఆకలిని తీర్చుకునేందుకు ఒక్క చేపను మాత్రమే నోటకరచుకుని తిని ఏ చెట్టు కొమ్మపైనో సేదదీరుతుంది. అదీ వర్తమానంలో జీవిస్తోంది. పశువులు తోటిపశువులతో, పక్షులు తోటిపక్షులతో కలిసి కేరింతలు కొడుతూ జతకలుస్తూ రాగద్వేషాలకతీతంగా జీవిస్తున్నాయి. వర్తమానానికి విలువనిస్తున్నాయి. కానీ.. పశుపక్ష్యాదులకు మనసు, బుద్ధి, ధర్మం వంటివి లేవనే మనిషి మాత్రం తన కోసం జీవించలేకపోతున్నాడు. భవిష్యత్తు కోసం అతివిలువైన వర్తమానాన్ని వ్యర్థం చేస్తున్నాడు. తాను బతకడం లేదు. తోటి వారిని బతకనివ్వడం లేదు. రేపటి కోసం దాచడంలో నేడు ఎలా గడుస్తోందో గమనించట్లేదు. నేడు తను ఎలా జీవిస్తున్నదీ పరిగణనలోకి తీసుకోవట్లేదు. తన నేటి జీవితం కంటే రేపటి జీవితం పైనే నమ్మకం, ఆశ ఎక్కువ. దీనికి సంబంధించి మహా భారతంలో ఒక ప్రస్తావన ఉంది. వనపర్వంలో యక్షుడు ధర్మరాజును 'కిమాశ్చర్యమ్'.. అంటే 'ఏది ఆశ్చర్యం' అని ప్రశ్నంచగా..

అహన్యహని భూతాని గచ్ఛన్తీహ యమాలయమ్
శేషాఃస్థావరమిచ్ఛన్తి కిమాశ్చర్యమ్ అత: పరమ్

అని ధర్మరాజు సమాధానమిచ్చాడు. "ప్రతి రోజూ యముని ఇంటికి ఎందరో అతిథులుగా వెళుతున్నారు. మిగిలిన వారు మాత్రం పోయిన వారి పట్ల సానుభూతి చూపుతూ తాము మాత్రం శాశ్వతం అనుకుంటారు. ఇంతకంటే ఆశ్చర్యం ఏముంది?" అని దీని అర్థం. నేటి జీవిత సరణిలో అందరి విధానమూ ఇలాగే ఉంది. తాము శాశ్వతం అనుకుంటారు. ఎప్పుడూ రేపటి గురించే ఆలోచిస్తారు. తమ కడుపును కాల్చుకొని పిల్లలకోసం దాచి పెడుతున్నారు. ఈ ప్రక్రియలో తమ సంతానానికి సామాజిక బాధ్యతలను కూడా నేర్పట్లేదు. స్వతంత్రంగా బతకడమూ నేర్పట్లేదు. మరి దీనికి పరిష్కారమార్గం ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానం ఒక్క వాక్యంలో దొరకదు. కొన్ని పద్ధతులు పాటిస్తే ఆ దిశగా మంచి ఫలితాలను సాధించవచ్చని మాత్రం చెప్పవచ్చు. వాటిలో అన్నింటికన్నా ముఖ్యమైనది.. సంతృప్తికరంగా జీవించడం. 'మనసి చ పరితుష్టే కోర్థవాన్ కో దరిద్రః' అని చెప్పినట్లు మనసులో తృప్తి కలిగి జీవిస్తే ధనికుడెవ్వడు? లేనివాడెవ్వడు? అలాగే.. ఆహార, నిద్రా, వ్యవహారాలలో జాగరూకత పాటించడం వల్ల అన్ని ధర్మాలకూ మూలసాధనమైన శరీరారోగ్యం చక్కగా ఉంటుంది. నూరువసంతాల జీవితాన్ని పొందగలుగుతాం. ధనం, కీర్తి జీవితానికి ఉప ప్రయోజనాలు కావాలి కానీ అవే పరమలక్ష్యం కాకూడదు.



అలాగే పిల్లలకీ భవిష్యత్తు పై శ్రద్ధను కలుగజేయాలి. నానా జన్మలకు కారణాలైన పుణ్య, పాపకర్మలను ఆచరించడంలో జాగ్రత్తపడాలి. అటువంటి విషయాల్లో మాత్రం భవిష్యత్తు గురించి ఆలోచించాలి. 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్' అన్న ఉపదేశాన్ని గుర్తుంచుకొని, వీలైనంతలో.. ప్రతిఫలం ఆశించకుండా ఇతరులకు మంచిచెయ్యాలి. దానివల్ల మనమంచిని కోరుకునేవారు పెరుగుతారు. ఈ జన్మ సుఖవంతమౌతుంది. మున్ముందు ఉత్తమ జన్మలు కలుగుతాయి. మోక్షం కూడా లభించవచ్చు. ఇదే జీవనసాఫల్యం.

- ఆచార్య రాణి సదాశివ మూర్తి, 9440246354

'కృష్ణుడు'కి సాహిత్య అకాడమీ
అనువాద పురస్కారం

»» సీఎం కేసీఆర్ అభినందనలు



న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత, సీనియర్ జర్నలిస్టు, 'ఆంధ్రజ్యోతి' అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు (కృష్ణుడు)కు 2018కి గాను ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం దక్కింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన సుప్రసిద్ధ కవయిత్రి, పద్మశ్రీ అవార్డు గ్రహీత పద్మా సచ్‌దేవ్ కవితలను 'గుప్పెడు సూర్యుడు - మరికొన్ని కవితలు' పేరిట తెలుగులోకి అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబారా నేతృత్వంలో సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యవర్గ సమితి సమావేశంలో కృష్ణారావు ఎంపికకు ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. భారత స్త్రీ ఎదుర్కొనే సామాజిక వివక్ష, అన్యాయం, సుఖదుఃఖాలతో పాటు దేశ విభజన సమయంలో తన తండ్రిని కోల్పోయిన సందర్భంలో పడిన మానసిక వేదనను సచ్‌దేవ్ ఈ కవితల్లో వ్యక్తీకరించారని, అలాంటి ఉన్నతమైన కవితలను కృష్ణారావు తెలుగులోకి అద్భుతంగా అనువదించారని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రశంసించింది. డోగ్రీ భాషలో ఆమె రచించిన ఈ కవితలను కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్‌సింగ్‌తో పాటు ఇతర ప్రముఖులు ఇంగ్లిష్‌లోకి, కృష్ణారావు తెలుగులోకి అనువదించడం విశేషం. ఈ పురస్కారం కింద రూ.50 వేలు నగదు బహుమతి, జ్ఞాపిక అందజేయనున్నట్లు అకాడమీ తెలిపింది. కృష్ణారావు 'ఇండియా గేట్', 'నడుస్తున్న హీనచరిత్ర' పేరిట రెండు పుస్తకాలను రచించారు. 'ఆకాశం కోల్పోయిన పక్షి'తో పాటు మరో రెండు కవితా సంపుటాలను వెలువరించారు. పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు, పర్యావరణ పరిరక్షణపై ఇందిరా గాంధీకి ఉన్న మమకారం, ఏపీ విభజనపై కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ రచించిన పుస్తకాలనూ తెలుగులోకి అనువదించారు. సాహిత్యంతో పాటు జర్నలిజంలో ఆయన చేసిన సేవలకు అనేక అవార్డులు లభించాయి. ప్రతిష్ఠాత్మక మోటూరి హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు, ఎన్ఆర్ చందూర్ అవార్డు, తాపీ ధర్మారావు అవార్డు, ఆలూరి బైరాగి అవార్డులను అందుకున్నారు.

తెలంగాణకు పేరు తేవాలి: కేసీఆర్

కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించడం పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 'పాత్రికేయుడిగా, కవిగా, రచయితగా సేవలు అందించిన కృష్ణారావు ఈ అవార్డుకు సంపూర్ణ అర్హుడు. పాత్రికేయ వృత్తిలో, సాహితీ రంగంలో మరింత ఎదిగి తెలంగాణకు పేరు తీసుకురావాలన్నదే నా ఆకాంక్ష' అని కేసీఆర్ పేర్కొన్నట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కాంగ్రెస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, రాపోలు ఆనందభాస్కర్, బీజేపీ నేత శ్రీరాం వెదిరె, పలువురు జర్నలిస్టు సంఘం నేతలు కృష్ణారావుకు అభినందనలు తెలిపారు.

తెలుగు ప్రజలకు గర్వకారణం: చంద్రబాబు

కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించడం తెలుగు ప్రజలకు గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. "ఢిల్లీలో సీనియర్ జర్నలిస్టుగా, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్‌గా కృష్ణారావు సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారు. స్త్రీ ఎదుర్కొనే కష్టాలపై కవయిత్రి మానసిక వేదనను తెలుగులోకి అద్భుతంగా అనువదించారు" అని సీఎం ప్రశంసించినట్లు ఆయన కార్యాలయం తెలిపింది.





ఖమ్మం జిల్లా చంద్రుగొండ మండలం గుర్రాయిగుడెంలో రంగుమారుతున్న పత్తి. వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

అపార నష్టం

(మొదటిపేజీ తరువాయి)

పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొనడం శోచనీయం.

- మహబూబాబాద్ జిల్లాలో 180 హెక్టార్లలో మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. కంబాలపల్లిలో కొనుగోలు కేంద్రాల్లోని 200 బస్తాల ధాన్యం తడిసిపోయింది.
- కరీంనగర్ జిల్లా గంగాధర, చొప్పదండి, రామడుగు, మానకొండూర్ మండలాల్లో 179 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది. కరీంనగర్ మండలంలో 120 ఎకరాల్లో పత్తి తడిసిపోయి నల్లబడింది. తిమ్మాపూర్‌లో 50 ఎకరాల్లో వేరుశనగ తడిసిపోయింది. 150 ఎకరాల్లో మామిడి పూత రాలిపోయింది.
- జోగులాంబ గద్వాల జిల్లాలో మిర్చి, పొగాకు తడిసిపోయాయి. మిర్చి నష్టం రూ.20 లక్షల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనా.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 2,500 ఎకరాల్లో మామిడి పూత రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- సూర్యాపేట జిల్లాలో 500 హెక్టార్లలో మిర్చికి నష్టం వాటిల్లింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి, కాటారంలో 9,503 హెక్టార్లలో మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. ములుగులో 58 హెక్టార్లలో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. గోవిందరావుపేట మండలంలో 60 హెక్టార్లలో మామిడి పూత రాలిపోయింది.
- ఖమ్మం జిల్లాలో 1,000 హెక్టార్లలో మిర్చి దెబ్బతింది.
- భద్రాద్రి జిల్లాలో కళ్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది.
- వికారాబాద్ జిల్లాలో 100 ఎకరాల్లో పత్తి, 30 ఎకరాల్లో పసుపు, 60 ఎకరాల్లో చెరుకు పంటలు దెబ్బతిన్నాయి.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 25 హెక్టార్లలో మొక్కజొన్న దెబ్బతింది.
- జగిత్యాలలో 450 ఎకరాల్లో మామిడి పూత రాలింది. 580 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో ఆవ, 140 ఎకరాల్లో కంది పంటలు దెబ్బతిన్నాయి.
- వనపర్తి జిల్లాలో 2,723 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతింది. 220 ఎకరాల్లో వరి, 135 ఎకరాల్లో మినుము, 35 ఎకరాల్లో శనగలు, 58 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో పెసర పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో రూ.1.65కోట్ల నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారుల అంచనా.

వ్యవసాయశాఖ లెక్కలు వేరు..

వ్యవసాయ అధికారుల లెక్కలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 179.40 హెక్టార్లు, పెద్దపల్లి జిల్లాలో 67.28, వనపర్తి జిల్లాలో 1,2 66.60, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 25 హెక్టార్లు కలిపి 1538.28 హెక్టార్ల (3,845.70 ఎకరాల)లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదిక తయారు చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే నివేదికలు పంపారని రైతులు ఆరోపిస్తున్నారు.

భాగ్యనగరం గజగజ

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరవాసుల్ని చలి వణికిస్తోంది. నగరంలో గత రెండురోజుల్లో కురిసిన అకాల వర్షాలతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7-9 డిగ్రీలు తక్కువగా నమోదవడంతో చలి ప్రభావం అధికమైంది. సోమవారం నగరంలో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 22.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. మరో రెండు రోజులపాటు చలిగాలుల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారి నాగరత్నం తెలిపారు.

ఏపీని కమ్మేసిన ముసురు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌ను ముసురు కమ్మేసింది. పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. చాలా జిల్లాల్లో చల్లటి గాలులు వణికిస్తున్నాయి. కృష్ణా జిల్లాలో అకాల వర్షంతో రైతన్నలు ఇబ్బంది పడుతున్నారు. మిర్చి, మామిడి, అపరాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా జిల్లాలో సరాసరిన 20.5మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరు జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. మంగళవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. తిరుమలలో సన్నటి జల్లులు.. ఎముకలు కొరికే చలిగాలులకు భక్తులు వణికిపోయారు.



పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హఠాన్మరణం

»» తిరుమల క్యూలైన్‌లో ఉండగా గుండెపోటు

»» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

తిరుపతి అర్బన్/హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు(57) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉండగా ఆయన గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వెంకటేశ్వర పశువైద్య వర్సిటీలో సోమవారం ప్రారంభమైన పారా సైటాలజిస్ట్‌ల జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. మధ్యాహ్నం తిరుమల కొండపైకి వెళ్లారు. క్యూలైన్‌లోకి వెళ్లిన కొద్దిసేపటికే ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంకటేశ్వర్లు ఇక లేరని తెలిసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సహచర అధికారులు, ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సూర్యాపేట జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు 2013 నుంచి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో మంచి గుర్తింపుతో పాటు సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం ఆయన సారథ్యంలోనే ముందుకు సాగింది. వెంకటేశ్వర్లు మృతి పట్ల వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎస్కే సుల్తానియా తదితరులు సంతాపం తెలిపారు.

బుద్ధ గయ పేలుళ్లకు
హైదరాబాద్‌లో స్కెచ్

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన బుద్ధగయ పేలుళ్లకు లింకులు హైదరాబాద్‌లో బయటపడ్డాయి. ముష్కరులు హైదరాబాద్, సికింద్రాబాద్‌లో పథకం రూపొందించారు. బాంబుల తయారీ పథకం అమలుకు అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు బెంగళూరు పరిసర ప్రాంతాల్లో దోపిడీలకు తెగబడ్డారు. ఏడాది పాటు సాగిన విచారణలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నిజాల్ని నిగ్గుతేల్చింది. మయన్మార్‌లో రోహింగ్యాలపై సాగుతున్న అకృత్యాలకు, భారత్ నుంచి రోహింగ్యాలను బలవంతంగా పంపేయడాన్ని నిరసిస్తూ వారీ పేలుళ్లకు పాల్పడ్డట్లు ఎన్ఐఏ ఛార్జిషీటులో పేర్కొంది. బంగ్లాదేశ్‌కు చెందిన జమాతుల్ ముజాహిదిన్ సంస్థ వీటికి తెగబడింది. పేలుళ్లలో ప్రధాన నిందితుడు ఈ సంస్థకు చెందిన జాహిదుల్ ఇస్లాం అలియాస్ కౌసర్.

వ్యూహరచన ఎలా?

19 జనవరి 2018లో బుద్ధగయ కాలచక్ర మైదాన్‌లో ఐఈడీ బాంబు పేలింది. బౌద్ధ మతాన్ని టార్గెట్‌గా చేసుకుని బౌద్ధ మత గురువు దలైలామా పాల్గొన్న కార్యక్రమంలో ముష్కరులు బాంబు పేల్చారు. దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ నిరుడు ఆగస్టులో నలుగురు నిందితులను అరెస్టు చేసింది. వారిచ్చిన సమాచారం మేరకు గతేడాది డిసెంబరు చివరి నాటికి ఈ కేసుతో సంబంధమున్న మొత్తం 8 మంది ఉగ్రవాదులను అరెస్టుచేశారు. మరో ఉగ్రవాది పరారీలో ఉన్నాడు. ప్రత్యక్షంగా పాల్గొన్న మొహమ్మద్ అదీల్ షేక్, దిల్వార్ హుసేన్, అబ్దుల్ కరీం, ముస్తఫైజుర్ రహ్మాన్, జాహిదుల్ ఇస్లాం, ఆరిఫ్ హుసేన్, తూర్ ఆలం, జాహిదుల్ ఇస్లాం అలియాస్ కౌసర్‌లను ఎన్ఐఏ అరెస్టు చేసింది. వీరంతా పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు. 2017 నవంబరులో హైదరాబాద్ వచ్చిన ఉగ్రముఠా సికింద్రాబాద్ పరిసరాల్లో నకిలీ గుర్తింపు కార్డులతో షెల్టర్ తీసుకుంది. ఇక్కడి నుంచే దేశంలో ఎక్కడ, ఎప్పుడు, ఎలా పేలుళ్లకు తెగబడాలన్న అంశంపై పథక రచన చేశారు. కొద్ది రోజుల తర్వాత ఆదిల్, తూర్ ఆలంను తీసుకుని చెన్నైకి వెళ్లారు. చెన్నైలో జమాతుల్ కీలక నేత జాహిదుల్ ఇస్లాం అలియాస్ కౌసర్‌ను కలిశారు. ఈ ముగ్గురూ కలిసి హైదరాబాద్ లో రూపొందించిన పథకంపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు. 2017 డిసెంబరులో కొందరు బుద్ధగయ చేరుకుని అక్కడ పథకాన్ని అమలుచేశారు.

నిధుల కోసం దోపిడీ..

పథకం అమలుకు అవసరమైన నిధుల కోసం ఉగ్రముఠా దోపిడీ మార్గాన్ని ఎంచుకుంది. నిధులు సమకూర్చుకునేందుకు బెంగళూరు శివారు ప్రాంతాలు అనుకూలమైనవిగా ఎంచుకున్నారు. దోపిడీలతో సమకూర్చుకున్న నిధులతో హైదరాబాద్ చేరుకుని పేలుడు పదార్థాలు సిద్ధం చేసుకున్నారు. ప్రయాణాల్లో, ఇళ్ల అద్దెకు తీసుకునే సమయంలో నకిలీ గుర్తింపు కార్డులను ఉపయోగించారు.

సీఎం హెలిపాడ్‌పై హైకోర్టుకు బాధితులు

»» కౌంటర్ దాఖలుకు సర్కారుకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ కోసం హెలిపాడ్ ఏర్పాటు.. దానికోసం భూసేకరణపై రైతులు హైకోర్టును ఆశ్రయించారు. పులిగారి ప్రతిమతోపాటు మరో నలుగురు రైతులు తమ పిటిషన్‌లో రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం పిటిషనర్లకు చెందిన భూమినే హెలిపాడ్ కోసం ఎందుకు సేకరిస్తున్నారని, ప్రత్యామ్నాయ భూములను ఎందుకు పరిశీలించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వి.రఘునాథ్ వాదనను వినిపించారు. కేసీఆర్ శాశ్వత ముఖ్యమంత్రి కాదని, ఆయన సొంత స్థలం వద్ద హెలిపాడ్ నిర్మించడం వృథానే అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ వద్ద రెండు హెలిపాడ్‌లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ సంజీవ్ కుమార్ వాదిస్తూ.. కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిపాడ్‌లు నిరుపయోగమని విమానయాన శాఖ ప్రకటించిందన్నారు. జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న సీఎంకు మిలిటెంట్లతో ముప్పు ఉందని తెలిపారు.

119 గురుకులాలు.. 4,322 పోస్టులు

(మొదటిపేజీ తరువాయి)

రెగ్యులర్ సహా 1,904 పోస్టులను 2019-20లో భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ అనుమతిచ్చింది. మిగతా రెగ్యులర్ పోస్టులను దశలవారీగా భర్తీ చేయనున్నారు. వీటికి టీఆర్ఈఐఆర్‌బీ నోటిఫికేషన్ జారీ చేయనుండగా.. 595 ఔట్ సోర్సింగ్ పోస్టులను బీసీ గురుకుల సొసైటీ భర్తీ చేయనుంది. వీటిలో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లు 238 పోస్టులు, ల్యాబ్ అటెండర్లు- 238, ఆఫీస్ సబార్డినేట్ 119 పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు బీసీ రెసిడెన్షియల్ సొసైటీలో డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ పోస్టులు 2, డేటా ఎంట్రీ ఆపరేటర్ 4, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 4 భర్తీ చేయనున్నారు.

1948 ఖాళీల భర్తీకి సన్నాహాలు

ఒకేసారి భారీగా ఉద్యోగ నియామకాలను చేపట్టేందుకు టీఎస్‌పీఎస్సీ సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న 1,948 ఖాళీలు భర్తీ చేసేందుకు త్వరలో నోటిఫికేషన్ జారీచేయనుంది. ఇందులో 137 గ్రూప్-1, 339 గ్రూప్-3 ఉద్యోగాలున్నాయని టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కొత్త బీసీ గురుకులాలకు మంజూరైన పోస్టుల వివరాలు

పోస్టు పేరు	పోస్టులు	సంవత్సరం వారీగా పోస్టుల భర్తీ వివరాలు			
		2019-20	2020-21	2021-22	2022-23
ప్రిన్సిపాల్	119	119	0	0	0
జూనియర్ లెక్చరర్	833	0	0	0	833
పీజీటీ	833	0	833	0	0
టీజీటీ	071	1071	0	0	0
పీడీ	119	0	0	119	0
పీఈటీ	119	119	0	0	0
లైబ్రేరియన్	119	119	0	0	0
క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్	119	119	0	0	0
స్టాఫ్ నర్స్	119	119	0	0	0
సీనియర్ అసిస్టెంట్	119	119	0	0	0
జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు	119	119	0	0	0
మొత్తం	3689	1904	833	119	833

లోకం తీరు



నీవు పిల్లల్ని అదుపులో పెట్టుకుంటావా లేదా విడాకులు ఇచ్చేయమంటావా!?

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	13.0	24.0
అదిలాబాద్	13.2	22.8
వరంగల్	16.0	22.0
నల్లగొండ	17.0	27.0
హైదరాబాద్	17.1	22.7



ఒకే రాహుల్.. ఒకే ప్రియాంక

సైనికుల కష్టాన్ని అర్థం చేసుకున్న మోదీ ప్రభుత్వం వారికోసం ఒకే ర్యాంకు.. ఒకే పింఛన్(ఓఆర్ఓపీ) పథకాన్ని తీసుకొచ్చింది. కాంగ్రెస్ కూడా ఓఆర్ఓపీ పథకాన్ని తీసుకొచ్చింది. కానీ ఇక్కడ ఓఆర్ఓపీ అంటే ఓన్లీ రాహుల్.. ఓన్లీ ప్రియాంక(ఒకే రాహుల్ ఒకే ప్రియాంక)

- అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు



నేను హిందువును అయినందుకే వివక్ష

అమెరికా పట్ల నా నిబద్ధతపై కొంతమంది విమర్శలు చేస్తున్నారు. నేను హిందువును కాబట్టే ఇలాంటి విమర్శలు వస్తున్నాయి. హిందూయేతర నేతలను ఇలా ప్రశ్నించగలరా? భారతదేశానికి ప్రజలు ఎన్నుకున్న ప్రధాని మోదీ. అటువంటి వ్యక్తిని ఒబామా, ట్రంప్, హిల్లరీ కలిసినట్లే నేనూ కలిశా. దీని ఆధారంగా నాపై విమర్శలు సరికాదు.

- అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు తులసీ గబ్బార్డ్



ప్రమాదంలో అమెరికా ప్రజాస్వామ్యం

మన దేశ(అమెరికా) చరిత్రలో చాలా కీలక దశలో ఉన్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా అమెరికన్ల ఆకాంక్షలు, అమెరికా ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయి. మీడియా స్వేచ్ఛను హరించే.. ప్రజాస్వామిక సంస్థల ప్రతిష్ఠను దిగజార్చే నేతలు వస్తున్నారు. మన అమెరికా ఇది కాదు.

- అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు కమలాహ్యారిస్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.61	పాత ధర 71.64
కొత్త ధర రూ.75.61	కొత్త ధర 71.64

మార్పులేదు



శృంగారంతో బీపీకి చెక్

నిస్సారమైన జీవితం గడిపేవారితో పోలిస్తే.. తరచుగా సంతృప్తికరమైన శృంగారంలో పాల్గొనేవారి రక్తపోటు తగ్గుతుందని జార్జియా స్టేట్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల పరిశోధనలో తేలింది. అదీ మామూలుగా కాదు.. బీపీకి మందులు వాడితే ఎలా తగ్గుతుందో అలా తగ్గుతుందని వారు బల్లగుద్ది చెబుతున్నారు. రిసెర్చ్‌లో భాగంగా వారు కొందరు వలంటీర్లను ఎంచుకున్నారు. శృంగారంలో పాల్గొన్నతర్వాత వారి బీపీ రీడింగ్‌ను పరిశీలించగా.. 13% మేర తగ్గుదల కనిపించింది. రక్తపోటుకు సంబంధించి కొన్నిరకాల మాత్రలు వాడినప్పుడు ఇదే ఫలితం వస్తుందని వారు వివరించారు. "వారి భావప్రాప్తి ఎంత ఆనందకరంగా ఉంటే బీపీ రీడింగ్ అంతగా తగ్గడం మేం గమనించాం" అని వెల్లడించారు. శృంగార సమయంలో భాగస్వామిని హత్తుకున్నప్పుడు శరీరంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్.. ఒత్తిడిని తగ్గించడమే ఇందుకు కారణమని వారు విశ్లేషించారు. 'సెక్సువల్ మెడిసిన్' జర్నల్‌లో వారి అధ్యయనం ప్రచురితమైంది.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీనృసింహుడి జన్మనక్షత్ర పూజలు

యాదాద్రి టౌన్, జనవరి 28: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శత ఘటాభిషేక పూజలు ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా జరిగాయి. ప్రధానాలయంలోని స్వయంభువులను ఆస్థానపరంగా ఆరాధించిన అర్చకులు బాలాలయంలోని కవచమూర్తులను హారతితో కొలిచారు. కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత కలశాలను ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా పంచసూక్తాలు, మూలమంత్రాలతో హోమపూజలు నిర్వహించి మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత కలశాలతో శతఘటాభిషేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు 108 బంగారు పుష్పాలతో అర్చనలు జరిపారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ స్వాతి జన్మనక్షత్ర పూజలు సంప్రదాయరీతిలో సాగాయి.

యుద్ధభూమిలో ఐదు నెలలు!

- ఏజెంటు చేతిలో మోసపోయి ఇరాక్‌లో..
- స్పందించిన విదేశాంగ శాఖ..
- రూ.18 లక్షలు జరిమానా చెల్లింపు
- నేడు స్వదేశానికి ఇరాక్ బాధితులు


పాస్‌పోర్టు, విమాన టికెట్‌లతో బాధితులు

ఆర్మూర్, జనవరి 28: దేశం కాని దేశంలో అందులోనూ నిత్యం బాంబుల మోతతో దద్దరిల్లిపోయే చోట తల దాచుకునే చోటు లేక వారంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడిపారు. దాదాపు ఐదు మాసాలు నరకాన్ని చవి చూశారు. సరైన నీళ్లులేవు.. ఆహారంలేదు.. అయినా.. ప్రాణం మీద ఆశతో ఇన్నాళ్లు గడిపారు. చివరికి వారి గోడును భారత విదేశాంగ పట్టించుకోవడంతో బతుకు జీవుడా అంటూ స్వదేశానికి రెక్కలు కట్టుకుంటున్నారు.

ఏజెంట్ల మోసానికి బలై ఇరాక్‌లో చిక్కుకుని అష్టకష్టాలు పడిన నిజామాబాద్ జిల్లాకు చెందిన 14 మంది బాధితులు మంగళవారం స్వదేశానికి చేరుకోనున్నారు. ఉపాధి కోసం ఇరాక్ వెళ్లిన వీరు అక్కడ పని దొరకక, ఉండడానికి వసతి లేక అవస్థలు పడ్డారు. తిరిగి రావాలంటే జరిమాన కట్టాలి. కాని, వారి చేతిలో చిల్లిగవ్వ లేదు. తమ బాధను విదేశాంగ శాఖ దృష్టికి తీసుకెళ్లగా రూ.18 లక్షలు చెల్లించింది. దీంతో బాధితులు స్వదేశం రావడానికి మార్గం సుగమమైంది. బాధితుల్లో లాడే రాజేశ్వర్ (కమ్మర్‌పల్లి), ఆలూర్ గంగారెడ్డి (సిరికొండ), గొల్ల గంగన్న (నవీపేట్), గన్నాజి కృష్ణాకర్(నవీపేట్), శ్రీరాం లింబాద్రి(ధర్పల్లి), కె.మహేందర్‌రెడ్డి (కొండూర్), డి.రాజు (రామడుగు), వేలూర్ రాజేందర్ (డిచ్‌పల్లి), గూండ్ల భూమేశ్వర్ (నందిపేట్), కె.లక్ష్మణ్ (కొండూర్), పుల్ల సాయన్న (కోరట్‌పల్లి), భానోత్ చతుర్‌సింగ్(మాక్లూర్), భానోత్ వినోద్(మాక్లూర్), కొర్ర రవీందర్ (మాక్లూర్) ఉన్నారు. ఇరాక్ అంటేనే యుద్ధభూమి. నిత్యం బాంబుల మోతతో దద్దరిల్లుతుంది. అలాంటి దేశానికి వెళ్లిన వీరు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని బతికారు. గల్ఫ్‌లో ఉద్యోగాలున్నాయని చెప్పిన ఏజెంట్లు వీరి నుంచి లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేశారు. ఏజెంట్లు మంచి ఉద్యోగమని చెప్పి మోసం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు బాధితులు ఆగస్టులో, మరికొందరు సెప్టెంబరులో ఇరాక్ వెళ్లారు. ఏజెంట్‌కు తాను రూ.1.50 లక్షలు చెల్లించానని నవీపేట్‌కు చెందిన కృష్ణాకర్ తెలిపాడు. ఇరాక్‌లో ఒక బ్రోకర్ పని ఉందని ఏర్బిల్ నుంచి బగ్దాద్ తీసుకెళ్లాడని, అక్కడ పని లేదని, కనీసం ఉండడానికి వసతి లేదని, ఆహారం కూడా దొరకలేదని తెలిపాడు. ప్రాణాలతో బయటపడితే చాలనే ఉద్దేశంతో తెలంగాణ కల్చరర్ అసోసియేషన్ ప్రతినిధి పి.బసంత్‌రెడ్డికి ఫోన్ చేయగా తాము స్వదేశం రావడానికి సహకరించారని తెలిపాడు. కాగా, తమ జరిమాన చెల్లించి, స్వదేశానికి రావడానికి చర్యలు తీసుకున్న విదేశాంగ మంత్రి సుష్మస్వరాజ్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగర్ నుంచి జల విమానాలు

- 'ఉడాన్'కు ఎంపికతో ప్రయాణానికి కేంద్రం సన్నాహాలు
- టర్బో ఏవియేషన్‌కు బాధ్యతలు


(ఎయిర్ బోట్)

నాగార్జునసాగర్, జనవరి 28: నాగార్జునసాగర్ నుంచి త్వరలో విమానాలు రయ్‌మంటూ గాల్లోకి ఎగరనున్నాయి. నేలపైనా.. నీటిపైనా దిగే విమానాలు రానున్నాయి. 10 నుంచి 30 సీట్ల సామర్థ్యముండే ఈ ఎయిర్ బోట్స్ (జల విమానాలు) పర్యాటకరంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్నాయి. ఇందు కోసం ఇక్కడున్న పాత రన్‌వేతోపాటు.. కృష్ణానదిలో జలవిమానాలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలను పౌర విమానయాన శాఖ వినియోగించుకోనుంది. మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకంలో భాగంగా.. సాగర్ నుంచి జల విమానాలను నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ ఈనెల 24న మార్గదర్శకాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉడాన్ కింద 225మార్గాల్లో విమానాలను, 16 రూట్లలో ఎయిర్ బోట్స్‌ను నడపాలనేది కేంద్రం లక్ష్యం. ఇందులో భాగంగానే సాగర్ జలాశయం నుంచి విమానాలు ఎగురనున్నాయి. ఇందుకోసం ఏవియేషన్ అధికారులు గతేడాది ఏప్రిల్, అక్టోబరులలో సాగర్ జలాశయాన్ని పరిశీలించారు. ఎయిర్ బోట్స్‌ను నడిపేందుకు చిల్డ్రన్ పార్కు ప్రాంతాన్ని పరిశీలించారు. ఏపీ ప్రాంతంలో రైట్ బ్యాంకు (దక్షిణ విజయపురిలో)డ్యాం నిర్మాణ సమయంలో నిర్మించిన పాత విమానాశ్రయాన్ని కూడా అధికారులు పరిశీలించారు. సాగర్-హైదరాబాద్, సాగర్-విజయవాడ మార్గాల్లో విమానాలు నడపడానికి టర్బో ఏవియేషన్ సంస్థకు పౌర విమానయాన శాఖ బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఈ సంస్థ జల విమానాలు నడపనుంది. సాగర్‌తో పాటు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ కూడా జలవిమానాల ప్రయాణానికి అనుకూలంగా ఉందని అధికారులు నిర్ధారించారు.

పర్యాటకపరంగా సాగర్ అభివృద్ధి

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా నాగార్జునసాగర్‌కు పేరుంది. సాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో బుద్ధవనాన్ని నిర్మిస్తున్నారు. ఏటా వివిధ దేశాల నుంచి బౌద్ధులు సందర్శనకు వస్తుంటారు. హైదరాబాద్-సాగర్, విజయవాడ-సాగర్ మధ్య విమానాలు నడపటం వల్ల పర్యాటకపరంగా సాగర్ మరింత అభివృద్ధి చెందే అవకాశముంది.

దేశసేవకు వచ్చి..
విద్యుత్ తీగలకు బలి

యువకుడి ఆశలు ఆవిరి.. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో విషాదం


అరవింద్ (ఫైల్)

మల్కాజిగిరి/ఆనంద్‌బాగ్/హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడికి దేశమంటే ఎనలేని ప్రేమ! సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలు కన్నాడు. దేశ రక్షణకే పునరంకితమవ్వాలనే పట్టుదలతో శ్రమించాడు. కల నెరవేర్చుకునేందుకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చాడు. మరికొద్ది నిమిషాల్లో పరుగు ప్రారంభమవుతుందనగా.. ఆ విద్యుత్ తీగలు బలిగొన్నాయి. ఈ విషాదకర ఘటన మేడ్చల్ జిల్లా మౌలాలి ఆర్పీఎఫ్ గ్రౌండ్స్ సమీపంలో సోమవారం జరిగింది. ఈ గ్రౌండ్స్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకూ టెర్రిటోరియల్ ఆర్మీలో సైనికుల ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. సోమవారం తెలుగు రాష్ట్రాల నియామక ప్రక్రియ జరిగింది. తెలంగాణలోని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్లకు చెందిన ఎస్.అరవింద్ (19) ఆదివారం రాత్రే ఆర్పీఎఫ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నాడు. అతడు వనపర్తిలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ శ్రీవాణి కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం 4 గంటలకు లేచిన అతడు.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మిత్రుడితో కలిసి ఆర్పీఎఫ్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న స్థలంలోకి వెళ్లాడు. రోడ్డుకు అవతలి వైపు చేపట్టిన విస్తరణ పనుల్లో భాగంగా.. మట్టిని తీసి రోడ్డు పక్కన గుట్టలా పోశారు. దానిపైనే జీహెచ్ఎంసీ చెత్తాచెదారాలను డంప్ చేశారు. ఈ మట్టికుప్పలు ఎక్కిన అరవింద్ విద్యుత్ తీగలను గమనించకపోవడంతో.. వాటికి తగిలి ఒక్కసారిగా కుప్పకూలాడు. మిత్రుడు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అరవింద్‌ను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించాడు. కాగా, ఆప్రాంతంలో కొత్త హైటెన్షన్ లైను వేసిన విద్యుత్ అధికారులు పాత లైనును డమ్మీచేశారు. తీగల్ని దొంగలు ఎత్తుకెళ్తున్నారన్న ఉద్దేశంతో.. పాతలైనులోని ఓ ఫేస్‌కు కనెక్షన్ ఇచ్చారు. అధికారులు అనాలోచితంగా చేసిన ఈ పనే ఆ యువకుడి ప్రాణాలు బలిగొంది. కాగా, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రూ.1.25లక్షల పరిహారం స్వయంగా ప్రకటించారు. అప్పటికప్పుడు రూ.25వేలను మృతుడి తండ్రి అంజనప్పకు అందజేశారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటింపచేశారు. ప్రభుత్వం తరపున మరో రూ. లక్ష ఇప్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థల నిర్వీర్యానికి సర్కార్ కుట్ర

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. జగిత్యాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికై ప్రమాణం చేసిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. రాజ్యాంగాన్ని ధిక్కరించేలా టీఆర్ఎస్ సర్పంచులు గెలిస్తేనే నిధులొస్తాయని చెప్పడం సరికాదన్నారు. సీనియర్ నాయకుడైన ఈటెల రాజేందర్ అలా మాట్లాడటం చూస్తుంటే రాజ్యాంగ నిబంధనలు బుట్ట దాఖలవుతున్నాయని తెలుస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ అయిన గ్రామాల్లో వారి అధికారాలకు కూడా అడ్డుకట్ట వేయాలనే ఆలోచనతో ఉప సర్పంచ్ పదవిని తెచ్చారని ఆరోపించారు. చాలా చోట్ల సర్పంచులను తమ ఆధీనంలో ఉంచుకుని జాయింట్ చెక్ పవర్ పేరిట ఆధిపత్యం కొనసాగించేందుకు కుట్రలు సాగుతున్నాయన్నారు.

వరంగల్ సెంట్రల్ జైలులో జాబ్‌మేళా

- విడుదలైన ఖైదీలకు ఉపాధి అవకాశం

వరంగల్ అర్బన్ క్రైం, జనవరి 28: జైలు నుంచి విడుదలైన వారికి వరంగల్ కేంద్ర కారాగారంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిచారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి 139 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ సీపీ రవీందర్ మాట్లాడుతూ చాలా కాలంగా పోలీసు శాఖలో పనిచేస్తున్నా ఖైదీలకు ఉద్యోగ మేళాను తాను ఎన్నడూ చూడలేదని, ఇదంతా జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ చలువేనని ప్రశంసించారు. ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని 70 మందికి ప్లేస్‌మెంట్స్ కల్పించారు.


ఖైదీకి నియామక పత్రాన్ని అందిస్తున్న ఐజీ నర్సింహ

చోరీల్లో నట'రాజు'

మూడేళ్లలో 47 దొంగతనాలు

- స్థానికుల సాయంతో దొరికిన గజదొంగ
- రూ. 75లక్షల విలువైన సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జల్సాలు, వ్యసనాలకు బానిసైన యువకుడు.. సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తాళం వేసి ఉన్న ఇళ్లపై పగలంతా రెక్కీ నిర్వహించి.. రాత్రి చాకచక్యంగా ఆ ఇంట్లోకి ప్రవేశించి గుల్ల చేసేవాడు. స్థానికుల సాయంతో ఈ ఘరానాదొంగ ఆటకట్టించారు పోలీసులు!! రాచకొండ సీపీ మహేష్ భగవత్ గచ్చిబౌలి కమిషనరేట్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా తంగెళ్లమూడి మండలం, చిన్నమల్లేపల్లికి చెందిన వేముల నటరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు. జల్సాలకు అలవాటు పడిన అతడికి ఆటో నడపగా వచ్చిన డబ్బులు సరిపోయేవి కావు. దాంతో ఆయుర్వేదిక్ మందులను అమ్మే వ్యాపారం చేశాడు. అయినా అతడి ధన దాహార్తి తీరలేదు. సులువుగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేయాలని డిసైడ్ అయ్యాడు. పొద్దంతా తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి.. అర్ధరాత్రి టార్చిలైట్, ఇనుపరాడ్డు సాయంతో చాకచక్యంగా ఇంటి తాళాలను పగులగొట్టి.. డబ్బు, బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లేవాడు. గతంలో పశ్చిమగోదావరి పోలీసులకు చిక్కి బయటకు వచ్చిన నటరాజు 2016లో హైదరాబాద్‌కు చేరాడు. బంజారాహిల్స్‌లో ఉంటున్న తన స్నేహితుడు, కామవరపుకోటకు చెందిన పోలిమెట్ల రాజశేఖర్ వద్దకు చేరి.. అద్దె గదిలో ఉంటూ చోరీలకు సాయం చేయాలని కోరాడు. అతడి సహకారంతో మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన ఫిల్మ్ రైటర్ వడ్ల కృష్ణాచారి, బంగారం పనిచేస్తున్న రాయారపు నరేష్ అలియాస్ నరేష్‌చారి, మరో ముగ్గురితో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. 2016 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో 47 ఇళ్లను గుల్లచేశాడు. 2.10 కేజీల బంగారం, 7.50 కేజీల వెండిని దోచేశాడు.

లైట్ వేసి.. చిక్కాడు

జవహర్‌నగర్ పరిధిలో రెండు రోజుల క్రితం ఇంటి ముందు ముగ్గువేస్తున్న మహిళకు.. ఎవరూ లేని పక్కింట్లో లైటు వెలగడంతో అనుమానం వచ్చింది. వెంటనే స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని పట్టుకుని ఫింగర్‌ప్రింట్(ప్యాపిలాన్) టెక్నాలజీతో వేలిముద్రలు చెక్‌చేశారు. ఇందులో అతడి నేరాల చిట్టా బయటపడింది. మొత్తం 47 చోరీలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకొన్నాడు. దీంతో అతడితో పాటు ముఠాలోని ముగ్గురు వ్యక్తులను కటకటాల్లోకి నెట్టారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. 47 కేసులను ఛేదించి వందశాతం రికవరీ సాధించిన పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. ఘరానా దొంగను పట్టుకోవడంలో సహకరించిన నలుగురు స్థానికులకు గుడ్‌సిటిజన్ అవార్డు అందజేసి, సత్కరిస్తామన్నారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

నందిగామ/ఐనవోలు, జనవరి 28: అప్పుల బాధతో సోమవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. షాబాద్ మండలం కేశారానికి చెందిన రామయ్య (54)కు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కులగూడలో పొలం ఉంది. గతేడాది బోరు బావి, పంట సాగు కోసం అప్పులు చేసి నష్టపోయాడు. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. అలాగే, వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపూర్‌కు చెందిన కుమారస్వామి(40) మూడున్నర ఎకరాల్లో పంటలు సాగుచేశాడు. ఆర్నెళ్ల క్రితం కూతురు వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోయి..తీర్చే మార్గంలేక మనస్థాపంతో ఈనెల 23న పురుగుల మందు తాగగా సోమవారం మృతి చెందాడు.

ఏసీబీకి చిక్కిన ఎల్ఐసీ అధికారి



వరంగల్ అర్బన్ క్రైం, జనవరి 28: వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ ఎల్ఐసీ అధికారి యాదగిరి, లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శాయంపేటకు చెందిన కానిస్టేబుల్ సుమన్ గత ఏడాది గుండెపోటుతో మరణించాడు. ఎల్ఐసీ నుంచి రూ.3 లక్షలు అతడి కుటుంబానికి రావాల్సి ఉంది. సుమన్ సోదరుడు ఆ డబ్బుల కోసం సంప్రదించగా సూపరింటెండెంట్ యాదగిరి లంచం అడిగాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా అధికారులు యాదగిరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కృష్ణ ప్రదీప్‌కు టైమ్స్ అవార్డు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌తో పాటు పలు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్న ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ కృష్ణ ప్రదీప్‌ను టైమ్స్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. ఈ అవార్డును సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఓయూ వీసీ రామచంద్రం ఆయనకు ప్రదానం చేశారు.

ఎట్టకేలకు తేలిన శివ్వారం 'పంచాయితీ'

- ముస్తాబాద్‌లో ఫలితాలపై ఇంకా ఆగని లొల్లి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: రెండోవిడత ఎన్నికలు జరిగి, ఫలితం పెండింగ్‌లో పడిన మంచిర్యాల జిల్లా శివ్వారం గ్రామ 'పంచాయితీ' ఎట్టకేలకు తేలింది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపరచిన ఆరె సమ్మయ్యతోపాటు స్వతంత్రులుగా అవిడపు గణేశ్, చల్ల విశ్వంబర్ రెడ్డి బరిలో నిలిచారు. ఆరె సమ్మయ్యకు 306, అవిడపు గణేశ్, చల్లా విశ్వంబర్‌రెడ్డికి చెరో 323 ఓట్లు వచ్చాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రీకౌంటింగ్ నిర్వహించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంతో చెల్లని ఓట్లుగా పక్కనపెట్టిన 27 ఓట్లను మరోసారి పరిశీలించారు. గుర్తుపై ముద్ర పడిన ఓట్లను పరిగణనలోకి తీసుకోవడంతో గణేశ్‌కు 328ఓట్లు, విశ్వంబర్‌కు 325ఓట్లు వచ్చాయి. దీంతో గణేశ్‌కు మెజారిటీ వచ్చినట్లు ఎన్నికల సిబ్బంది వెల్లడించారు. చెల్లని ఓట్లను ఎలా పరిగణిస్తారంటూ విశ్వంబర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి విషయాన్ని నివేదించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సర్పంచ్‌గా అవిడపు గణేశ్ ఎన్నికైనట్లు అధికారులు సోమవారం ప్రకటించారు. మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏర్పడిన వివాదం కొనసాగుతోంది. టీఆర్ఎస్ మద్దతు ఉన్న గాండ్ల సుమతి గెలవడం వెనుక అవకతవకలున్నాయని.. రీపోలింగ్ జరపాలని ప్రత్యర్థి రాధ వర్గీయులు ఆందోళన చేస్తున్నారు. ఆ ఆందోళనలు సోమవారం కూడా కొనసాగాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుటే వంట వార్పు నిర్వహించారు. కాగా.. సర్పంచిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లికి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈనెల 25న జరిగిన రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో తొలుత జె.రుబ్కారాణి(27)ని పోటీ చేయించాలని ఆమె కుటుంబ సభ్యులు భావించారు. అయితే రుబ్కా గర్భిణి కావటంతో ప్రచారంలో ఇబ్బందులు ఎదురువుతాయని.. ఆమె అన్నభార్యను నిలబెట్టారు. ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. ఈ నేపధ్యంలో తన అవకాశాన్ని లాగేసుకున్నారంటూ కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగిన రుబ్కారాణి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశాన్ని హిందూరాజ్యంగా మార్చేందుకు కుట్రలు

- 11న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా: జస్టిస్ ఈశ్వరయ్య

పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఓబీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ఆరోపించారు. 103వ రాజ్యాంగ సవరణను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచాలన్న డిమాండ్‌తో ఫిబ్రవరి 11న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జంతర్ మంతర్ వద్ద జరగబోయే మహాధర్నాలో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలను బిచ్చగాళ్లుగా చూస్తున్నారని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలు, ప్రభుత్వాలు స్పందించకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

విరాళాలు–విన్యాసాలు

ప్రజాస్వామ్యం అపహాస్యమైపోతున్నదని, పారదర్శకత లేని ఈవీఎంల స్థానంలో 'పేపర్‌బ్యాలెట్ రావాలని డిమాండ్ చేస్తున్న రాజకీయ పార్టీలే మిగతా ఎన్నికల సంస్కరణల ఊసెత్తవు. రాజకీయపార్టీలకు అందుతున్న విరాళాల్లో సగం 'గుర్తు తెలియని' దాతలవేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఇటీవలి నివేదికలో వాపోయింది. మన దేశంలో విరాళాల ప్రక్రియ ఎంత లోపభూయిష్టమైనదో ఈ నివేదిక మరోమారు తెలియచెప్పింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో వేర్వేరు మార్గాల్లో ఆరు రాజకీయపార్టీలు అందుకున్న 1293కోట్ల రూపాయల్లో 689 కోట్లు గుప్త నిధులే. ఇందులో సింహభాగం అంటే, 1027కోట్లతో బీజేపీ అగ్రస్థానంలో నిలిచింది. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లకాలంలో బీజేపీ ఆదాయం దాదాపుగా రెట్టింపైతే, ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ ఆదాయం తగ్గిపోతూ వచ్చింది. మిగతా పార్టీలన్నీ బీజేపీకి ఆమడదూరంలో ఉన్నాయి. కానీ, ప్రధాని నరేంద్రమోదీ తరచుగా విపక్షాలకు ధనబలం అధికమని వాపోతుంటారు. వారం క్రితం కూడా ఆయన ధనబలం ఉన్న విపక్షాలు ఒకవైపు, ప్రజాబలం ఉన్న తాము మరోవైపు అంటూ రాబోయే ఎన్నికల పోరాటాన్ని చిత్రీకరించారు.

ఆదాయం హెచ్చడంలో భాగంగా, గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీ మిగతా ఐదుపార్టీల సగటుకంటే నాలుగురెట్లు అధికంగా గుప్త నిధులను అందుకున్నది. 20వేల లోపు విరాళాలకు, ఎన్నికల బాండ్ల ద్వారా సేకరించిన సొమ్ముకు పార్టీలు దాతల వివరాలు బయటకు చెప్పనక్కరలేదు కనుక నిధుల్లో సగానికిపైగా ఈ కోటాలో పోతున్నాయి. అధికారంలో ఉన్నది కనుక 2013–14లో 674కోట్ల ఆదాయం ఉన్న బీజేపీ 2017–18 కాలానికి 1027కోట్లకు పెరగడం, ఇదే కాలంలో అధికారంలో లేని కాంగ్రెస్ ఆదాయం 598కోట్లనుంచి 199కోట్లకు పడిపోవడం సహజం. 2017–18 కాలానికి ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలకు సమకూరిన 215కోట్లలో సైతం బీజేపీదే అగ్రస్థానం. బ్యాంకులు జారీ చేసిన బాండ్లలో 95శాతం దాని పేరిటే దాతలు రాసిచ్చేశారు. పారిశ్రామిక పెద్దలు, కార్పొరేట్ సంస్థలు ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా ఇస్తున్న విరాళాల్లోనూ బీజేపీదే పైచేయి. దీనిద్వారా 194కోట్ల విరాళాలు అందితే, 87శాతం బీజేపీకే దక్కాయి. కాంగ్రెస్‌కు పదికోట్లే వచ్చాయి. ఎన్నికల సంఘానికి రాజకీయపార్టీలు సమర్పించే వివరాలను సేకరించి, వాటిని గుదిగుచ్చి ఏడీఆర్ ఏటా ఇటువంటి విశ్లేషణలు చేస్తున్నప్పుడల్లా అనేక హితవులు చెబుతూనే ఉంటుంది. 20వేల లోపు విరాళాల విషయంలో ఏ ఒక్క వివరమూ అధికారికంగా చెప్పనక్కరలేని పార్టీలు, దానిని పైబడిన మొత్తాలకు సంబంధించిన వివరాల్లో సైతం దాపరికాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని అది అంటున్నది. పాన్ నంబర్లు ఇవ్వకపోవడం వంటి పలు లోపాలను ఎత్తిచూపుతూ, పారదర్శకత పాటించమనీ, ఎన్నికల సంఘానికి సమర్పించే పత్రాల్లో ఏ అంశాన్నీ ఖాళీగా వదిలివేయకుండా పూర్తిగా నింపాలని అది పార్టీలను కోరుతున్నది. ఏ రాజకీయపార్టీ కూడా విరాళాలు వద్దని అనదు. అధికారంలో ఉన్నది కనుక మొత్తం విరాళాల్లో గరిష్ఠభాగం బీజేపీకి దక్కడమూ సహజం. ఇప్పుడు దీనిపై గింజుకుంటున్న పార్టీలు సైతం రేపు ఎన్నికల్లో నెగ్గితే భారీ విరాళాలు అందుకుంటాయి. ముసాయిదాలో అభ్యర్థులు ఎన్నికల్లో చేసే ఖర్చుపై పరిమితి ఉన్నది కానీ, రాజకీయపార్టీపై లేదు. పార్టీ విరాళాలపై పరిమితి విధిద్దామని ఇటీవల ఎన్నికల సంఘం అంటే, బీజేపీ ఈ ప్రతిపాదనను కొట్టిపారేసింది. 2017లో బీజేపీ హడావుడిగా 2013నాటి కంపెనీల చట్టాన్ని మార్చి కార్పొరేట్ విరాళాల ప్రక్రియను ఎంతో సులభతరం చేసింది. ఈ ఫైనాన్స్‌బిల్లును అన్ని పార్టీలూ ముక్తకంఠంతో ఆమోదించి సహకరించాయి. కార్పొరేట్ సంస్థలు నికరలాభంలో ఏడున్నరశాతం మించి విరాళాలు ఇవ్వకూడదన్న నిబంధన తొలగిపోయి, ఇచ్చిన విరాళాలను సైతం తమ పద్దుల్లో చూపనక్కరలేని స్వేచ్ఛ వాటికి దక్కింది. ఇప్పటికే పెద్దమొత్తంలో అందుతున్న నల్లధనాన్ని చిన్నచిన్న ముక్కలు చేసి 20వేల రూపాయల లోపు విరాళాలుగా రాజకీయపార్టీలు పద్దుల్లో రాసిపారేస్తున్నాయి. ఎలక్టోరల్ బాండ్ పరిస్థితిని మార్చకపోగా, దాతకూ, స్వీకర్తకూ, ప్రజలకూ మధ్యన అనేక ఇనపతెరలు కట్టి, రహస్య విరాళాలకు రెడ్‌కార్పెట్ పరిచింది. ఇప్పుడు వెయ్యి, పదివేల రూపాయల విలువగల ఎలక్టోరల్ బాండ్స్ కాక, పదిలక్షలనుంచి కోటిరూపాయల పరిధిలోనివి 99శాతం అమ్ముడుపోతూ వాటిలో గరిష్ఠం అధికారపక్షానికే దక్కుతున్నప్పుడు ధనికులు, కార్పొరేట్ సంస్థలు ఈ సదవకాశాన్ని ఎంత చక్కగా వాడుకుంటున్నారో అర్థమవుతూనే ఉంది. సమాచార హక్కు చట్టం పరిధిలోకి రమ్మంటే తాడెత్తున మండిపడిన రాజకీయపక్షాలన్నీ జవాబుదారీతనం, పారదర్శకత వంటివి ప్రజలనుంచి ఆశిస్తూ, తాము మాత్రం వాటికి అతీతమని నమ్ముతాయి.

జీడీపీ మాయలో భారత్ ఆర్థికోన్నతి

భారత్ 2019లో బ్రిటన్‌ను అధిగమించి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్నదని 'గ్లోబల్ కన్సల్టింగ్ కంపెనీ 'ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్' పేర్కొన్నది. 2018లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పేరుపొందిన భారత్ నిజంగానే ప్రపంచ అగ్రగామి ఆర్థిక శక్తిగా రూపొందనున్నదా?

అభివృద్ధి అంచనాకు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అనేది ఒక సుసంగత ప్రమాణమేమీ కాదు. వివిధ అసంగత విషయాలు జీడీపీలో మిళితమవుతున్నాయి. ఆర్థికాభివృద్ధిని అంచనా వేయడంలో అన్ని రకాల ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకోవటం వాటిలో ఒకటి. ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురై గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకోవడానికి రూ.2లక్షలు ఖర్చు చేస్తారు. అప్పుడు జీడీపీ రూ.2 లక్షల మేరకు పెరుగుతుంది. కాలుష్యాన్ని నిరోధించుకోవడానికి ధరించే ముసుగులు (పొల్యూషన్ మాస్క్), ఆపిల్ పండ్లు కూడా అంతే మొత్తంలో జీడీపీని పెంచుతాయి.

వరల్డ్ ఎకనామిక్ ఫోరం రూపొందించే పర్యావరణ నిర్వహణ సూచీలో బ్రిటన్ 6వ స్థానంలో ఉన్నది. 180 దేశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించే ఆ సూచీలో భారత్ 177వ స్థానంలో ఉన్నది. 2019లో బ్రిటన్ జీడీపీ 2900 బిలియన్ డాలర్లను, భారత్ జీడీపీ 3000 బిలియన్ డాలర్లను మించిపోగలదని ప్రైస్ వాటర్ హౌస్ అంచనా. ఈ అంచనా దృష్ట్యా బ్రిటన్ కంటే భారత్ జీడీపీనే అధికమని స్పష్టమవుతుంది. అయితే బ్రిటన్ ప్రజలు 2900 బిలియన్ డాలర్ల విలువైన ఆపిల్ పండ్లను వినియోగించుకుంటుండగా భారత్ ప్రజలు 3000 బిలియన్ డాలర్ల విలువైన పొల్యూషన్ మాస్క్‌లను వినియోగించుకోబోతున్నారు. సరే, ఇప్పుడు అత్యంత వేగంగా పెరుగుతున్న మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు విషయాన్ని నిశితంగా చూద్దాం. 2018లో భారత్ వృద్ధిరేటు 7.4 శాతంకాగా 2017లో చైనా వృద్ధిరేటు 6.6శాతమని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ గణించింది. ఈ అంకెల ప్రాధాన్యాన్ని వివరించే విషయంలో నేను ఒకింత స్వేచ్ఛ తీసుకుంటున్నాను అర్థం చేసుకోవడానికి ఆ వృద్ధిరేట్లు 2017 సంవత్సరపు భారత్, చైనాల ఆర్థిక వ్యవస్థలకు వర్తిస్తాయని భావించడమే నేను తీసుకుంటున్న స్వేచ్ఛ.

2017లో భారత్ జీడీపీ 2597 బిలియన్ డాలర్లు. 7.4 శాతం పెరుగుదల అంటే 2017లో మన జీడీపీ 197 బిలియన్ డాలర్లు అధికమవుతుంది. 2017లో చైనా జీడీపీ 12, 237 బిలియన్ డాలర్లు . 6.6 శాతం పెరుగుదల అంటే ఆ ఏడాది చైనా జీడీపీ 807 బిలియన్ డాలర్లు అధికమవుతుంది. దీన్ని బట్టి స్పష్టమయ్యేదేమంటే 2018లో చైనా తన జీడీపీకి అదనంగా చేర్చిన 807బిలియన్ డాలర్లలో నాలుగోవంతుకంటే తక్కువగా 197 బిలియన్ డాలర్లు మాత్రమే మన జీడీపీకి అదనంగా చేర్చాము. అయినప్పటికీ మనది అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ!

భరతవాక్యం

■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

ఇది ఎలా సంభవించింది? మనం వృద్ధిరేటును ఒక తక్కువ పెరుగుదల ప్రాతిపదికన గణిస్తున్నాము. ఒక ఉదాహరణ ద్వారా దీన్ని అర్థం చేసుకుందాం. ఒక అనిపుణ శ్రామికుని దినసరి వేతనం రూ.300 నుంచి రూ.400 కి పెరిగింది. అంటే అతని వేతన వృద్ధిరేటు 33 శాతం. ఒక వ్యాపారి ఆదాయం రూ.300 లక్షల నుంచి రూ.330 లక్షలకు పెరుగింది. అంటే ఆ వ్యాపారి ఆదాయ వృద్ధి రేటు 10 శాతం. రూ.300 దినసరి వేతనాన్ని ఆర్జిస్తున్న ఇద్దరు శ్రామికుల ఆదాయ వృద్ధిని సరిచూడడమే హేతుబద్ధమవుతుంది. ఆ ఇరువురిలో ఒకరి వేతనం రూ.400కి పెరిగింది. అప్పుడు అతను, తన ఆదాయ వృద్ధికి ఆనందపడడం సహేతుకమే. మరో శ్రామికుని వేతనం రూ.330కి మాత్రమే పెరుగుతుంది. ఈ వాస్తవం దృష్ట్యా ఒకే స్థాయి ఆదాయమున్న రెండు దేశాల వృద్ధి రేట్లను మాత్రమే సరిచూడాలి.

భారత్ 2019లో బ్రిటన్‌ను అధిగమించి ఐదో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్నదన్న అంచనాలో నిజమేమిటి? 2017లో బ్రిటన్ తలసరి జీడీపీ 39,800 డాలర్లు కాగా భారత్ తలసరి జీడీపీ 1983 డాలర్లు. తలసరి జీడీపీని జనాభా సంఖ్యతో గుణిస్తే భారత్ జీడీపీ 3000 బిలియన్ డాలర్లు అవుతుంది. ఇది బ్రిటన్ జీడీపీకంటే అధికమే కానీ, ముంబై మహానగర కోటిమంది పౌరులు తాము రతన్ టాటాకంటే అధికంగా ఆర్జిస్తున్నామని గొప్పలు చెప్పుకోవటం వంటిదే ఇది.

1990వ దశకం తొలినాళ్ళలో చైనా ఆదాయ స్థాయి నేటి భారత్ ఆదాయ స్థాయితో సమంగా ఉండేది. అప్పట్లో చైనా వృద్ధిరేటు దాదాపు 12 శాతంగా ఉండేది. కనుక 1991 నాటి చైనా వృద్ధిరేటు (12 శాతం)ను 2018 నాటి భారత్ వృద్ధిరేటు (8 శాతం)తో పోల్చడమే ప్రామాణిక పోలిక అవుతుంది. భారత్ 2019లో బ్రిటన్, ఫ్రాన్స్‌ను అధిగమించి అమెరికా, చైనా, జపాన్, జర్మనీల తరువాత ఐదో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్నదని ఆర్థిక నిపుణులు అంటున్నారు కదా. ఇప్పుడు ఈ విషయాన్ని నిశితంగా పరిశీలిద్దాం. ఇక్కడ మనం జనాభా పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. తక్కువ జనాభా వున్న అమెరికా, జపాన్, జర్మనీలు అత్యధిక జనాభా ఉన్న చైనా, భారత్‌ల కంటే అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ఇది ముంబై, దుబాయి ఆదాయాలను పోల్చి చూడడం లాంటిది. లేదూ ఒక అతిపెద్ద అవిభక్త కుటుంబ ఆదాయాన్ని ఒక చిన్న కుటుంబ ఆదాయంతో పోల్చిచూడడం లాంటిది. సరైన తుల్య పరిశీలన ఏమిటంటే ప్రస్తావిత దేశాలలోని ప్రతివ్యక్తి ఆర్జించే ఆదాయాలను పోల్చి చూడాలి. ఆ ఆదాయాన్ని 'తలసరి జీడీపీ' (జీడీపీ పెర్ కేపిటా) అంటారు. 2017లో బ్రిటన్ తలసరి జీడీపీ 39,800 డాలర్లు కాగా భారత్ తలసరి జీడీపీ 1983 డాలర్లు. అంటే ప్రతి భారతీయ పౌరుడూ ప్రతి బ్రిటిష్ పౌరుని ఆదాయంలో 20వ వంతు మాత్రమే ఆర్జిస్తున్నాడు. అయితే భారత్ అత్యధిక జనాభా గల దేశం. తలసరి జీడీపీని జనాభా సంఖ్యతో గుణిస్తే భారత్ జీడీపీ 3000 బిలియన్ డాలర్లు అవుతుంది. ఇది బ్రిటన్ జీడీపీకంటే అధికమని మరి చెప్పనవసరం లేదు. మన పరిస్థితి ఎలా ఉందంటే ముంబై మహానగర కోటి మంది పౌరులు తాము రతన్ టాటాకంటే అధికంగా ఆర్జిస్తున్నామని గొప్పలు చెప్పుకున్నట్టుగా కాదూ?!

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కాంగ్రెస్ ఆత్మహననం!

భారతీయ జనతా పార్టీ అధికార ప్రాభవం ఇంకెన్నాళ్ళు? సార్వత్రిక ఎన్నికల దాక అని నెల రోజుల క్రితం వరకు నేను గట్టిగా విశ్వసించాను. బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావడం జాతి హితానికి తోడ్పడదని ప్రజాశ్రేణులూ, తమ మనుగడకు ముప్పు అని ప్రత్యర్థి రాజకీయ పక్షాలు గ్రహించాయి. మన ప్రజాస్వామ్యాన్ని సంరక్షించగలిగే ఒక 'మహా కూటమి' రూపురేఖలు దిగంతంలో మంచుతెరల నుంచి నెమ్మదిగా, అయితే స్పష్టంగా, గోచరమవసాగాయి. అయితే బీజేపీని అధికారం నుంచి తొలగించడం మినహా ఆ మహా కూటమికి సుస్పష్ట ఎజెండా లేదు. మోదీకి దీటైన నాయకుడు కూడా దానికి లేరు. మరీ ముఖ్యంగా భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీ కూడా ఇంకా జరగనే లేదు. అయితే ఒక విషయం మాత్రం సందేహాతీతమైనది. ఆ మహాకూటమి స్థిరంగా, సమైక్యంగా ఉండగలిగితే బీజేపీకి ఘోర పరాజయం ఖాయం. క్రమరాహిత్యమే ఈ జగత్తు, మానవ జీవితపు వాస్తవం కదా. బీజేపీకి అటువంటి మహాపజయం అసంభవంగా ఇప్పుడు కన్పిస్తోంది! కారణమేమిటి? ఎన్నికల పొత్తులపై కాంగ్రెసేతర పక్షాల పునరాలోచన మాత్రం కాదు. అది కాంగ్రెస్ పార్టీ తన శక్తిసామర్థ్యాలను అతిగా భావించుకోవడమే. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, ఎస్పీ–బీఎస్పీ కూటమి రెండిటిపై అన్ని స్థానాలలోను పోటీ చేయాలని జనవరి 13న కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయమే అందుకు నిదర్శనం. రాబోయే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి యూపీలో పొత్తులు కుదుర్చుకోవడంలో తనకు తగు ప్రాధాన్యమివ్వని ఎస్పీ, బిఎస్పీల నిర్లక్ష్య వైఖరికి కాంగ్రెస్ ప్రతిస్పందనే ఒంటరి పోటీ నిర్ణయం!

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ చివరిసారి అధికారంలో ఉన్నదెప్పుడు? ప్రజలు మరచిపోయారు సుమా! మూడు దశాబ్దాలుగా అధికారానికి దూరమైన యూపీ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త చైతన్యాన్ని, క్రియాశీలతను తీసుకురావడానికి రాహుల్ గాంధీ సంకల్పించారు. కాంగ్రెస్ పునరుజ్జీవానికై సోదరి ప్రియాంక గాంధీని క్రియాశీల రాజకీయాలలోకి ఆహ్వానించారు. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా నియమించి తూర్పు యూపీ వ్యవహారాల బాధ్యతలను ప్రియాంకకు అప్పగించారు. లోక్ సభకు తూర్పు యూపీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో ప్రియాంకదే తుది నిర్ణయం. ఆ అభ్యర్థులను గెలిపించే బృహత్తర బాధ్యత కూడా ఆమెదే. ప్రజా జీవితపు విధ్యుక్త ధర్మ నిర్వహణ పట్ల పరిపూర్ణ చిత్తశుద్ధి, దేశ శ్రేయస్సు విషయంలో అచంచల నిబద్ధత ఉన్న యువ నేత ప్రియాంక. మరో ముఖ్యమైన విషయమేమిటంటే అచ్చు నానమ్మ (ఇందిరా గాంధీ)లా ఉండే ప్రియాంక మహిళా ఓటర్లను విశేషంగా ఆకట్టుకోగలుగుతారు. తద్వారా కాంగ్రెస్‌కు ఘన విజయాలు సమకూర్చగలరని రాహుల్‌తో పాటు అశేష కాంగ్రెస్ వాదులు విశ్వసిస్తున్నారు.

భారతదేశపు పురాతన రాజకీయ పార్టీకి (దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే) ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దాల నాటి పూర్వ వైభవం పునరుద్ధరణ ప్రియాంక ప్రవేశంతో సాధ్యమవుతుందా? బీజేపీ, ఎస్పీ–బీఎస్పీ కూటమి నుంచి మెజారిటీ సీట్లను కాంగ్రెస్ స్వాయత్తం చేసుకోవలసి వున్నది. ఇందుకు పోలయిన ఓట్లలో 2014లో 7.55 శాతం నుంచి 2019లో కనీసం 35 శాతానికి పెంచుకోవల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఎంతైనా ఉన్నది. అంతేకాదు, ఆ ఓట్లను బీజేపీ, ఎస్పీ–బీఎస్పీల నుంచి సమస్థాయిలో కైవశం చేసుకోవల్సి వున్నది. గత ఇరవై సంవత్సరాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది ఎన్నికల (నాలుగు లోక్‌సభ, నాలుగు శాసనసభ)లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ రాబోయే లోక్‌సభ ఎన్నికలలో తన ఓట్ల వాటాను కనీసం 35 శాతానికి పెంచుకోవడం అసాధ్యమని స్పష్టంగా చెప్పవచ్చు.

ఈ అంశాన్ని మరింత వివరంగా చూద్దాం. బీజేపీ ఓట్ల వాటా 2009లో 17.5 శాతం నుంచి 2014లో 42.6 శాతానికి పెరిగింది. శాసనసభ ఎన్నికలలో ఈ ఓట్ల వాటా 2012లో 15 శాతం నుంచి 2017లో 39.7 శాతానికి పెరిగింది. ఇదెలా సాధ్యమయింది? మోదీ ప్రభంజనం. యూపీఏ రెండో ప్రభుత్వ పాలన తీరు తెన్నుల పట్ల తీవ్ర అసంతృప్తితో పాటు మాటల మాంత్రికుడు మోదీ మహిమాన్విత వాగ్దానాలలో పరిపూర్ణ విశ్వాసం ఫలితంగానే బీజేపీ ఘన విజయాలు సాధించగలిగింది. అయితే ఇప్పుడు మోదీ హవా మందగించింది. 2014 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఓట్ల వాటాలో 25 శాతం పెరుగుదలలో దాదాపు 11 శాతం కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లేనని, వాటిని మళ్ళీ పార్టీకి సాధించవచ్చని రాహుల్ గాంధీ, ఆయన సలహాదారులు విశ్వసిస్తున్నారు. అయితే 2017 శాసనసభ ఎన్నికలలో బీజేపీ ఓట్ల వాటాను గమనిస్తే కాంగ్రెస్ నాయకుల ఆశలు అడియాశలయ్యే అవకాశమున్నది. 2014–17 సంవత్సరాల మధ్య యూపీ శాసనసభకు జరిగిన ప్రతి ఉప ఎన్నికలోనూ ఎస్పీనే విజయం సాధించింది. ఈ అపజయాలకు తోడు పెద్ద నోట్ల రద్దు ప్రజలను కనీవినీ ఎరుగని వెతలకు గురిచేసినప్పటికీ 2017 శాసనసభా ఎన్నికలలో బీజేపీకి 39.7 శాతం ఓట్లు లభించాయి. 2014లో లభించిన ఓట్ల కంటే కేవలం మూడు శాతం మాత్రమే తక్కువ. ఈ ఓట్లతోనే యూపీలోని 404 శాసనసభా స్థానాలలో 312ను బీజేపీ కైవశం చేసుకోగలిగింది. ఈ అసంగత ఫలితాలకు కారణమేమిటి? శాసనసభ ఉప ఎన్నికలలో బీఎస్పీ పోటీచేయకపోవడంతో ఆ పార్టీ ఓట్లన్నీ ఎస్పీకి దక్కాయి. అయితే 2017 అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీనే కాకుండా ఎస్పీని సైతం తన సొంతంగా మట్టి కరిపించడానికి మాయావతి పూనుకున్నారు. అందుకే ఆమె పార్టీ ప్రతి స్థానానికీ పోటీ చేసింది. పైగా ముస్లింలను ఆకట్టుకోవడానికై 100మంది ముస్లిం అభ్యర్థులను బీఎస్పీ తరపున రంగంలోకి దించారు. దీంతో అఖిలేశ్ యాదవ్ కూడా ఎస్పీ తరపున పెద్ద సంఖ్యలో ముస్లింలను పోటీ చేయించారు. బీఎస్పీ, ఎస్పీలు ముస్లింలకు ప్రాధాన్యమివ్వడాన్ని అమిత్ షా తెలివిగా బీజేపీ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. 'మీరు గనుక బీజేపీ వెనుక నిలువకపోతే దళితుల, ఓబీసీల మద్దతుతో ముస్లింలే అధికారంలోకి వస్తారని' హిందూ అగ్రకులాల వారిని అమిత్ షా హెచ్చరించారు. ఈ హెచ్చరిక ఫలించింది.



ఉత్తరప్రదేశ్‌లో ఒంటరిగా పోటీ చేయడం ద్వారా కాంగ్రెస్ సాధించగలిగేదేమిటి? పూజ్యం. మహా అయితే ఇప్పటికే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న, ఎస్పీ–బీఎస్పీ కూటమి ఇవ్వడానికి సుముఖంగా ఉన్న అమేథీ, రాయబెరిల్లీ స్థానాలలో మాత్రమే కాంగ్రెస్ గెలిచే అవకాశమున్నది. అన్ని సీట్లకు పోటీ చేయాలనే నిర్ణయం ద్వారా రాహుల్ గాంధీ వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ భవితవ్యాన్నే పణంగా ఒడ్డుతున్నారు.

ఇప్పుడు ఎస్పీ–బీఎస్పీ కలసి పోటీ చేస్తున్నాయి. రెండేళ్ళ నాటి అమిత్ షా హెచ్చరిక హిందూ ఓటర్ల మనస్సులలో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. మరి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఓట్ల శాతం మరింతగా తగ్గిపోగలదని భావించడం తెలివి తక్కువ తనమే అవుతుంది. మరి ఎస్పీ–బీఎస్పీ ఓట్ల వాటా అయినా తగ్గుతుందా? ఇది మరింత అసాధ్యం. ఎందుకని? ప్రగాఢ కులాభిమానమే ఎస్పీ, బీఎస్పీ ఓటర్లకు ప్రేరణ. గత ఇరవై సంవత్సరాలలో ఈ రెండు పార్టీల మొత్తం ఓట్ల శాతం శాసనసభా ఎన్నికలలో 44 నుంచి 56 శాతం మధ్య, లోక్‌సభా ఎన్నికలలో 42 నుంచి 51.5 శాతం మధ్య ఉన్నది. 2014 మోదీ ప్రభంజనంలో కూడా ఈ రెండు పార్టీలకు లభించిన మొత్తం ఓట్లు, బీజేపీకి లభించిన ఓట్ల కంటే అర శాతం మాత్రమే తక్కువ! ఇక 2017 శాసనసభా ఎన్నికలలో అనేక స్థానాలలో ఓడిపోయినప్పటికీ ఈ రెండు పార్టీలకు లభించిన మొత్తం ఓట్లు బీజేపీకి లభించిన మొత్తం ఓట్ల కంటే 5.5 శాతం అధికం. 2014–18 మధ్య జరిగిన ఉప ఎన్నికలు అన్నిటిలోనూ దళితుల ఓట్లు సమాజ్ వాదీ పార్టీకో లేదా రాష్ట్రీయ లోక్‌దళ్‌కో దక్కాయి. కనుక ఎస్పీ, బీఎస్పీల ఓట్లు రాబోయే లోక్‌సభ ఎన్నికలలో మరే ఇతర పార్టీకి ఎట్టి పరిస్థితుల లోను పడబోవని భావించడమే అన్ని విధాల మంచిది.

మరో రెండు ప్రశ్నలు మిగిలివున్నాయి. అవి: ఉత్తరప్రదేశ్‌లో ఎవరి మద్దతును పొందగలనని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తోంది? ప్రియాంక ప్రభావం ప్రస్తుత పరిస్థితులలో గణనీయమైన మార్పును సాధించగలదా? మొదటి ప్రశ్నను తరచిచూస్తే ఎవరికి ఓటు వేయాలో ఇంకా నిర్ణయించుకోని వర్గం ఒకటి ఉన్నది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రప్రథమంగా ఓటు హక్కును వినియోగించుకోనున్న దాదాపు రెండు కోట్ల మంది యువ ఓటర్లే ఆ వర్గం. కొత్త ఉద్యోగాల సృష్టి లేని ఎనిమిది సంవత్సరాల ఆర్థికాభివృద్ధి, విధ్వంసకర పెద్ద నోట్ల రద్దు, అస్తవ్యస్తంగా వస్తు సేవల పన్ను అమలు, 2014 సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నరేంద్రమోదీ వైఫల్యాలను చూసిన తరువాత ఈ యువ ఓటర్లు ప్రస్తుత అధికార పార్టీకే వారు ఓటు వేస్తారా? ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు భిన్న, విశ్వసనీయమైన కార్యక్రమం ఉన్న పార్టీ వైపు తొలిసారి ఓటు వేయనున్న ఓటర్లు మొగ్గకపోవడం ఎంతైనా ఆశ్చర్యకరమవుతుంది. చట్టబద్ధ పాలన పునరుద్ధరణ, రాజకీయాల ప్రక్షాళన, రాజ్యవ్యవస్థను ప్రజలకు జవాబుదారీని చేయగల పార్టీ వైపే వారు మొగ్గు తారనడంలో సందేహం లేదు. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ విషయమై రాహుల్ గాంధీ వద్ద ఏమైనా ప్రణాళికలు ఉండి ఉన్నట్టయితే ఆయన ఇంతవరకు వాటి విషయమై ప్రజలను విశ్వాసంలోకి తీసుకోలేదు. ఎన్నికలేమో సమీపించాయి. ఇప్పుడు అటువంటి బహిరంగ సమాలోచనలకు వ్యవధి కూడా లేదు.

ఇక ప్రియాంక విషయానికి వస్తే సార్వత్రిక ఎన్నికలకు మూడు నెలలు ముందు మాత్రమే ఆమెను రంగంలోకి తీసుకురావడం దేన్ని సూచిస్తుంది? శక్తిమంతమైన అధికార పార్టీని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొని వున్న నిరాశా నిస్పృహలనే కాదూ? కాంగ్రెస్‌వారు మరచి పోయివుండవచ్చు గానీ వారికి ఒక వాస్తవాన్ని గుర్తుచేయక తప్పదు. 2007 యూపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా, ఇప్పుడు ప్రియాంకను తీసుకువచ్చినట్టే అప్పుడు రాహుల్‌ను కూడా కేవలం కొద్దినెలలముందు మాత్రమే రంగంలోకి దించారు. అప్పటికి రాహుల్ కనీసం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా యూపీలో ఇతోధిక కృషి చేశారు. యువజనులను పార్టీ వైపు ఆకర్షించి, పార్టీ సంస్థల్లో వారికి బాధ్యతలను అప్పగించడానికి ఆయన ఎంతైనా ప్రయత్నించారు. కాంగ్రెస్ శ్రేణులు అప్పుడు కూడా రాహుల్ అద్భుత ఫలితాలు సాధించి యూపీలో కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చేస్తారని విశ్వసించారు. అయితే జరిగిందేమిటి? కాంగ్రెస్ ఓట్ల వాటా 2002లో 8.96 నుంచి 2007లో 8.61 శాతానికి తగ్గిపోయింది!

మరి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో యూపీలో అన్ని స్థానాలకు ఒంటరిగా పోటీచేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి సిద్ధించేదేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం పూజ్యం. తీవ్ర నైరాశ్యానికి లోనుచేసే సమాధానమిది, సందేహం లేదు. కాంగ్రెస్‌కు మహా అయితే, ఇప్పటికే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న, ఎస్పీ–బీఎస్పీ కూటమి ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్న రెండు స్థానాలు అమేథీ, రాయబరేలీ మాత్రమే దక్కగలవు. ఇటువంటి పరిస్థితుల్లో ఒంటరిగా పోటీ చేయడానికి రాహుల్ చేస్తున్న సాహసం సాధించేదేమిటి? కాంగ్రెస్ భవితవ్యానికి తీరని హాని కల్గించడమేనని చెప్పక తప్పదు. 2014లో ఆ రెండు నియోజకవర్గాల లోనూ సమాజ్ వాదీ పార్టీ రంగంలో లేక పోవడంవల్లే కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయానికి విశేషంగా తోడ్పడింది. ఇది అమేథీ విషయంలో మరింత వాస్తవం. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆ రెండు నియోజక వర్గాలలో ఎస్పీ, బీఎస్పీ తమ సంయుక్త అభ్యర్థిని నిలబెడితే కాంగ్రెస్ గెలుపు ఎంత కష్టమవుతుందో ఊహించుకోవచ్చు. ముఖ్యంగా అమేథీలో, గత ఎన్నికలలో గణనీయమైన ఓట్లు సాధించుకున్న బీజేపీ ఈసారి ఆ నియోజకవర్గాన్ని స్వాయత్తం చేసుకున్నా ఆశ్చర్యంలేదు. యూపీలో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించడం ద్వారా రాహుల్ గాంధీ తన సొంత సీటుకు ముప్పునే కాకుండా తన కుటుంబ రాజకీయ భవితవ్యానికి అంటే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు కూడా తీరని నష్టం కలిగించనున్నారని చెప్పవచ్చు. ఇది నిష్ఠుర సత్యం. కాసినోలో అత్యంత ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు ఒక జూదరి ఎంత వ్యసనపరుడు అయినా తన డబ్బును పందెం కాస్తాడా?


■ ప్రేమ్ శంకర్ ఝా
సీనియర్ పాత్రికేయుడు

(ది వైర్)

ప్రాంతీయ పక్షపాతం లేని ప్రజానాయకుడు

సహజ సంపదలు, చారిత్రక వారసత్వాలు, సంస్థాగత ఏర్పాట్లలో విస్తృత వ్యత్యాసాలు ఉన్న మూడు భిన్న ప్రాంతాలు కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. ఎన్టీఆర్ కోస్తాంధ్రలో జన్మించినప్పటికీ ఆయన చరిష్మాకు ప్రాంతీయ పరిమితులు లేవు. అన్ని ప్రాంతాలకూ ఆయన హీరోయే. భిన్న ప్రాంతాల ప్రజలలో సంకుచిత భావాలను రెచ్చగొట్టడం ద్వారా ఆయనకు గల ప్రజాదరణను దెబ్బతీయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. 1985లో ప్రభుత్వ విభాగాలలో జరిగిన నియామకాలపై తెలంగాణ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చేశారు. వారి ఆందోళనకు దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను మొగ్గలోనే తుంచివేశారు. ఆ తరువాత 2000 సంవత్సరంలోనే ఆ డిమాండ్ మళ్ళీ ఊపిరి పోసుకున్నది.

రాయలసీమ ప్రాంతంలో ఆయనకు ఉన్న ప్రజాదరణ అపారమైనది. ఎన్టీఆర్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వైఎస్ రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ రాయలసీమకు



జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని ప్రారంభించింది. రాయలసీమ అభివృద్ధి సాధనకై పోరాడేందుకు 1984లో రిటైర్డ్ సీనియర్ పోలీస్ అధికారి కె. రామచంద్రారెడ్డి అధ్యక్షతన రాయలసీమ అభ్యుదయ సంఘం అనే రాజకీయేతర సంస్థ ఒకటి ఏర్పడింది. ఎన్టీఆర్ ప్రభుత్వం 'తమ సమస్యల పట్ల ఉదాసీన వైఖరిని కొనసాగిస్తుందని' రాయలసీమ ప్రాంత ఉద్యోగులు కూడా ఆరోపించసాగారు. 1984లో రద్దయిన శాసన సభలో టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్.వి.రమణారెడ్డి రాయలసీమ విమోచన సమితిని ఏర్పాటు చేశారు. 1985 తొలినాళ్ళలో ఆయన నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఆయన కూడా, ఎన్టీఆర్ చైతన్యరథంను అనుకరిస్తూ రూపొందించుకున్న రాయలసీమ విమోచన రథంలో ఎనిమిదిరోజుల పాటు సీమ జిల్లాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి ఆయనకు అప్రకటిత మద్దతు లభించింది. కాంగ్రెస్ చిక్కులను సృష్టిస్తుందని ఆరోపిస్తూ 'మన సొంత ఎమ్మెల్యేలే ఇటువంటి ఆందోళనను ప్రారంభించి, ప్రాంతీయభావాలను రెచ్చగొట్టదలుచుకున్నవారికి సహకరించడం దురదృష్టకరమని' ఎన్టీఆర్ ఆరోపించారు. లోక్ సభ, శాసనసభ ఎన్నికలపై రాయలసీమ ఆందోళన ఏ ప్రభావాన్ని చూపలేదు. రాయలసీమలోని మొత్తం ఎనిమిది లోక్‌సభా స్థానాలను టీడీపీ గెలుచుకున్నది. ఇక ఆ ప్రాంతంలోని 54 శాసనసభా నియోజకవర్గాలలో 39 టీడీపీ కైవశమయ్యాయి. రాయలసీమ ఆందోళనను ప్రారంభించడానికి కాంగ్రెస్ పార్టీకి 1988 ఆగస్టులో ఒక 'సరైన' సమయం లభించింది. డజనుమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసన సభలో స్పీకర్ పోడియం వద్ద నిరాహారదీక్షను ఆరంభించారు. సభను వాయిదా వేశారు. ఆందోళనకు కూర్చున్న ఎమ్మెల్యేలను బయటకు తీసుకువెళ్ళగా వారు ఎమ్మెల్యే క్వార్టర్‌లో దీక్షను కొనసాగించారు. రాయలసీమ సాగునీటి అవసరాలకు అదనంగా 370 టిఎంసీల నీటిని కేటాయించాలని, హైదరాబాద్‌కు కృష్ణా జలాలను గాక గోదావరి జలాల సరఫరా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 30 వేల నుంచి 50 వేల క్యూసెక్కులకు పెంపుదల, పలు మధ్యతరహా చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులను అమలు మొదలైనవి వారి ప్రధాన డిమాండ్లు. సీమ ఎమ్మెల్యేల ఆందోళన రాజకీయ ఉద్దేశాలతో ప్రేరితమైనదని ఎన్టీఆర్ తన సమాధానంలో పేర్కొన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు రాయలసీమలో 2,75,000 ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్గించనున్న దృష్ట్యా అది ఆ ప్రాంత ప్రజలకు ఒక వరం అని ఆయన అన్నారు. సుంకేశుల వద్ద కొత్త బ్యారేజీని నిర్మించడం ద్వారా కర్నూలు కడప కాలువ రీమోడలింగ్ పథకానికి అనుమతి లభించిందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మరో రెండు మధ్య తరహా ప్రాజెక్టులను కూడా చేపట్టింది. అవి: బుగ్గవంక, వరదరాజుగుడి ప్రాజెక్టు. చిన్నతరహా సాగునీటి పథకాల కింద ఐదేళ్ళలో 657 చెరువులను నిర్మించడం జరిగింది. వాటికి అదనంగా 600 జలగ్రహణ తటాకాలను నిర్మించడం జరిగింది. అలాగే 1983 నుంచి రాయలసీమలో 2166 బోర్ వెల్స్ నిర్మించడం జరిగింది. రాయలసీమ సమస్యలను పరిష్కరించడంపై ఎన్టీఆర్ అమిత శ్రద్ధ చూపారు. నదీ జలాలను సక్రమంగా ఉపయోగించుకునే విషయమై సలహాలు ఇచ్చేందుకు, సిఫారసులు చేసేందుకు శాసనసభలోని వివిధ పక్షాల నాయకులు, ప్రభుత్వ సాంకేతిక నిపుణులతో ఒక కమిటీ నేర్పాటు చేసేందుకు కూడా ఎన్టీఆర్ అంగీకరించారు. ఈ ప్రతిపాదనను దీక్ష చేస్తున్న ఎమ్మెల్యేలు తిరస్కరించారు. కాంగ్రెస్ నాయకుల ఆందోళన నెదుర్కొనేందుకై తెలుగుగంగ ప్రాజెక్టుతో సహా వివిధ ప్రాజెక్టులకు అనుమతిని వ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ బోట్ క్లబ్ వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. ప్రధానికి ఒక మెమోరాండంను సమర్పించేందుకు ఢిల్లీ రావాలని శాసనసభలోని అన్ని పక్షాల నాయకులను ఎన్టీఆర్ ఆహ్వానించారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడు బాగారెడ్డి ఈ ఆహ్వానాన్ని తిరస్కరించారు ముఖ్యమంత్రి హోదాలో కాకుండా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా ఎన్టీఆర్ ప్రధాన మంత్రికి లేఖ రాశారని విమర్శిస్తూ ఈ ఆహ్వానం ఒక 'సినిమా స్టంట్' అని బాగారెడ్డి విమర్శించారు.

ఎన్టీఆర్ అనుసరించిన సానుకూల దృక్పథం లేదా అసాధారణ ప్రతిస్పందన మూలంగా రాయలసీమ ఆందోళన క్రమంగా సద్దుమణిగిపోయింది. దశాబ్దాలుగా తీవ్ర అన్యాయాలకు గురైన రాయలసీమ ప్రాంత ప్రజలు ఎన్టీఆర్‌లో అన్ని ప్రాంతాలను సమంగా చూసే నాయకుడిని కనుగొన్నారు. కనుకనే ఎన్టీఆర్ ఉన్నంత వరకు స్వార్థపర శక్తులు రెచ్చగొట్టిన వేర్పాటువాద ఆందోళనలేవీ ఫలించలేదు.

బోట్ క్లబ్ ధర్నా తరువాత టీడీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు 400 మంది పెండింగ్ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతినివ్వాలని కోరుతూ ఒక మెమోరాండంను ప్రధానమంత్రికి సమర్పించేందుకై ప్రధానమంత్రి నివాసానికి వెళ్ళారు. ప్రధానమంత్రి బంగ్లాను సమీపిస్తుండగా పోలీసులు వారిపై లాఠీచార్జికి దిగి, బాష్పవాయు గోళీలను ప్రయోగించారు. ఈ సంఘటనలో పది మంది కార్యకర్తలకు స్వల్పగాయాలయ్యాయి. ఢిల్లీపోలీసులు 300మందిని అరెస్ట్ చేశారు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో వారిని విడుదల చేశారు. విడుదల అయిన అనంతరం వారు రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళి రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్‌కు మెమోరాండం సమర్పించారు.

ఢిల్లీలోని ఘటనలతో తెలుగుదేశం పార్టీకి ప్రజల ఆదరణ మరింత పెరిగింది. ఇది కాంగ్రెస్ నాయకులకు తీవ్ర ఆగ్రహావేశాలను కల్గించింది. ఎన్టీఆర్‌కు ఇబ్బంది కల్గించడానికై సరైన సమయం కోసం వారు ఎదురు చూడసాగారు. ఇందుకు చెన్నైకు కృష్ణా జలాల సరఫరా అంశం ఉపయోగపడుతుందని వారు గుర్తించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర రెడ్డి, మైసూరారెడ్డి, ప్రతాపరెడ్డి రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మలిచారు. మద్రాసు నగరానికి తాగునీటి కొరత తీర్చేందుకు మిగులు జలాలను సరఫరా చేసేందుకు, రాయలసీమ సాగునీటి అవసరాలను తీర్చేందుకు మిగులు జలాలను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సంకల్పించగా మిగులుజలాలను రాయలసీమకు మాత్రమే సరఫరా చేస్తామని హామీ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీమ ఎమ్మెల్యేలు పలురోజులుగా నిరాహార దీక్షలో ఉన్నారు. 'రాయలసీమ స్థితిగతులను మెరుగుపరచేందుకు ఏమైనా చేయగలిగేది ఎవరైనా ఉంటే వారు ఒక్క ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మాత్రమే. కనుక సీమకు తాను చేయగలిగే మేలు చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నానని' కర్నూలుకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.రాంభూపాల్ చౌదరి, దీక్ష 11వ రోజున విజ్ఞప్తి చేశారు. దీక్ష చేస్తున్న నాయకుల ఆరోగ్య పరిస్థితులు దిగజారినట్టు వైద్య నివేదికలు స్పష్టం చేయడంతో పదమూడో రోజున దీక్షను విరమించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు తమ ఆందోళనను తాత్కాలికంగా మాత్రమే విరమించారు. వారు నవంబర్ 1న ఎన్టీఆర్‌తో ప్రతిఘటించదలుచుకున్నారు. ముఖ్యమంత్రితో అపాయింట్‌మెంట్‌ను కోరారు. రాష్ట్రావతరణ వేడుకలలో పాల్గొన్న తరువాత ఎన్టీఆర్ అంగీకరించారు రాయలసీమ నాయకులతో సమావేశానికై రాష్ట్ర ప్రభుత్వ సచివాలయానికి బయలుదేరారు. సీమ జిల్లాల నుంచి వచ్చిన 4000 మంది ప్రజలు సచివాలయం ప్రవేశ ద్వారం వద్ద ముఖ్యమంత్రి కారు లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నారు. ఇది గమనించిన ఎన్టీఆర్ ఆకస్మికంగా కారు దిగి అక్కడే రోడ్డు మీద బైఠాయించారు. సీమ ప్రతినిధుల మెమోరాండంను రోడ్డు మీదే స్వీకరించడానికి ఎన్టీఆర్ సిద్ధమయ్యారు. అయితే సీమ ఎమ్మెల్యేలు అక్కడే మెమోరాండంను సమర్పించేందుకు నిరాకరించారు. ఎన్టీఆర్ రోడ్డు పైనే కూర్చుండిపోయారు. ఒక ముఖ్యమంత్రి ఒకరు ముగ్గురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా మండుటెండలో రోడ్డు మీద కూర్చొనిపోవడం ఒక అనూహ్య ఘటన. ఇంతకుముందెన్నడూ సంభవించనిది. ఒక దశలో అక్కడ గుమిగూడిన ప్రజాసమూహంలో కొంత మంది ముందుకు చొచ్చుకుని వచ్చి ప్ల కార్డులు మొదలైనవి ఎన్టీఆర్‌పై విసిరేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన మద్దతుదారులతో పోలీసు భద్రతా వలయాన్ని ఛేదించుకుని ఎన్టీఆర్ వద్దకు వచ్చి అసహ్యకరమైన అరుపులు అరిచారు. ఎన్టీఆర్ మౌనంగా వుండిపోయారు. అలా కాసేపు కూర్చున్న తరువాత తన ఆకుపచ్చని కశ్మీర్ శాలువాను రోడ్డు మీద పరచుకుని మండుటెండలోనే దాని మీద పడుకుని నిద్రపోయారు. ఆయన అలా నాలుగున్నర గంటలపాటు రోడ్డుమీదే పడుకున్నారు. ఆ తరువాత తన నివాసానికి వెళ్ళిపోయే ముందు ఎన్టీఆర్ విలేఖరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు తన పట్ల ఎల్లప్పుడు విశేషాదరాభిమానాలు చూపారని, తాను హిందుపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని అన్నారు. తనను తాను రాయలసీమ దత్తపుత్రుడుగా భావించుకుంటున్నానని చెప్పారు. ఎందుకు రోడ్డుమీద కూర్చున్నారని అడుగగా సచివాలయంలోకి వెళ్ళకుండా తనను అడ్డుకున్నారని, ఇందుకు ఎవరిమీద తనకు ఎటువంటి కోపం లేదని, తనకు వ్యతిరేకంగా తానే ఈ చర్యకు పాల్పడ్డాడని అన్నారు.

ఎన్టీఆర్ అనుసరించిన సానుకూల దృక్పథం లేదా అసాధారణ ప్రతిస్పందన మూలంగా రాయలసీమ ఆందోళన క్రమంగా సద్దుమణిగిపోయింది. దశాబ్దాలుగా తీవ్ర అన్యాయాలకు గురైన రాయలసీమ ప్రాంత ప్రజలు ఎన్టీఆర్‌లో అన్ని ప్రాంతాలను సమంగా చూసే నాయకుడిని కనుగొన్నారు. కనుకనే ఎన్టీఆర్ ఉన్నంత వరకు స్వార్థపర శక్తులు రెచ్చగొట్టిన వేర్పాటు వాద ఆందోళనలేవీ ఫలించలేదు.

(విశ్రాంత ప్రభుత్వ ఉన్నతాధికారులు కె. చంద్రహాస్, కె. లక్ష్మీనారాయణ రాసిన 'ఎన్టీఆర్: ఏ బయోగ్రఫీ' హైదరాబాద్‌లో ఆదివారంనాడు విడుదలైంది. ఆ పుస్తకంలోని 'ఏ లీడర్ ఆఫ్ ఆల్ రీజియన్స్' అధ్యాయానికి స్వేచ్ఛానువాదం ఇది)

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

న్యూస్‌మేకర్

ఆమె విజయానికి ప్రధాని ఫిదా!



ఇంటర్ చదివిన ఓ సాధారణ గృహిణి, తన చిరు ప్రయత్నానికి ప్రభుత్వ సహకారం తీసుకుని... అనతికాలంలోనే ప్రధాని దృష్టిని ఆకర్షించడమంటే మాటలు కాదు. తమిళనాడులోని మధురైకి చెందిన అరుళ్ మొళి శరవణన్ మార్కెట్ చేసే థర్మాస్ ఫ్లాస్కులను ఏకంగా ప్రధాని కార్యాలయం (పీఎంవో) కొనుగోలు చేయడమేగాక, ఆమెకు ప్రధాని నరేంద్రమోదీని కలిసే అవకాశం కూడా కల్పించింది. ఆదివారం 'ఎయిమ్స్' ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు చెన్నైకి వచ్చిన ప్రధాని అరుళ్ మొళిని ప్రశంసించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

మధురై జిల్లాలోని ఉసిలంపత్తి పట్టణం మాది. ఇంటర్ అయిపోగానే నాకు మావాళ్లు పెళ్లి చేశారు. నేనొక సాధారణ గృహిణిని. భర్త, ఇద్దరు పిల్లలను చూసుకుంటూ, ఇల్లు సర్దుకోవడంతోనే సరిపోయేది. ఇల్లు గడవాలంటే ఏదో ఒకటి చేయాలి కదా! అని చిన్న చిన్న వస్తువులను అమ్మే ఉపాధి వెతుక్కున్నా. క్రమక్రమంగా ప్రభుత్వ ఆఫీసులకు కావాల్సిన చిన్న చిన్న వస్తువులను సరాఫరా చేసేదాన్ని. కేంద్ర ప్రభుత్వం 'ముద్ర యోజన' కింద నాలాంటి చిన్న చిన్న వ్యాపారులకు లోన్లు ఇస్తుందని తెలిసి అప్లై చేశా. ముద్ర లోన్ రావడంతో నా జీవితం మెరుగుపడింది.

తొలి ఆర్డరు రూ. 241

మొదట్లో కొన్ని ఉత్పత్తులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల ద్వారా అమ్మాలని ప్రయత్నించా. కానీ వాటిలో నాకు అంతగా లాభం కనిపించలేదు. 2017లో 'గవర్నమెంట్ ఈ మార్కెట్‌ప్లేస్' (జీఈఎం.. 'జెమ్'గా పిలుస్తారు) గురించిన ఒక ప్రకటన చూశాను. అందులో మనం మార్కెట్ చేస్తున్న ఉత్పత్తులను పెట్టొచ్చు. ఇదేదో



బాగానే ఉందని రిజిస్టర్ చేసుకున్నా. కేవలం ఐదు ఉత్పత్తులను మాత్రమే మేము అందులో ఉంచాం. చాలా రోజులు నిరీక్షించిన తర్వాత రూ.241లతో తొలి ఆర్డర్ వచ్చింది. మొత్తానికి బోణీ జరిగిందని అదే రోజు ఆ వస్తువును ప్యాక్ చేసి పంపించాం. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా ఆర్డర్లు రావడం మొదలయ్యింది. ఒకరోజు 'జీఈఎం' వెబ్‌సైట్‌లో ఒక ఆర్డర్‌ను ఓపెన్ చేసి చూస్తే, అది ఫ్లాస్కులు కావాలని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చింది. మాకు ఆనందమేసింది. వెంటనే వాటిని కొనుగోలు చేసి అదేరోజు రాత్రి ప్యాక్ చేసి స్పీడ్‌పోస్టులో పంపించా. ఆర్డర్ అందిందని వారు ఫోన్ చేసి చెప్పారు. ఆ ఫోన్ కాల్ నాకు అమితమైన ఆనందాన్నిచ్చింది.

కోటి రూపాయల వ్యాపారం...

'జెమ్' ద్వారా నా బిజినెస్ అభివృద్ధి చెందింది. నా జీవితం కూడా మారిపోయింది. కట్టెలపొయ్యి మీద వంట చేసుకునే స్థాయి నుంచి గ్యాస్ సిలెండర్‌పై వంట చేసుకునే స్థాయికి ఎదిగాను. ఇదే విషయాన్ని వివరిస్తూ ప్రధాని నరేంద్రమోదీకి ఉత్తరం రాశాను. ఆయన 'మన్ కీ బాత్'లో నా సక్సెస్‌స్టోరీ గురించి ప్రస్తావించారు. ఇటీవల మరో ఉత్తరం కూడా రాశాను. అందులో 'జెమ్' ద్వారా రూ.241తో మొదలైన నా వ్యాపారం ఈ ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలను అధిగమించిందని రాశాను. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జెమ్' కేవలం వ్యాపారాభివృద్ధికే కాదు, ప్రజా సేవ చేయడానికి కూడా ఒక మార్గమనేది నా అభిప్రాయం. ఎదుటివారికి కావాల్సినవి గ్రహించి, నిజాయితీతో సరైన సమయంలో అందిస్తే పోటీ ఉన్నా వ్యాపారంలో రాణించవచ్చునేది అనుభవపూర్వకంగా తెలుసుకున్నా. వ్యాపారంలో బాగా స్థిరపడ్డాను కాబట్టి ప్రభుత్వం ఇస్తున్న గ్యాస్ సిలెండర్ సబ్సిడీని వదులుకోవాలనుకుంటున్నా.

ఆదర్శం

'దేశం నాకేం చేసింది' అని కాదు, 'దేశానికి నేనేం చేశాను' అని ఆలోచించే వ్యక్తులు ఇంకా ఈ సమాజంలో మిగిలే ఉన్నారనడానికి నిలువెత్తు నిదర్శనం విశ్రాంత డీఈవో 78 ఏళ్ల అప్రపున్నీసా బేగం. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని కోసం ఆమె చూపిన దాతృత్వానికి చలించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమె పాదాలకు నమస్కరించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన కుటుంబ నేపథ్యం, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష గురించి అప్రపున్నీసా 'నవ్య'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే...

సేవాదీప్తి... నవ్యాంధ్ర నిర్మాణ స్ఫూర్తి!



'మాది పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు మండలం, మల్లవరం గ్రామం. కొండపని వీరన్న, శేషమ్మలు మా తల్లి తండ్రులు. ఇంటికి నేనే పెద్దదాన్ని. మల్లవరంలో 5వ తరగతి చదువుతున్నప్పుడు మా నాన్న నన్ను స్కూల్ మాన్పించారు. అప్పుడు సత్యనారాయణ అనే మాష్టారు 'ఆడ పిల్లలకు చదువు అవసరం' అని మా వాళ్లకు నచ్చ జెప్పి మళ్లీ నన్ను స్కూల్లో చేర్పించారు. నిడదవోలులో హైస్కూల్, కొవ్వూరులో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశాను. తర్వాత రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో పీయూసీ నుంచి బీఎస్సీ వరకు చదివాను. అప్పుడే క్లాస్‌మేట్ సిరాజుద్దీన్ నచ్చడంతో మతాంతర వివాహం చేసుకొన్నా.

తర్వాత సర్వీస్ కమిషన్‌కు ఎంపికయ్యాను. 1962లో విశాఖపట్టణం విద్యాశాఖలో ఎల్‌డీ క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. 1965 వరకు ఉద్యోగం చేశాను. 1966లో వరంగల్ జిల్లా హన్మకొండలో బీఈడీ పూర్తి చేసి, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బీఈడీ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. 1972లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ ఉన్నత





ఫ్యామిలీతో...

పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యాను.

1979లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతిపై సామర్లకోట సమితికి వెళ్లాను. స్కూళ్లకు ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లాలంటే అటెండర్‌ల సహాయంతో పొలం గట్లపై నడిచి వెళ్లేవాళ్లం. 1984లో ఎంఈవోగా పదోన్నతి లభించింది. తర్వాత పశ్చిమగోదావరి జిల్లా పెరవలి జడ్పీ హైస్కూల్‌లో గెజిటెడ్ హెచ్ఎంగా బదిలీపై వెళ్లాను. 1997లో తూర్పుగోదావరి జిల్లా డీఈవోగా పదోన్నతి పొంది, 1998లో ఉద్యోగం నుంచి విరమణ తీసుకున్నా.

'నాకు నలుగురు కుమార్తెలు. పెద్దామె రజియా బేగం. రెండో కుమార్తె అక్తర్ బేగం. ఈమె భర్త సి రాజశేఖర్, ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీస్)అధికారిగా దిల్లీలో 'మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్టర్నల్ ఎఫైర్స్'లో పనిచేస్తున్నారు. మూడో కూతురు అయేషా బేగం, కాకినాడలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. భర్త శ్రీరామచంద్ర మూర్తి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు. నాలుగో కూతురు గౌషియా బేగం. తూర్పు గోదావరి డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఇదీ నా ఫ్యామిలీ. మావారు మహ్మద్ సిరాజుద్దీన్ పోలీస్ శాఖలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ, సర్వీస్‌లో ఉండగా 1989లో చనిపోయారు.

సేవకు సై... నవ్యాంధ్ర నిర్మాణానికి జై!

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కష్టపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రాష్ట్ర భారాన్ని మోయడానికి ఆయన పడుతున్న కష్టం మాటల్లో చెప్పలేం. 37 ఏళ్లు ఉద్యోగం చేశాను. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సేవ చేశాను. పెన్షన్‌తో కాలక్షేపం చేస్తున్నాను. ఇటీవల సీనియర్ సిటిజన్ ఒకామె రాజధాని నిర్మాణానికి రూ. 12,500 విరాళం ఇచ్చారని 'ఆంధ్రజ్యోతి'లోనే చదివా. అప్పుడే అనుకున్నాను. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ తీసుకుంటున్నా, నేను కూడా విరాళం ఇవ్వాలని. సామాజిక బాధ్యతగా అమరావతి నిర్మాణానికి చిన్న మొత్తం విరాళంగా ఇచ్చాను.

> కాకినాడలో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి పింఛన్ సొమ్ము నుంచి నా వంతుగా రూ. 50 వేల చెక్కును సీఎంకు విరాళంగా అందజేశాను. అంగన్‌వాడీ కార్యకర్త అయిన నా మూడో కుమార్తె ద్వారా మరో రూ. 10 వేల విరాళాన్ని ఇప్పించాను.

కొడుకును కలిసే అదృష్టం!

సీఎం చంద్రబాబునాయుడు నా పెద్ద కొడుకులాంటివారు. ఆయనను కాకినాడలో నేరుగా కలిసే అదృష్టం దక్కింది. జన్మభూమి- మా ఊరు సభకు సీఎం వస్తున్నారని తెలుసుకున్నాను. ఢిల్లీలో ఉన్న అల్లుడికి మనసులో మాట చెప్పాను. ఆయన బ్యాచ్‌మేట్ అయిన రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డితో నా గురించి చెప్పారు. జవహర్‌రెడ్డి మా కలెక్టర్ కార్తికేయ మిశ్రాకు చెప్పారు. ఆ విధంగా నేను నేరుగా నా పెద్ద కొడుకును కలవగలిగాను.

జనవరి 4న కాకినాడ జేఎన్‌టీయూ మైదానంలో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నేను ఆ సభలో పాల్గొని మాట్లాడాను. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి దాచుకున్న పింఛన్ సొమ్ము నుంచి నా వంతుగా రూ. 50 వేల చెక్కును సీఎంకు విరాళంగా అందజేశాను. అంగన్‌వాడీ కార్యకర్త అయిన మూడో కుమార్తె ద్వారా మరో రూ. 10 వేల విరాళాన్ని ఇప్పించాను.

పేదలకు చేతనైన సాయం...

నా ఐదో కుమార్తె రమీజున్నీసా బేగం జ్ఞాపకార్థం ప్రతీ రంజాన్ మాసంలో పేద పిల్లలకు వస్త్రదానం చేస్తాను. కాకినాడలో ఉన్న వీధిబాలల పునరావాస కేంద్రం 'పరివర్తన'లో అప్పుడప్పుడు అన్నదానం చేస్తాను.

నా సర్వీసులో చాలా మంది పీఎం, సీఎంలను చూశాను. ఎన్‌టీఆర్, చంద్రబాబు అంటే చాలా ఇష్టం. వారు ప్రజలకు చేసిన సేవలే వారిపై అభిమానం పెంచాయి. ఎన్‌టీఆర్ హయంలో విద్య, ఉపాధి, సంక్షేమంలో చాలా మార్పులు వచ్చాయి. ఆయన సీఎం అయ్యాక కేజీ బియ్యం రూ. 2, జనతా వస్త్రాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. సమితులు తొలగించి మండలాలుగా ఏర్పాటు చేయడంతో ప్రజల వద్దకు పాలన వచ్చింది. టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన సంక్షేమం ఉంటుంది. వాస్తవాలను ప్రజలంతా గమనిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

• **సరాకుల మోహన్‌రావు,** కాకినాడ

లీగల్ కౌన్సెలింగ్

ఉమ్మడి ఆస్తిని ఎలా అమ్ముకుంటాడు?

మాది మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక పల్లెటూరు. అక్కడ మాకు వారసత్వంగా సంక్రమించిన 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే భూమి అంతా ఒకే చోట కాకుండా, 10 ఎకరాలు హైవేకు పక్కనే ఉంటే, మరో 10 ఎకరాలు మెయిన్ రోడ్డుకు 5 కిలోమీటర్ల దూరంగా, రాళ్లూ రప్పల మధ్య ఉంటుంది. చాలాకాలం దాకా నా భర్త, అతని తమ్ముడు కలసి వ్యవసాయం చేశారు. మాది ఉమ్మడి కుటుంబం.




అయితే, ఐదేళ్ల క్రితం పిల్లల చదువుల కోసం హైదరాబాద్ వచ్చేశాం. అప్పటి నుంచి మా మరిది గారే మొత్తం 20 ఎకరాలు వ్యవసాయం చేస్తూ, ఏటా ఎంతో కొంత ఇచ్చేవాడు.

రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ప్రకారం ఎకరానికి 4వేల రూపాయల చొప్పున మా వాటాగా 10 ఎకరాలకు 40 వేల రూపాయలు రావాలి. ఆ డబ్బు కోసం మా వారు ఊరికి వెళ్లారు. దిగ్భ్రాంతికర విషయం ఏమిటంటే... మాకు తెలియకుండానే మా మరిదిగారు రెండేళ్ల క్రితమే హైవే పక్కన ఉన్న 10 ఎకరాల భూమిని అమ్మేశారు. ఆ భూమిని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి రెండు కోట్లకు అమ్మేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. ఇదేమిటని ఆయన్ని అడిగితే '20 ఎకరాల్లో నా వాటాగా 10 ఎకరాలు వస్తుంది కాబట్టి ఆ మేరకే అమ్మాను ఇందులో నా తప్పేముంది?' అంటున్నాడు. సమస్యేమిటంటే... అతడు అమ్మేసిన 10 ఎకరాలకు 2 కోట్లు వస్తే, మిగిలిన 10 ఎకరాలకు 40 లక్షల రూపాయలకు మించి రావు. ఎక్కువ విలువైన 10 ఎకరాలు అమ్మేసుకుని, తక్కువ విలువ చేసే 10 ఎకరాలు మాకు ఉంచేయడం ఏ రకంగా న్యాయం? పైగా భూముల పంపకమే జరగనప్పుడు, ఉమ్మడి కుటుంబంగా, ఉమ్మడి ఆస్తిగా ఉన్నప్పుడు మా ఆమోదం, మా సంతకం లేకుండా, యథేచ్ఛగా తాను అమ్మేయడం ఏమిటి? రెండు ప్రాంతాల్లోనూ మా సగం వాటా మాకు రావాలంటే ఏం చేయాలో చెప్పండి.

- పి. చంద్రకళ, హైదరాబాద్

మీదింకా ఉమ్మడి కుటుంబమే కాబట్టి, ఆస్తుల పంపకం జరగలేదు కాబట్టి, మీ మరిది ఆ భూమిని ఏకపక్షంగా అమ్మడానికి ఎంత మాత్రం వీల్లేదు. ఉమ్మడి ఆస్తిని ఒక్కరే అమ్మితే కొన్నవ్యక్తికి సంపూర్ణ హక్కులు రాకపోగా, అసలు ఆ రిజిస్ట్రేషనే చెల్లదు. అందువల్ల మీరు సివిల్ కోర్టులో పార్టీషన్ సూట్ వేయండి. ఆ దావాలో మీ మరిదితో పాటు కొన్న వ్యక్తిని కూడా పార్టీగా, అంటే ప్రతివాదిగా చేర్చండి. వారు చేసుకున్న సేల్ డీడ్‌ను రద్దు చేయమని ఆ దావాలో కోరండి.

అదే సమయంలో పార్టీషన్ కేసు పెండింగ్‌లో ఉండగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి వేరే వ్యక్తికి అమ్ముకోవడానికి వీల్లేకుండా నిషేధ ఉత్తర్వులు (ఇంజంక్షన్ ఆర్డర్) ఇవ్వమని కోర్టు వారిని కోరండి. కొన్న వ్యక్తి ఒకవేళ ఆ భూమిలో వ్యవసాయం చేస్తూ ఉంటే, అందులోంచి వచ్చి ఫలసంపదను లేదా ఆ ధాన్యాన్ని అమ్మగా వచ్చిన డబ్బును కోర్టులో డిపాజిట్ చేసేలా ఆదేశించమని కోర్టువారిని కోరండి. ఒకవేళ ఆ భూమిని ప్లాట్‌లుగా చేసి అమ్ముతూ ఉంటే, వాటిని కొన్నవారెవరూ ఆ భూమిలో నిర్మాణం పనులు చేపట్టకుండా కూడా నిషేధపు ఉత్తర్వులు జారీ చేయమని ఆ దావా ద్వారా కోరండి. దాంతో రిజిస్ట్రేషన్ రద్దు అయిపోవడంతో పాటు, కోర్టు వారు రెండు ప్రదేశాల్లోని భూమిలో సగం మీకు వచ్చేలా తీర్పు ఇచ్చే అవకాశం సంపూర్ణంగా ఉంది.



- టి. ఎల్.నయన్ కుమార్
న్యాయవాది, హైదరాబాద్



ఇలా చేయండి

అను'బంధం' బలపడాలంటే..

భార్యభర్తల అను'బంధం' బలపడాలంటే భాగస్వామితో గడిపే సమయం క్వాలిటీగా ఉండాలి. ఇద్దరూ కలిసి ఎక్కువ దూరం నడవడం, వర్కవుట్స్ చేయడంతో పాటు సరుకులు తెచ్చేందుకు కిరాణాషాపు వరకు వెళ్లడం కూడా బంధాలను మరింత బలోపేతం చేస్తుందంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్లు. దీనివల్ల ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవడుతుందని మరవకండి.

సాయంత్రం నడక: మీ భాగస్వామితో రోజు సాయంత్రం కొంతదూరం నడవండి. ఆ సమయంలో మీరు అనేక విషయాల గురించి చర్చించుకునే అవకాశం కలుగుతుంది. వాటికి తగ్గ ప్రణాళికలు కూడా వేసుకోవచ్చు. క్యాలరీలు కరిగించడమే కాకుండా, ఆరోగ్యకరమైన అలవాటు మొదలెట్టిన వారవుతారు.

షాపింగ్: ఆన్‌లైన్లో ఫుడ్, సరుకులు ఆర్డర్ చేస్తున్నాం. కానీ ఆ ఫుడ్ ఆరోగ్యానికి ఎంతవరకు మంచిదో తెలియదు. ఇంట్లో చేసుకునే పదార్థాలే అన్నివేళలా ఆరోగ్యానికి మంచిది. ఏమాత్రం బద్ధకించకుండా ఈసారి సూపర్ మార్కెట్‌కు ఇద్దరు కలిసి వెళ్లండి. వ్యాయామంతో పాటే మీ ఆరోగ్యానికి మేలు చేసే సరుకులు దగ్గరుండి కొనొచ్చు.

వర్కవుట్స్: భాగస్వామితో కలిసి చిట్‌చాట్ చేస్తూ మార్నింగ్ వాక్, జాగింగ్ చేయడం భలే సరదాగా ఉంటుంది. అలాగే జిమ్, యోగా క్లాసులకు జంటగా వెళ్లండి. దాంతో ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారు.

హెయిర్ కేర్

చుండ్రు వేధిస్తోందా?

ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే చాలు కాలుష్యంతో వెంట్రుకలు పాడవుతున్నాయి. ఒకవైపు వాయు కాలుష్యం, మరోవైపు ఎండ వల్ల జుట్టు పెలుసుగా తయారవ్వడమేగాక, చుండ్రు బాధ తప్పడం లేదు. ఎలాంటి జుట్టుకైనా సరైన పోషణతో, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే కొంతమేరకు హెయిర్‌డామేజ్‌ను అరికట్టవచ్చు. జుట్టు బాగుండాలంటే...

- తరచూ వేధించే చుండ్రు వదలగొట్టుకోవాలంటే రెండు టేబుల్‌స్పూన్ల బ్రౌన్ షుగర్‌కు ఒక టేబుల్‌స్పూన్ హెయిర్ కండిషనర్ కలిపి ఆ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. కాసేపటి తర్వాత నీళ్లతో శుభ్రంగా కడుక్కుంటే చుండ్రు సమస్య పోతుంది. నెలకు ఒకసారి ఇలా చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది.
- సూర్యకిరణాల వల్ల వెంట్రుకలు దెబ్బతింటాయనే విషయం తెలిసిందే. జుట్టుకు తేనె, ఆలివ్ ఆయిల్ మిశ్రమం రాస్తే మంచిది. అరకప్పు తేనెలో రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్ ఆయిల్ కలిపి వెంట్రుకలకు బాగా పట్టించి ఇరవై నిమిషాల తర్వాత నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. ఆలివ్ ఆయిల్ వెంట్రుకలకు కండిషనర్‌గా పనిచేస్తే, తేనెలో కండిషనర్ గుణాలతోపాటు యాంటీ బాక్టీరియల్ గుణాలున్నాయి.
- రేగినట్టు ఉండే చిక్కటి వెంట్రుకలకు అవకడొ గుజ్జును పట్టిస్తే మంచిది. దాంతో జుట్టు సాఫ్ట్‌గా, సిల్కీగా తయారవుతుంది.




నవ్య
ఆంధ్రజ్యోతి
డాక్టర్
6
మంగళవారం ● 29 జనవరి 2019

హార్మోనల్ హెల్త్

ఈ సమస్యకు కారణమేంటి?

డాక్టర్! నా వయసు 30 ఏళ్లు. నాలుగు నెలల క్రితమే పెళ్లయింది. అంగస్తంభన సమస్య తలెత్తితే వైద్యులను కలిసి, వారానికి ఒకటి చొప్పున టెస్టోస్టిరాన్ ఇంజెక్షన్లు తీసుకున్నాను. సమస్య కొంతవరకూ పరిష్కారమైనా, వీర్యకణాల సంఖ్య తగ్గిపోయింది. ఇప్పుడు కొత్తగా తలెత్తిన ఈ సమస్యను ఎలా చక్కదిద్దాలి?

- ఓ సోదరుడు, *జంగారెడ్డిగూడెం.*



పిల్లల కోసం ప్రయత్నించే పురుషులు టెస్టోస్టిరాన్ ఇంజెక్షన్లు తీసుకోకూడదు. ఇలా తీసుకోవడం వల్ల వీర్యవృద్ధికి అవసరమైన ఎస్.ఎస్.హెచ్, ఎఫ్.ఎస్.హెచ్ హార్మోన్లు పిట్యూటరీ గ్రంధి నుంచి విడుదల కావు. ఫలితంగా వీర్యకణాల సంఖ్య తగ్గిపోతుంది. అయితే ఈ హార్మోన్లను ఇంజెక్షన్లు, లేదా మాత్రల ద్వారా తిరిగి సరిచేస్తే పరిస్థితి సర్దుకుంటుంది. ఇందుకోసం అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రతించి అవసరమైన పరీక్షలు చేయించుకుని నిర్ధారించుకోవాలి. అలాగే అంగస్తంభన సమస్యకు అసలు కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దాలి. అంతేగానీ, టెస్టోస్టిరాన్ ఇంజెక్షన్లను వారానికి ఒకటి చొప్పున విచక్షణారహితంగా వాడడం ఆరోగ్యకరం కాదు. వైద్యులు ఎంతో అవసరమైతేనే నెలకొక ఇంజెక్షను సూచిస్తారు. మీ విషయంలో వీర్యకణాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం క్లిష్టమేమీ కాదు. వైద్యులు సూచించిన హార్మోన్ ఇంజెక్షన్లు తీసుకుంటే, 6 నెలల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుంది. కాబట్టి పిల్లలు కలగరేమోననే భయం వీడండి.



డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్.
8332850090 (కన్సల్టేషన్ కోసం)

సెక్సువల్ హెల్త్

ఆసక్తి ఎందుకు లోపించింది?

డాక్టర్! నా భార్యకు సాధారణ ప్రసవమై రెండు నెలలైంది. ప్రసవం తర్వాత నుంచి ఆమెలో లైంగిక కోరికలు సన్నగిల్లాయి. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? ప్రసవం తర్వాత మహిళల్లో లైంగికాసక్తి తగ్గడం సహజమేనా?

- ఓ సోదరుడు, *ఖమ్మం.*

ప్రసవం తర్వాత కొంతకాలంపాటు మహిళల్లో లైంగికాసక్తి తగ్గడం అత్యంత సహజం. ప్రసవం తదనంతరం మహిళల శరీరం తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి సమయం పడుతుంది. అప్పటిదాకా ఒళ్లు పచ్చిగా ఉండి లైంగిక కోరికలు కలగవు. అలాగే మహిళల్లో గర్భంతో వచ్చిన శరీర మార్పులు కొంత ఆందోళనకు లోను చేస్తాయి. అంతకుముందులా అందంగా లేనననే భావన మొదలై, ఆ కారణంగా కొందరు మహిళలు భర్తను దూరంగా ఉంచుతారు. మరికొందరిలో సెక్స్‌లో పాల్గొంటే నొప్పి కలుగుతుందేమోననే భయం ఉంటుంది. మరి కొందరిలో తిరిగి గర్భం దాలుస్తామోననే భయమూ ఉంటుంది. ఈ కారణాల వల్ల కూడా సెక్స్‌కు దూరంగా ఉంటారు. వీటన్నిటికంటే




కూడా ప్రసవం తర్వాత మహిళలకు లైంగికాసక్తి తగ్గడానికి ప్రధాన కారణం అలసటే! కొత్తగా చేకూరిన తల్లి బాధ్యతలు, బిడ్డ పెంపకంలో సహాయం లోపించడం, ఒత్తిడి మూలంగా సెక్స్ మీదకు మనసు పోదు. అయితే ఈ పరిస్థితి క్రమేపీ సర్దుకుంటుంది. ఆలోగా సెక్స్ కోసం ఆమెను ఒత్తిడి చేయకూడదు. ఆమె ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తూ, బిడ్డ పెంపకంలో సహాయపడాలి. శరీరాకృతి పట్ల ఆమెలో నెలకొన్న అనుమానాలు తొలగిపోయేలా, ఆత్మవిశ్వాసం పెరిగేలా అనునయించాలి. పరిస్థితులు అనుకూలంగా మారి, ఒత్తిడి తొలిగితే పూర్వంలా వారిలో లైంగిక కోరికలు పెరుగుతాయి. అయితే సెక్స్‌లో పాల్గొనలేకపోవటం అనేది మీ ప్రధాన ఆందోళనైతే, అవగాహన, అనుమాన నివృత్తి కోసం సెక్సాలజిస్టును కలిసి తగిన సలహాలు పొందవచ్చు.



డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్.
mili77@gmail.com
9676762665 (కన్సల్టేషన్ కోసం)

ఉమెన్స్ హెల్త్



గుండె నిండా భరోసా!

గుండె సమస్య అనగానే పురుషులే కళ్లముందు మెదలుతారు. కానీ మనసులాగే మహిళల గుండె కూడా సున్నితమే! వారినీ గుండె సమస్యలు వేధిస్తున్నాయి. అయినా ఆరోగ్యకరమైన జీవనశైలితో హృద్రోగాలను దూరం పెట్టవచ్చు!

మహిళల హృదయారోగ్యానికి తోడ్పడే అంశాలు బోలెడు! వాటి పట్ల అవగాహన, అప్రమత్తత కరవవడంతో, హృద్రోగ సమస్యలు తలెత్తుతున్నాయి. కానీ వాటి పట్ల భయం తొలగి గుండె నిండా భరోసా నిండుకోవాలంటే కొన్ని ముందు జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....

మెనోపాజ్ దశలో...

ఈస్ట్రోజన్ హార్మోన్ గుండె రక్తనాళాల లోపలి పొరను మృదువుగా ఉంచుతుంది. దీనివల్ల రక్తనాళం సాగుతూ రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. అయితే బహిష్టు ఆగిపోయిన మెనోపాజ్ దశలో ఈస్ట్రోజన్ నిల్వలు తగ్గిపోవడంతో, రక్తప్రసరణలో అంతరాయాలు వచ్చి గుండె జబ్బులు వచ్చే అవకాశం పెరిగిపోతుంది. ఈస్ట్రోజన్ తగ్గిపోవడం వల్ల క్యాల్షియం పనితీరు కూడా కుంటుపడుతుంది. ఈస్ట్రోజన్ ఆధారంగానే విటమిన్-డి, ఎముకల నిర్మాణానికి తోడ్పడుతుంది. అయితే ఈస్ట్రోజన్ నిల్వలు తగ్గిపోగానే డి-విటమిన్ శక్తిహీనమవుతుంది. ఈ క్రమంలో విటమిన్-డి పరిపుష్టంగా ఉన్నవారితో పోలిస్తే, విటమిన్- డి లోపాలతో ఉన్నవారు గుండెపోటుకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువ. రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకుపోకుండా నిలువరించడానికి ఎం.జి.పి (మ్యాట్రిక్స్ గ్లా ప్రొటీన్) చాలా అవసరం. అయితే ఈ ప్రొటీన్ తయారు కావడానికి డి- విటమిన్ అవసరం. డి- విటమిన్ లోపించిన వారిలో ఈ ప్రొటీన్ ఉండదు కాబట్టి, గుండె రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకుని గుండెపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. విటమిన్ కె-2 లోపం కూడా గుండె రక్తనాళాల జబ్బులు రావడానికి మరో కారణం. కాబట్టి ఈ లోపాన్ని కూడా పూరించాలి.



మధుమేహులైతే....

మధుమేహానికి ప్రధాన కారణం శారీరక శ్రమ లోపించడం, మానసిక ఒత్తిళ్లు పెరగడం. ముఖ్యంగా మధుమేహులైన స్త్రీలు గర్భం దాల్చినప్పుడు వారి శరీరం పైన హార్మోన్ల ప్రభావం పెరుగుతుంది. ఈ స్థితిలో క్లోమ గ్రంథి ఎక్కువ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తుంది. దీనివల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడి ఇన్సులిన్ నిరుపయోగం అవుతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర పరిమాణం పెరిగిపోతుంది. అయితే, ఇన్సులిన్ నిరుపయోగం కావడం వల్ల రక్తంలోని గ్లూకోజు జీవకణాల్లోకి పోలేదు. ఈ లోటును పూరించుకోవడానికి శరీరం వేరే ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో కొవ్వు పదార్థాల నుంచి శక్తిని విడుదల చేసే ప్రక్రియలో హెచ్.డి.ఎల్ కొలెస్ట్రాల్ తక్కువగానూ, ఎల్.డి.ఎల్ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది, మధుమేహుల్లో ఈ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉత్పత్తి అయితే, రక్తనాళాలు గట్టిపడి కుంచించుకుపోయి రక్తప్రసరణ తగ్గిపోతుంది. ప్రత్యేకించి గుండె రక్తనాళాలు కుంచించుకుపోవడంతో గుండె నొప్పి రావడం, రక్త ప్రసరణ పూర్తిగా ఆగిపోతే గుండెపోటు రావడం జరుగుతాయి. గుండె రక్తనాళాల్లో కొవ్వు అడ్డుపడటం అనేది పురుషుల్లో ప్రధాన రక్తనాళాల్లో జరిగితే, స్త్రీలల్లో సూక్ష్మ రక్తనాళాల్లో జరుగుతూ ఉంటుంది.


స్థూలకాయమూ సమస్యే!

స్థూలకాయుల్లో గుండె జబ్బులు వచ్చే అవకాశం 70 శాతం ఎక్కువ. నిమిషానికి 72 సార్లు స్పందించవలసిన గుండె బరువు పెరిగేకొద్దీ ఆ వేగం పెంచుకుంటుంది. 20 కేజీలు అధిక బరువు పెరిగితే, ఆ అదనపు శరీరాన్ని పోషించడానికి గుండె అధికంగా, 80 నుంచి 90 సార్లు స్పందిస్తుంది. ఇలా గుండె కొట్టుకునే వేగం ఎంత పెరిగితే, గుండె మీద భారం అంత పెరుగుతూ ఉంటుంది. ఫలితంగా గుండె జీవితకాలం తగ్గిపోతుంది. స్థూలకాయుల్లో కొలెస్ట్రాల్ కారణంగా, రక్తనాళాలు మూసుకుపోవడానికి, గుండె జబ్బులు రావడానికి అవకాశాలు చాలా ఎక్కువ.

థైరాయిడ్‌తోనూ చిక్కే!

- శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే థైరాక్సిన్ తగ్గిపోవడంతో వచ్చే సమస్య హైపోథైరాయిడిజం. దీనివల్ల గుండె పనితనం తగ్గిపోతుంది. సమస్యను సకాలంలో గుర్తించి థైరాక్సిన్ సప్లిమెంట్లు తీసుకుంటే సరేసరి! లేదంటే, గుండె స్పందనలు తగ్గిపోవడంతో మిగతా జీవక్రియలన్నీ కుంటుపడతాయి. ఇదే క్రమంలో గుండెలో కూడా వాపు ఏర్పడవచ్చు. అంతకు ముందే గుండె జబ్బులు ఉన్నవారిలో ఈ సమస్య తలెత్తితే, గుండె పనితీరు మరింత వేగంగా క్షీణిస్తుంది.
- హైపర్ థైరాయిడిజం సమస్యలో థైరాక్సిన్ హార్మోన్ అతిగా ఉత్పన్నం కావడం వల్ల, గుండె ఎక్కువ వేగంగా కొట్టుకోవడంతో పాటు, లయ తప్పి కొట్టుకుంటుంది. ఈ క్రమంలో శ్వాసకోశాలు దెబ్బతింటాయి. కాబట్టి తరుచూ ఎండోక్రైనాలజిస్టును సంప్రదిస్తూ, సమస్యను అదుపులో ఉంచుకోవడం తప్పనిసరి.

ఇలా ఉంటే జాగ్రత్త!





నివారణ చర్యలు ఇవే!

- ఆహారంలో పళ్లు తాజా ఆకుకూరలు, కాయగూరల మోతాదు పెంచాలి.
- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీనివల్ల మెటబాలిక్ సిండ్రోమ్ అనే జీవక్రియల జబ్బు రాదు. పొట్ట భాగంలో కొవ్వు పెరిగే సమస్య కూడా రాదు.
- బాడీ మాస్ ఇండెక్స్ (శరీర ద్రవ్యసూచి) తగ్గడానికి అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. తరుచూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి.
- రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను అదుపులోకి ఉంచుకోవాలి. మానసిక ఒత్తిళ్లకు, డిప్రెషన్‌కూ దూరంగా ఉండే ప్రయత్నం చేయాలి.

ఈ జాగ్రత్తలు ఒక క్రమవిధానంలో పాటిస్తూ ఉంటే, గుండె రక్తనాళాల సమస్యలు చాలా వరకు నివారించబడతాయి.

- డాక్టర్ శంకర్ టి.ఎస్.ఆర్.
మోహన్ సెల్వన్,
కాన్సెప్ట్ హాస్పిటల్స్, చెన్నై.

ఆయుర్వేదం అండతో!

పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడటానికి వాళ్ల రక్తనాళాలు పురుషుల కన్నా సన్నగా ఉండడం ఒక ప్రధాన కారణం. రక్తనాళాల్లో కొవ్వు కూడా పేరుకుంటే అది మరో కారణం అవుతుంది. వీటికి తోడు స్థూలకాయం, మధుమేహం, మానసిక ఒత్తిళ్లు, శరీర శ్రమ లేకపోవడం, మెనోపాజ్, స్త్రీల గుండె పోటుకు ఇతర కారణాలవుతాయి. మౌలికంగా, నిత్యం గుండె ద్వారా జరిగే రక్త-పరిభ్రమణానికీ, రుతుస్రావానికీ మధ్య ఒక అవినాభావ సంబంధం ఉంది. అందువల్ల రుతుక్రమం అస్తవ్యస్తం అయినప్పుడు, అది గుండె పనితనాన్ని ప్రభావితం చేసి గుండె జబ్బులకు కారణం కావచ్చు. నిజానికి, రుతుధర్మం స్త్రీల శరీర మాలిన్యాలను శుభ్రపరిచే ఒక రక్తమోక్షణ ప్రక్రియ. ఆ ప్రక్రియ కుంటుపడితే గుండె పనితనంలో మార్పులు రావడం సహజం. అందువల్ల రుతుక్రమం విషయాల్లో ఏ కాస్త తేడా వచ్చినా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన వైద్య చికిత్సలను తీసుకోవడం తప్పనిసరి.

- ఇతర కారణాల్లోకి వెళితే, ముఖ్యంగా ఆహారం విషయంలో, అమితాహారం, విరుద్ధాహారం తీసుకోవడం, రక్తహీనత, అజీర్తి సమస్యలు కూడా రక్తప్రసరణ వ్యవస్థ కుంటుపడటానికీ, అంతిమంగా గుండె జబ్బులు రావడానికీ దారితీస్తాయి.
- మౌలికంగా గుండె జబ్బులు రావడానికి శారీరక కారణాలతో పాటు, మానసిక ఒత్తిళ్లూ కారణమే కాబట్టి, వీటిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానాలు తప్పనిసరిగా అలవర్చుకోవాలి.
- సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలతో పాటు ద్రవాహారానికీ, పళ్లరసాలకు ప్రాధాన్యతనివ్వాలి. రోజుకు నాలుగు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగడం కూడా అంతే అవసరం.



- గుండె రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు, ఇతర కల్మషాలు తొలగిపోవడానికి గృహవైద్యంగా, వెల్లుల్లి, అల్లం, శొంఠి, ఆవాలు, పసుపు ఆహారంలో భాగంగా ఉండేలా చూసుకోవాలి.
- సాధారణ ఔషధమూలికల్లో మద్ది (అర్జున) యష్టిమధు, పుష్కరమూలం, పిప్పళ్లు, వాము వీటిని ప్రతిరోజూ తీసుకోవచ్చు.
- ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో ప్రభాకరవటి, నాగార్జునాభ్ర, హృదయార్ణవ రసం, యోగేంద్ర రసం, అర్జునారిష్ట, దశమూలారిష్ట, అభీక పిష్టి వంటి శాస్త్రీయ ఔషధాలను వాడుకుంటూ హృద్రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు కూడా.

అయితే, హృద్రోగాల విషయాల్లో ఔషధ చికిత్సలకు వెళ్లాలా? శస్త్ర చికిత్సలు అవసరమా? అనే నిర్ణయాన్ని రోగ నిర్ధారణా పరీక్షల ఆధారంగానే తీసుకోవాలి.



ప్రొఫెసర్ చిలువేరు రవీందర్
ప్రభుత్వ బి.ఆర్. కె.ఆర్ ఆయుర్వేద కళాశాల, హైదరాబాద్

ఏ ప్రొటీన్ మేలు?

ఫుడ్ ఫ్యాక్ట్



అత్యంత వేగంగా శరీరానికి శక్తిని ఇవ్వడంలో కార్బోహైడ్రేట్లను మించినవి లేవు. అయితే అంతే వేగంగా అ శక్తిని ఖర్చుచేసే శరీర శ్రమ కూడా ఉండాలి, ఆ శ్రమే లేకపోతే కార్బోహైడ్రేట్లు శరీర బరువును పెంచేస్తాయి. మధుమేహానికి మార్గం వేస్తాయి. అందుకే ఇటీవల చాలా మంది పిండిపదార్థాలు ఉన్న ఆహారాన్ని బాగా తగ్గిస్తున్నారు. అయితే తగ్గించిన ఆ ఆహారపు లోటును ప్రొటీన్లతో పూరిస్తున్నారు. అంటే మాంసాహారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అయితే మాంసాహారం జీర్ణం కావాలన్నా, శరీర శ్రమ అవసరమే! మాంసంలో పీచుపదార్థం ఉండదు కాబట్టి జీర్ణ సమస్యలు, విసర్జనా సమస్యలు ఉండనే ఉంటాయి. ఈ పరిణామాల వల్ల శరీరంలోని జీవక్రియలు కుంటుపడటం. మనిషి బరువు తగ్గడానికి, షుగర్ నిల్వలు నియంత్రణలో ఉండడానికి ప్రొటీన్ అవసరం అన్నది వాస్తవమే! అయితే, జంతు సంబంధితమైనది కాకుండా, వృక్ష సంబంధమైన ప్రొటీన్లకు ప్రాధాన్యమివ్వాలి. బాదం, పిస్తా, జీడిపప్పులతో పాటు, పెసర, అలసంద, మొక్కజొన్న దాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి. వీటిల్లో సహజంగానే పీచుపదార్థం ఉంటుంది కాబట్టి, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు లేకపోగా, శరీరం బరువు పెరగకుండానూ, చురుకుదనం తగ్గకుండానూ ఉంటాయి. 'ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్' జర్నల్ ఇటీవలి సంచికలోని ఒక వ్యాసంలో ఈ వివరాలే ఉన్నాయి.

ఫస్ట్‌ఎయిడ్

రక్తనాళం చిట్లితే?



రక్తం శరీర ఉపరిభాగం నుంచి దిగువ భాగానికి అంటే కాళ్లలోకి వచ్చేయడానికి ఎవరి ప్రయత్నమూ అవసరం లేదు. అత్యంత సహజంగానే ఆ ప్రక్రియ జరిగిపోతుంది, కానీ, కాళ్లలోకి వచ్చి చేరిన రక్తం తిరిగి గుండెకు చేరడానికి మాత్రం కాళ్లల్లో ఒక వ్యవస్థ ఉండాలి. అయితే, ఆ రక్తనాళాలు ముడుచుకుపోవడం వల్ల గానీ, రక్తం గడ్డకట్టడం వల్లగానీ, రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడుతుంది. అయినా చాలా కాలం వాటివల్ల పెద్ద ఇబ్బంది అనిపించదు. అయితే బలమైన దెబ్బ తగలడం వల్లగానీ, తీవ్రమైన ఒత్తిడి పడటం వల్లగానీ, ఒక్కోసారి ఈ వీన్స్ చిట్లిపోయి రక్తస్రావం జరగవచ్చు, స్వల్ప వ్యవధిలో రక్తస్రావం ఆగిపోతే ఫరవాలేదు ఒకవేళ రక్తస్రావం అలాగే కొనసాగితే ఒక దశలో ఆ వ్యక్త స్పృహ కోల్పోయే అవకాశం ఉంది. ఆ పరిస్థితిని నివారించాలంటే....

- రక్తస్రావాన్ని గమనించిన వెంటనే ఆ వ్యక్తిని వెల్లకిలా పడుకోబెట్టి, రక్తస్రావం అవుతున్న కాలును సాధ్యమైనంత ఎత్తుకు లేపి ఉంచాలి. ఇలా చేయడం వల్ల రక్తస్రావం ఆగిపోవడంగానీ, ఆ వేగం తగ్గిపోవడం గానీ జరగవచ్చు.
- స్టెరాయిల్ ప్యాడ్‌తో గానీ, మడచిన శుభ్రమైన సాధారణ వస్త్రంతో గానీ, రక్తస్రావం అవుతున్న చోట అదిమి పట్టాలి. రక్తస్రావం పూర్తిగా ఆగేదాకా అలాగే ఉంచాలి.
- బిగుతుగా ఉన్న దుస్తులు, బెల్టు లేదా పట్టీలవంటివి ఉంటే వెంటనే వదులు చేయాలి.
- ఒకటి రెండు సార్లు కట్టు మారుస్తూ పోవాలి. రక్తస్రావం పూర్తిగా ఆగాక కొత్త వస్త్రంతో ఒక మోస్తరు బిగుతుగా కట్టేయాలి.
- అవసరమైన ప్రాథమిక చికిత్సలు చేస్తూనే, హాస్పిటల్‌కు తరలించాలి.

డైలీ సుడోకు - 438

1		3				8		6
				3	8		7	
5	8			9				
9	7		3		1		4	8
4								5
6	1		8		9		2	3
				7			5	4
	5		2	8				
7		4				3		9

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-4 37 సమాధానం

5	2	9	1	7	3	6	4	8
8	6	7	9	4	2	3	5	1
3	1	4	5	8	6	9	7	2
7	9	2	8	6	5	4	1	3
6	4	5	7	3	1	8	2	9
1	8	3	2	9	4	7	6	5
4	7	1	3	5	9	2	8	6
9	5	8	6	2	7	1	3	4
2	3	6	4	1	8	5	9	7

సతీష్ వేగేశ్న 'ఆల్ ఈజ్ వెల్'



'శతమానం భవతి', 'శ్రీనివాస కళ్యాణం' చిత్రాల ఫేమ్ సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో ఓ కొత్త చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి 'ఆల్ ఈజ్ వెల్' అనే టైటిల్‌ను నిర్ణయించారు. హీరో ఎవరనేది ఇంకో వారం రోజుల్లో ఫైనల్ కానుంది. ఈ చిత్రాన్ని ఆదిత్య మ్యూజిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ఉమేష్ గుప్తా నిర్మించనున్నట్టు సమాచారం.

మోదీ.. మొదలైంది!



సందీప్ సింగ్, వివేక్ ఒబెరాయ్, ఒమంగ్ కుమార్

ప్రధాని నరేంద్రమోదీ జీవితం ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'పి.ఎం నరేంద్రమోదీ'. వివేక్ ఒబెరాయ్ కథానాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ సోమవారం అహ్మదాబాద్‌లో మొదలైంది. "గణపతి బప్పా ఆశీసులతో, ప్రేమతో మా ప్రయాణాన్ని ప్రారంభించాం. నాన్నతో పాటు ప్రతి ఒక్కరి ఆశీసులు ఉంటాయని ఆశిస్తున్నా" అని వివేక్ ఒబెరాయ్ పేర్కొన్నారు. 'మేరి కోమ్', 'సరబ్‌జిత్', 'భూమి' తర్వాత ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. సందీప్ సింగ్, వివేక్ ఒబెరాయ్ తండ్రి సురేశ్ ఒబెరాయ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 23 భాషల్లో విడుదల కానుంది.

చెక్‌బౌన్స్ కేసులో సినీ నిర్మాత తండ్రికి జైలు

చెక్‌బౌన్స్ కేసులో సినీ నిర్మాత నవీన్ రెడ్డి తండ్రికి న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. ఈ మేరకు రాజేంద్రనగర్ 2వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పీబీఎస్ చార్లెస్ తీర్పు వెలువరించారు. రెజీనా నటించిన 'హరేరామ హరేకృష్ణ' చిత్ర నిర్మాణానికి డబ్బులు తక్కువ కావడంతో నిర్మాత ఎన్. నవీన్ రెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి ఓ వ్యక్తి నుంచి రూ. 49 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ మొత్తానికి సంబంధించి చెక్కులు అందజేశారు. చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు రాజేంద్రనగర్ కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేశారు. కేసు నెం. 407/2018కు సంబంధించి విచారణ చేపట్టిన న్యాయస్థానం చెక్‌బౌన్స్ కేసులో నవీన్ రెడ్డికి ఏడాది జైలు శిక్ష విధించింది. బాధితుడి నుంచి అప్పుగా తీసుకున్న రూ. 49 లక్షలు తిరిగి చెల్లించాల్సిందిగా కూడా న్యాయస్థానం ఆదేశించింది.

ఇట్స్... ఫ్యామిలీ టైమ్!



ప్రియాంక
నిక్

ప్రియాంక - నిక్ దంపతులు యు.ఎస్.లో ఫ్యామిలీ గెట్ టు గెదర్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నిక్ తల్లి డినైస్ సోనాస్, సోదరులు ఫ్రాక్లిన్ జోనాస్, కెవిన్, ఆయన భార్య డేనియల్ జోనాస్ కూడా పాల్గొన్నారు. గెట్ టు గెదర్‌కు హాజరైన వారిని కొత్త దంపతులు హుషారుగా పలకరిస్తూ కనిపించే వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. కరేబియన్ దీవులకు ప్రియాంక, నిక్ హనీమూన్ కి వెళ్లొచ్చిన సంగతి తెలిసిందే. నిజానికి నిక్ ప్లాన్ చేసిన హనీమూన్ ప్రదేశం గురించి ప్రియాంకకు ముందుగా తెలియదట. కరేబియన్ దీవులకు వెళ్లిన తర్వాతే ఆమెకు విషయం తెలుసని ఆమె సన్నిహితులు తెలిపారు.

హిందీ 'భాంగ్రా పా లే'లో!

నాని ద్విపాత్రాభినయం చేసిన 'కృష్ణార్జున యుద్ధం'లో ఓ కథానాయిక రుక్సార్ ధిల్లాన్ గుర్తున్నారా? చిత్తూరు కుర్రాడిగా కనిపించిన కృష్ణకు జోడీగా నటించారీమె. ఇప్పుడు హిందీలో నటించే అవకాశం వచ్చిందీమెకు. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్న నృత్య ప్రధానాంశ చిత్రం 'భాంగ్రా పా లే'లో రుక్సార్ నటించనున్నారు. పంజాబీ భాంగ్రా నృత్యం, పాశ్చాత్య నృత్యం మేళవింపుతో దీన్ని రూపొందించనున్నారు. 'ఎబిసిడి' తరహాలో డ్యాన్స్ బేస్డ్ ఫ్రాంఛైజీగా రూపొందనున్న 'భాంగ్రా పా లే'లో రుక్సార్ ప్యాషనేట్ డ్యాన్సర్‌గా కనిపించనున్నారు. 'సంజు'లో రణబీర్ కపూర్ స్నేహితుడిగా, 'ఉరి' చిత్రంలో కథానాయకుడిగా నటించిన విక్కీ కౌశల్ తమ్ముడు సన్నీ కౌశల్ ఈ చిత్రంలో కథానాయకుడు. ప్రముఖ హిందీ సంగీత, చిత్ర నిర్మాణ సంస్థ టిప్స్ ఇండస్ట్రీస్ అధినేత రమేశ్ తౌరాణీ తనయ స్నేహ తౌరాణి ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు.



రుక్సార్ ధిల్లాన్

ఇస్మార్ట్ రామ్‌కి జోడీగా...



నిధీ అగర్వాల్

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఛార్మి మరో నిర్మాత. ఈ నెల 24న సినిమా చిత్రీకరణ మొదలైంది. అంతకు ముందు రోజు పూజా కార్యక్రమాలతో చిత్రాన్ని ప్రారంభించారు. ఇందులో కథానాయికగా నిధీ అగర్వాల్‌ని ఎంపిక చేసినట్టు ఛార్మి తెలిపారు. తెలుగులో నిధికి మూడో చిత్రమిది. నాగచైతన్య 'సవ్యసాచి', ఇటీవల విడుదలైన అఖిల్ అక్కినేని 'మిస్టర్ మజ్ను' చిత్రాల్లో ఆమె కథానాయికగా నటించారు. "పూరి కనెక్ట్స్ ఫ్యామిలీలోకి నిధీ అగర్వాల్‌కి స్వాగతం. మా ఇస్మార్ట్ గాళ్ నిధి. లెట్స్ రాక్!" అని ఛార్మి ట్వీట్ చేశారు. మే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

స్వచ్ఛమైన బంగారాన్ని తీస్తే... వెండిగా మార్చింది!

\- క్రిష్





"నేను దర్శకత్వం వహించిన సినిమా స్వచ్ఛమైన బంగారం అయితే కంగనా రనౌత్ దాన్ని వెండిగా మార్చింది" అని దర్శకుడు క్రిష్ అన్నారు. లక్ష్మీబాయి వీరగాథను తెరపైకి తీసుకురావడానికి చిత్రబృందమంతా ఎంతో శ్రమించారని, సినిమా సజావుగా విడుదల కావడం కోసమే ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నానని, ఇప్పటికీ కంగనా ఏం చేసిందో చెప్పకపోతే అందరి శ్రమను అగౌరపరిచినట్టేనన క్రిష్ అన్నారు. " నేను 'మణికర్ణిక' పనులు చివరిదశలో ఉండగా, మధ్యలో చిత్రాన్ని వదిలి వెళ్లానని అన్న ప్రతిసారీ... నా మనసు కుంగిపోయింది" అని ఆయన తెలిపారు.

నా పేరు మార్చింది!

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి కథను వెండితెరపై ఆవిష్కరించే మహా యజ్ఞంలో తానూ ఓ భాగం కావాలని తెలుగు సినిమాలకు తీసుకునే పారితోషికంలో సగమే తీసుకున్నానని క్రిష్ తెలిపారు. 'మణికర్ణిక' టైటిల్స్‌లో తన పేరును 'క్రిష్' బదులు 'రాధాకృష్ణ జాగర్లమూడి'గా వేయడంపైనా ఆయన స్పందించారు. "తొలుత విడుదలైన సినిమా పోస్టర్లలో నా పేరు 'క్రిష్' అని ఉంటుంది. సెకండ్ పోస్టర్, ట్రైలర్‌లో సడన్‌గా 'రాధాకృష్ణ జాగర్లమూడి' అని ఉంది. అదేంటని నేను కంగనను అడిగితే... 'సోనూ సూద్ నాకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు మీరు నాకు మద్దతు ఇవ్వలేదు. ఇప్పుడు మీ పేరు గురించి నేనెందుకు ఆలోచించాలి' అని చెప్పింది. ప్రేక్షకులకు నేను క్రిష్‌గా తెలుసు. ట్రైలర్‌లో, చిత్రంలో నా పేరు రాధాకృష్ణ జాగర్లమూడిగా వేయడమంటే నా గుర్తింపు విషయంలో గందరగోళం సృష్టించడమే" అని క్రిష్ అన్నారు.



"ఝాన్సీ రాణి మణికర్ణిక అయితే... మన మనసుల్ని దోచుకున్న రాణి కంగనా రనౌత్. ఆమె నా అభిమాన హీరో" అని సమంత ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు.

కంగనాను ఒంటరిగా వదిలేయండి!



క్రిష్ ఆరోపణలపై కంగనా రనౌత్ ఇప్పటి వరకూ స్పందించలేదు. కానీ, ఆమె సోదరి రంగోలి ట్విట్టర్‌లో "క్రిష్... 'మణికర్ణిక' చిత్రం మొత్తానికి మీరే దర్శకత్వం వహించారని అంగీకరిస్తున్నా. ప్లీజ్... ప్రధాన పాత్రలో నటించిన కంగనాకు ఈ విజయాన్ని ఆస్వాదించే అవకాశం ఇవ్వండి. ఆమెను ఒంటరిగా వదిలేయండి. మీరు చెప్పినవన్నీ నిజాలేనని నమ్ముతున్నాం" అన్నారు.

నిర్మాతలు సమాధానం చెప్పాలి!

స్వతహాగా తాను వివాదాలకు దూరంగా ఉంటానని క్రిష్ అన్నారు. "నా విజన్‌ని కంగన నాశనం చేయడంతో కోపం, బాధ వచ్చాయి. అందుకని, మాట్లాడుతున్నా. చిత్రంలో ఆమె ప్రధాన పాత్రధారి మాత్రమే. సోనూ సూద్‌ని చిత్రం నుంచి తప్పించడానికి ఆమెకు ఏం అధికారం ఉంది? నేను తీసిన చిత్రంలో మార్పులు చేయడానికి ఆమెకు ఎవరు అధికారం ఇచ్చారు? నిర్మాతలు నాకు సమాధానం చెప్పాలి. కంగనా రనౌత్ దర్శకురాలు అయితే సోనూ సూద్ గానీ... అతుల్ కులకర్ణి గానీ.. ఈ చిత్రానికి సంతకం చేసేవారా?" అని క్రిష్ ప్రశ్నించారు.

బోల్డ్ పాత్రలతో...

మిషాన్ జైన్, హేమలతారెడ్డి నటీనటులుగా శుక్రా ప్రొడక్షన్స్ పతాకంపై ఓ సినిమా తెరకెక్కుతోంది. వి.యస్. ఫణీంద్ర దర్శకత్వంలో సంజయ్ జాదవ్ నిర్మిస్తున్నారు. ఇటీవల టాకీ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పాటల చిత్రీకరణలో ఉంది. "వినూత్నమైన కంటెంట్‌తో ఇండస్ట్రీలో బజ్ క్రియేట్ చేసే సినిమా ఇది. త్వరలో టైటిల్‌ను ప్రకటిస్తాం" అని నిర్మాత అన్నారు. యువత మెచ్చే కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల పాత్రలు బోల్డ్‌గా ఉంటాయి. యాక్షన్ ఎపిసోడ్స్ ఆకట్టుకుంటాయి. ఫిబ్రవరి 4న చివరి షెడ్యూల్ మొదలు పెడతాం" అని దర్శకుడు చెప్పారు.



హేమలతా రెడ్డి, మిషాన్ జైన్

భిన్నమైన ప్రేమకథ

రవిచంద్ర, సుమయ జంటగా చంద్రశేఖర్ ఎస్. నిర్మించిన చిత్రం 'ఈ2 మనసులు'. ఆది పినిశెట్టి దర్శకుడు. 70 శాతం షూటింగ్ పూర్తయింది. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను, పాటను విడుదల చేశారు. చక్కని లవ్‌స్టోరీ ఇదని దర్శకుడు చెప్పారు. "ఇటీవల వచ్చిన లవ్‌స్టోరీలకు భిన్నంగా ఉంటుంది" అని హీరో రవిచంద్ర అన్నారు. త్వరలో చివరి షెడ్యూల్ మొదలు పెడతామని నిర్మాత తెలిపారు



రవిచంద్ర



స్నేహానికి చిరాయురస్తు!

ఈసారి నేషనల్ అవార్డ్ పక్కా!

\-'చిత్రజ్యోతి'తో చిరంజీవి

ప్రముఖ సినీ గేయ రచయిత, 'పద్మశ్రీ' పురస్కార విజేత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిని హీరో చిరంజీవి అభినందించారు. సోమవారం సాయంత్రం ఆయన ఇంటికి స్వయంగా వచ్చిన చిరంజీవి, శాస్త్రి దంపతులను ఆత్మీయాభినందనలతో ముంచెత్తారు. దాదాపు గంటన్నరకు పైగా వారి నివాసంలో గడిపిన చిరంజీవి మద్రాసు రోజుల నుంచి ఇవాళ్టి దాకా తమ మధ్య అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న తమ 'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి శాస్త్రి రాస్తున్న పాటలను, ఆయనతో కలసి మరోసారి వింటూ ఆత్మీయంగా, ఆ చిత్ర విశేషాలను పరస్పరం ముచ్చటించుకున్నారు. ఆ సందర్భంగా 'చిత్రజ్యోతి'తో చిరంజీవి ప్రత్యేకంగా పంచుకున్న ముచ్చట్లు...

"సీతారామశాస్త్రి గారు మంచి కవి మాత్రమే కాదు... నాకు ఆప్త మిత్రులు. ఆయన, నేను సమవయస్కులం. నా కన్నా ఆయన మూడు నెలలు పెద్ద. ఒకే ఏడాదిలో ఆయన మే నెలలో జన్మిస్తే, నేను సెప్టెంబర్‌లో పుట్టా. అలా ఆయన నాకు అన్నయ్య కూడా అయ్యారు. నా 'వేట' చిత్రానికి ఆయన తొలిపాట రాశారు. అప్పటి నుంచే మా పరిచయం. ఆయనన్నా, ఆయన పాటలన్నా నాకు చాలా ఇష్టం. ఆయనలో ఎన్నో కోణాలున్నాయి. ఆయన ఓ వ్యక్తిత్వ వికాస గ్రంథం. తొలి రోజుల పరిచయం నుంచి ఇప్పటి దాకా మా మధ్య ఎంతో ప్రేమ, ఆప్యాయతలు అల్లుకొని ఉన్నాయి.

మా ఇద్దరిదీ ఓ అద్భుతమైన ఎమోషనల్ జర్నీ. ఎప్పుడు ఆయనను కలిసినా ఎంతో ఆత్మీయంగా ఉంటుంది. దైనందిన జీవితంలో పడిపోయిన వాళ్ళం ఒక్కసారి ఆగి, మళ్ళీ పాత సంగతులన్నీ గుర్తు చేసుకుంటాం. ప్రతిసారీ ఓ కొత్త అనుభవాన్నీ, అనుభూతినీ మూటగట్టుకుంటాం. ఇవాళ 'పద్మశ్రీ' ఆయనను వరించడం వల్ల ఆ పురస్కారానికే వన్నె వచ్చింది. ఇంకా చెప్పాలంటే, ఆ పురస్కారం తన వన్నె పెంచుకుంది. నిజానికి, ఆయనకు ఈ పురస్కారం ఎప్పుడో రావాల్సింది. ఆలస్యమైనా, మా లాంటి అభిమానులందరికీ ఆనందం కలిగించేలా ఇప్పటికైనా పురస్కారం ప్రకటించడం సంతోషం.

చిరంజీవి చేసిన గ్రీటింగ్ కార్డ్!

"ఒకసారి నేనూ, శాస్త్రి గారు విమానంలో ప్రయాణిస్తున్నాం. ఆ జర్నీ అంతా ఖలీల్ జిబ్రాన్ గురించి, కవిత్వం గురించి ఎంతో అర్థవంతమైన చర్చ జరిగింది. అనుకోకుండా ఆ రోజు మే ఇరవయ్యో తేదీ. శాస్త్రి గారి పుట్టినరోజు. ఆ సంగతి తెలిశాక, ఆయనకు ఏదైనా మరపురాని బహుమతి ఇవ్వాలనిపించింది. ఒక మహాకవికి, ఓ మంచి మిత్రుడికి ఏమివ్వగలం? ఏం చేయాలా అనుకున్నా. ఇప్పుడంటే ఇంటర్నెట్‌లో రకరకాల గ్రీటింగ్ కార్డులు దొరుకుతున్నాయి. అప్పట్లో అలా కాదు. ఆత్మీయులకు స్వయంగా గ్రీటింగ్ కార్డు తయారు చేసివ్వడం నాకు సరదా. ఇంటికి వెళ్ళి కంప్యూటర్ మీద కూర్చొని, నేనే స్వయంగా గ్రీటింగ్ కార్డు తయారు చేశా. ఆయన ఫొటోలు తీసుకొని, అక్షరాలు కూర్చి స్వయంగా దాన్ని ప్రింట్ చేయించి, ఆయనకు అందజేశా. ఆయన చాలా ముచ్చటపడిపోయారు. ఎంతో సంతోషించారు. ఆయన కళ్ళలో ఆ రోజు కనిపించిన వెలుగు నేను మర్చిపోలేను. 'దటీజ్ మై బెస్ట్ బర్త్‌డే గిఫ్ట్' అంటూ ఆయన ఇవాళ కూడా ఆ సంఘటన గుర్తు చేసుకొంటుంటే, ఆయన నిరాడంబరత, స్నేహశీలతకు గుండె నిండిపోయింది."

\- చిరంజీవి

'రుద్రవీణ'కు నేషనల్ అవార్డు రావాల్సింది!

అవార్డులు, పురస్కారాల గురించి ఆయనెప్పుడూ పెద్దగా పట్టించుకోరు. నిజానికి, ఈపాటికి ఆయనకు ఎన్నో జాతీయ అవార్డులు రావాల్సింది. మా తమ్ముడు నాగబాబు నిర్మాతగా తీసిన తొలి చిత్రం 'రుద్రవీణ'లో పాటలకు ఆయనకు నేషనల్ అవార్డు రావాల్సింది. ఆ సినిమాలోని 'తరలి రాద తనే వసంతం...' లాంటి పాటలన్నీ ఎంతో బాగుంటాయి. ఆ సమయంలో ఒక్క ఓటు తేడాతో, ఆ అవార్డు మిస్సయింది. 'వైశాలి' చిత్రానికి మలయాళ రచయిత కురూప్‌కు ఆ అవార్డు వచ్చిందట. శాస్త్రి గారు మాత్రం అవేవీ పట్టించుకోకుండా, మరిన్ని అద్భుతమైన పాటలు రాస్తూ వచ్చారు.

'సైరా'లో ఒళ్ళు గగుర్పొడిచేలా...

ఇప్పుడు మా అబ్బాయి రామ్‌చరణ్ నిర్మిస్తున్న రానున్న 'సైరా... నరసింహారెడ్డి' చిత్రానికి అన్ని పాటలూ శాస్త్రి గారే రాస్తున్నారు. సింగిల్ కార్డు. ఇప్పటికే రెండు అద్భుతమైన పాటలు రాశారు. విజువల్ చూడకుండానే, ఆ పాటలు వింటూ ఉంటూనే ఒళ్ళు గగుర్పాటుకు గురవుతోంది. ఈ సినిమాతో ఆయనకు కచ్చితంగా నేషనల్ అవార్డు రావాలి. వస్తుందని నమ్ముతున్నాం.

రామ్ చరణ్ సంస్కారాన్ని మెచ్చి...

ఇటీవల జరిగిన ఓ గమ్మత్తయిన విషయం చెప్పాలి. 'సైరా'లోని ఒక శక్తిమంతమైన పాటలో 'చిరంజీవి' అనే మాట ఆయన వాడారు. 'నాన్న గారి గురించి మనమే పొగిడినట్లు ఉంటుందేమో' అని నిర్మాతగా రామ్ చరణ్ అన్నాడట. చిన్న కుర్రాడే అయినా... ఆత్మస్తుతి వద్దన్న చరణ్ సంస్కారాన్ని మెచ్చుకొన్నారు. దాంతో నా పేరు లేకుండా, దానికి మించి రాయాలని ఒక సవాలుగా తీసుకొని, సినిమా కథకు తగ్గట్టు మరో మంచి పదప్రయోగం చేశారు. 'మృత్యువే స్వయాన చిరాయురస్తు అనగా'... అంటూ కొత్తగా రాసిచ్చారు. అందుకే, ఆయన అక్షరాలా సరస్వతీపుత్రులు.

ప్రతి అక్షరం విలువైనదే!

ఆయన ప్రతి పాటా ఎంతో విలువను సంతరించుకొన్నవే. ఆయన నాకు 'ఇంద్ర' చిత్రంలో రాసిన 'భం భం భోలే...' లాంటివి ఎన్నో సినిమాతో సంబంధం లేకుండా కూడా అద్భుతంగా అనిపిస్తాయి. నా సినిమాల్లో నా క్యారెక్టర్‌ను, ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని పాట రాయడం ఒక ఎత్తు అయితే... నాకు ఏ సంబంధం లేని ఒక సినిమాలో నా గురించి ప్రస్తావిస్తూ ఓ పాట రాయడం మరచిపోలేను. 'అనుకోకుండా ఒకరోజు' సినిమాలో 'ఎవరైన చూసుంటారా నడిచే నక్షత్రాన్ని' పాటను ఆయన నన్ను ఉద్దేశించి రాశారు. గత జీవితాన్ని, నేను పడిన కష్టాన్ని, సాధించిన ఘనతను ఆయన అక్షర రూపంలో చక్కగా చెప్పారు. అదొక పెద్ద గిఫ్ట్‌గా భావిస్తా. ఆ పాట విన్న ప్రతిసారీ భావోద్వేగానికి లోనవుతా. ఆయన మాత్రం 'నీ గురించి రాయడంలో నాకు ఎక్కడా అతిశయోక్తి కనిపించడం లేదు చిరంజీవి' అని అంటారు. సాహిత్య ప్రతిభను చూపిద్దామనే తాపత్రయం కాకుండా కథలో ఇమిడిపోయి.. సినిమాకు చక్కని సాహిత్యం ఇవ్వాలనే ఆయన ఎక్కువగా ఆలోచిస్తారు. సాహిత్య విలువను ఎక్కడా తగ్గించరు. ఆయన రాసిన ప్రతి అక్షరం విలువైనదే. వాటన్నిటి ఫలితమే ఇవాళ ఆయనకు ఈ పద్మశ్రీ! ఆయన పాటలన్నిటినీ స్పెషల్ డిస్కోగ్రఫీ చేయించుకుని మళ్లీ మళ్లీ వినాలని ఉంది"

రెండు రోజులు వెతికారు! దటీజ్ చిరంజీవి!!

\- 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి

"ఒక రకంగా నేను రాసిన రెండో పాటే చిరంజీవిది. 'సిరివెన్నెల' సినిమాకు 'విధాత తలపున...' పాట రాసేసి, నేను మళ్ళీ ప్రభుత్వోద్యోగానికి వెళ్ళిపోయా. ఆ సమయంలో 'వేట' చిత్రంలో పాట కోసం దర్శకుడు కోదండరామిరెడ్డి గారు పిలిపించారు. మళ్ళీ మద్రాసు వచ్చా. ఆయన చెప్పిన సందర్భానికి, ఆ చిత్రం నిర్మించిన సంయుక్తా మూవీస్ అధినేతల ఆఫీసులో ఏకంగా ఇరవై వెర్షన్లు రాశా. పాటలు బాగా రాస్తున్నావంటూనే సంగీత దర్శకులు చక్రవర్తి 'ట్యూనుకు రాస్తావా' అంటూ ఒక ట్యూను ఇచ్చారు. అప్పుడు దానికి రాసిన పాటే... 'ఓ లేడి కూనా..'. అప్పటికే 'ఖైదీ' తదితర చిత్రాలతో చిరంజీవి హీరోగా మంచి ఇమేజ్ ఉన్న క్రేజీ హీరో. ఆ పాట విని, చాలా బాగుందనుకున్నారు. నన్ను అభినందించాలని, నా ఆచూకీ కోసం ఏకంగా రెండు రోజులు వెతికారు. అలా గాలించి మరీ నన్ను పట్టుకొని, ఎంతో అభినందించారు. అదీ నటుడిగా చిరంజీవిలోని మంచితనం. గొప్పతనం. వ్యక్తిగతంగా అది మా మొదటి పరిచయం. అప్పటి నుంచి 'రుద్రవీణ', 'దొంగ మొగుడు'... ఇలా ఎన్నో చిత్రాల మీదుగా రానున్న 'సైరా... నరసింహారెడ్డి' దాకా మాది ఆత్మీయానుబంధం. 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిందని ఆయన స్వయంగా ఇవాళ మా ఇంటికి వచ్చి అభినందిస్తుంటే, ఆ సంగతులన్నీ గుర్తొస్తున్నాయి."



పద్మావతి, సిరివెన్నెల దంపతులతో చిరంజీవి

సిఏ ర్యాంకర్ల విక్టరీ వాయిస్

ఆర్థికపరమైన లావాదేవీలు మనుగడలో ఉన్నంతవరకు ఉపాధికి వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేని వ్యక్తులు చార్టర్డ్ అకౌంటెంట్లు. సంబంధిత కెరీర్ కోసం చేయాల్సిన కోర్సు చార్టర్డ్ అకౌంటెన్సీ. ఈ కోర్సు, సంబంధిత పరీక్షలను నిర్వహించే సంస్థ 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ఏటా రెండు పర్యాయాలు ఈ సంస్థ సదరు పరీక్షలను నిర్వహిస్తుంది. కోర్సులో చేసిన మార్పులు, చేర్పులతో కొద్దికాలంగా టెన్త్ పూర్తికాగానే చార్టర్డ్ అకౌంటెన్సీ చేసే అవకాశం కలుగుతోంది. ఉపాధిపరంగా మెడిసిన్, ఇంజనీరింగ్‌కు మించి భరోసా లభిస్తుండటంతో కొందరు ఇటువైపు మొగ్గుచూపడమే కాదు, ఫలితాలపరంగానూ మెరుగైన ర్యాంకులను సాధిస్తున్నారు. చార్టర్డ్ అకౌంటెన్సీ ఫైనల్‌లో ర్యాంకు పొందిన నలుగురు విద్యార్థుల మనోభావాలు తెలుసుకుందాం.



అక్క సూచనలతో!

4వ ర్యాంకు



కమతం విజయలక్ష్మీ

మాది గుంటూరు. నాన్న రమేష్, అమ్మ అరుణ. పదో తరగతి వరకు గుంటూరులో చదివాను. సిఏలో చేరడానికి ప్రేరణ మా అక్క వైష్ణవి. తాను సిఏ పూర్తి చేసింది. ప్రస్తుతం ప్రముఖ కంపెనీలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. తమ్ముడు అమరనాథ్ కూడా ఐపిసిసి క్వాలిఫై అయ్యాడు. అక్కకు కూడా నా మాదిరిగానే సిఏ ఫైనల్లో జాతీయ స్థాయిలో 45వ ర్యాంక్ వచ్చింది.

ఏ కోర్సు చదివినా మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయాలి, రెండో అవకాశం తీసుకోకూడదు అన్నది నా లక్ష్యం. సరిగ్గా ఆ లక్ష్యంతోనే సిఏ కోర్సులో చేరడమే కాదు, అన్ని దశలను పూర్తి చేశాను. సిపిటిలో 200కుగాను 183 మార్కులను సాధించాను. అదే క్రమంలో ఐపిసిసి మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేశాను. అక్క వైష్ణవి సూచనలు, మాస్టర్ మైండ్స్ ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఫైనల్లో జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు, దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు సాధించాను.

చక్కని ఉద్యోగంలో స్థిరపడాలనే ఆలోచనతో ఉన్నాను. ఒక్క మాట - పట్టుదల, ఏకాగ్రత ఉంటే అన్ని దశలను పూర్తి చేయవచ్చు. ప్రెజెంటేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలి. కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి.

సైన్స్ గ్రూపులా పోటీ ఉండదు

22వ ర్యాంకు



పిట్టల లక్ష్మీ దీపిక

మాది గుంటూరు. నాన్న కోటేశ్వరరావు, అమ్మ మల్లీశ్వరి మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి. అక్క సివిల్స్‌కి ప్రిపేరవుతోంది. పదో తరగతి వరకు భాష్యం స్కూళ్లో చదివాను. సైన్స్ గ్రూపులో మాదిరి పోటీ అధికంగా ఉండదు, ర్యాంకులు సాధించాల్సిన అవసరం లేదు, పోటీ తక్కువ, ఉద్యోగావకాశాలు ఎక్కువ కావడంతో స్నేహితురాలి సలహా మేరకు ఈ కోర్సును ఎంచుకున్నాను.

సిఏ ఫైనల్ కోసం కోచింగ్ మెటీరియల్ బాగా ఉపయోగపడింది. ఏకాగ్రతతో చదివే దాన్ని. మూడు గంటలకో సారి చిన్న బ్రేక్ తీసుకునే దాన్ని. చివరి మూడు నెలలు చాలా కష్టపడ్డాను. ఫోన్‌కు దూరంగా ఉన్నాను. ఎప్పటికప్పుడు స్వీయ ప్రేరణతో ముందుకు సాగేదాన్ని. ఫలితంగానే జాతీయ స్థాయిలో సీఏ ఫైనల్లో 22వ ర్యాంక్ దక్కింది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా రాణించాలన్నదే నా లక్ష్యం. ఈ కోర్సులో చేరాలనుకునే వారు మొదటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే విజయం సులువు.

ఏరోజు పాఠాలు ఆరోజే

29వ ర్యాంకు



కటికెల జగదీశ్వర్ బాబు

మాది అనంతపురం జిల్లా కదిరి. నాన్న కుళాయప్ప ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ భారతీదేవి. అక్క ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఇంటర్‌లో నాది ఎంపిసి గ్రూపు. 948 మార్కులు వచ్చాయి. అయితే ఇంజనీరింగ్ వంటి రొటీన్ కోర్సులను కాకుండా భిన్నమైన రంగాన్ని ఎంచుకోవాలనుకున్నా. ఆ క్రమంలో సిఏ గురించి తెలుసుకొని ఇందులో చేరా.

సిఏ కోర్సులోని అన్ని దశలను మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేశాను. ప్రణాళిక ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు కష్టపడ్డాను. ఏ రోజు పాఠాలను ఆరోజే పూర్తి చేసే వాణ్ని. సబ్జెక్టులపరంగా ఎక్కడ బలంగా ఉన్నాను, మరెక్కడ వీక్ అన్నది విశ్లేషించుకుంటూ ప్రిపరేషన్ సాగించాను. సరిగ్గా ఆ తపనే నన్ను జాతీయ స్థాయిలో 26వ ర్యాంకులో సాధించేలా చేసింది.

ప్రముఖ కంపెనీలో మంచి హోదాలో స్థిరపడాలన్నదే భవిష్యత్ లక్ష్యం. సిఏ అనుకున్నంత కష్టం కాదు, అలాగని మరీ సులభం కాదు. ఏకాగ్రతతో చదవాలి. సబ్జెక్ట్‌ను కష్టమని భావించకుండా ఇష్టపడి చదవాలి.

ర్యాంకర్ల ఉమ్మడి సూచనలు

- అన్ని పేపర్లకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రతి సబ్జెక్ట్, అందులోని అన్ని చాప్టర్లలోని ప్రశ్నలను క్షుణ్ణంగా చదవాలి.
- కోచింగ్ మెటీరియల్‌తోపాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇచ్చే మెటీరియల్‌ను చదవడం తప్పనిసరి.
- రివిజన్ టెస్ట్ పేపర్స్, మాక్ టెస్ట్ పేపర్స్‌ను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి.
- ఇటువంటి పరీక్షల్లో విజయం సాధించాలంటే ఎంతో ఓపిక, శ్రమ, సమయపాలన అవసరం.
- రివిజన్ ఎగ్జామ్స్‌కు తప్పకుండా హాజరు కావాలి. అలాగే పునశ్చరణ (రివిజన్) లేకుండా విజయం సాధించడం కష్టం.
- సెల్, సోషల్ మీడియాకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.

ఆందోళనకు దూరంగా ఉండేవాడిని

13వ ర్యాంకు



మారెడ్డి భానుప్రసాద్

మాది తూర్పుగోదావరి జిల్లా తుని. నాన్న వెంకటరమణ. అమ్మ సుబ్బలక్ష్మి. నాన్నతోపాటు ఇద్దరన్నయ్యలూ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేస్తుంటారు. పదో తరగతి వరకు తునిలో చదువుకున్నా. కెరీర్‌పరంగా చార్టర్డ్ అకౌంటెంట్లకు లభించే అవకాశాలు, సమాజంలో దక్కే గౌరవమర్యాదలు వంటివి నన్ను ఈ కోర్సు వైపు ఆకర్షితుడిని చేశాయి.

ప్రధానంగా చదివేటప్పుడు ఆందోళనకు దూరంగా ఉండేవాడిని. ఫలితాలపై ఆలోచన ఉండేది కాదు. ముందు నుంచే ప్రణాళిక ప్రకారం పరీక్షలకు ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా సిపిటిలో జాతీయ స్థాయిలో ఏడో ర్యాంకు. ఐపిసిసిలో 378 మార్కులతో మొదటి ప్రయత్నంలోనే రెండు గ్రూపులను పూర్తి చేశాను. ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించే రివిజన్ ఎగ్జామ్స్ తప్పకుండా రాసే వాణ్ని. అందులో మార్కులు బాగా వచ్చేవి. దాంతో నాకు నమ్మకం పెరిగింది. ఇవే జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు సాధించటానికి దోహదపడ్డాయి. ప్రత్యేకించి చెప్పాలంటే, నా తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్టు భావిస్తున్నాను. భవిష్యత్తులో మంచి చార్టర్డ్ అకౌంటెంట్‌గా రాణించాలన్నదే లక్ష్యం. ఇందులో చేరాలనుకునేవారు ముందుగా కోర్సు గురించి అవగాహన ఏర్పర్చుకోవాలి. పట్టుదలతోపాటు కష్టపడేతత్వం, ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ సాగించే ఓర్పు ఉండాలి. పొరపాటున ఒక ప్రయత్నంలో విఫలమైనా నిరాశకు లోనుకాకుండా ముందుకు సాగాలి. అప్పుడే ఇందులో సక్సెస్ సాధించవచ్చు.

జాబ్ కార్నర్

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ

భారత ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌టిపిసిసి లిమిటెడ్ గేట్-2019 ద్వారా ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 207

విభాగాలు-ఖాళీలు: ఎలక్ట్రికల్ - 47, మెకానికల్ - 95, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ - 50, మైనింగ్ - 15.

అర్హత: సంబంధిత విభాగాల్లో బీఈ / బీటెక్ / ఏఎంఐఈ.

వయసు: 27 ఏళ్లు మించకూడదు (జనవరి 31, 2019 నాటికి).

ఎంపిక: గేట్ స్కోరు - 2019, ఆన్‌లైన్ బిహేవియరల్ / ఆప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31.

వెబ్‌సైట్: https://www.ntpc.co.in

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 191

షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) టెక్నికల్

ఎస్ఎస్‌సీ (టెక్): 189. ఇందులో పురుషులకు 175, మహిళలకు 14 ఉన్నాయి.

విభాగాలు:

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఏరోనాటికల్ / బాలిస్టిక్స్/ ఏవియానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ / కంప్యూటర్ టెక్నాలజీ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ / ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికామ్ / టెలీకమ్యూనికేషన్ / ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ / శాటిలైట్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ / ఆప్టో ఎలక్ట్రానిక్స్ / ఫైబర్ ఆప్టిక్స్ / మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ మైక్రోవేవ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ / బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ.

అర్హత: సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ డిగ్రీ. ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయసు: 20 - 27 ఏళ్ల మధ్య ఉండాలి (అక్టోబరు 1, 2019 నాటికి).

విడోస్ ఆఫ్ డిఫెన్స్ అభ్యర్థులకు మాత్రమే

ఎస్ఎస్‌సీ (ఉమెన్) (నాన్‌టెక్) (నాన్ యూపీఎస్సీ): 1

అర్హత: ఏదైనా డిగ్రీ.

ఎస్ఎస్‌సీ (ఉమెన్) టెక్: 01

అర్హత: ఏదైనా ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/ బీటెక్.

వయసు: 35 ఏళ్లు మించకూడదు (అక్టోబరు 7, 2019 నాటికి).

ఎంపిక: ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 21.

వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

Scholarship Alert

CIFAR Azrieli Global Scholars Program 2019

Category: Talent Based
Description: Canadian Institute of Advanced Research is inviting applications from researchers currently studying within the first five years of a full-time academic position in order to provide funds, support and essential skills to the scholars.
Eligibility: Ph.D. degree holder having work experience of five-years in academic position with fluency in written and spoken Englishcan apply.
Prizes & Rewards: CAD 1,00,000 for research support, travel expense coverage for personal two-day interview and special training to develop leadership and communication skills.
Last Date to apply: February 05
Application Mode: Online applications only.
Short Source URL:
http://www.b4s.in/AJ/TCA2

Dalai Lama Fellows Application 2019, USA

Category: Talent Based
Description: Applications are invited form next-generation leaders who are working on social change projects in local communities to address one or more of the following areas: mitigating economic disparity, diminishing violence, gender inequity, improving cross-cultural and interreligious cooperation etc.
Eligibility: The candidate must be of age group 20-35 years with fluency in written and spoken English. One who is familiar with the local community and the issues that the proposed project is seeking to address, preferably with more than one year of previous experience working with the community in question and experienced in learning and practicing contemplative practices.
Prizes & Rewards: The yearlong fellowship will give an immersive curriculum on social change and personal development and participation in two-week long global assemblies and interaction with global faculties.
Last Date to apply: January 31
Application: Applications can be made online only.
Short Source URL:
http://www.b4s.in/AJ/DLF3

Queen's University Belfast Scholarship for September 2019, UK

Category: International Level
Description: Queen's University Belfast, UK is offering merit-based scholarships to aspiring Indian students & professionals for pursuing under-graduation and post-graduation from UK. The scholarship is open for all the programmes offered by the university.
Eligibility: For under-graduation courses, the applicants must have minimum of 75% in class 12 board. For post-graduation courses, the applicants must have minimum of 60% in graduation degree. IELTS score of 6.5 bands with 6 bands in each component is also required.
Prizes & Rewards:
Varying scholarships from GBP 2000 to 3000 is available. Students will also be eligible for consideration of fully funded Vice-chancellor's international scholarship.
Last Date to apply: March 15
Application: Online application
Short Source URL:
http://www.b4s.in/AJ/QUB1

Courtesy: www.buddy4study.com

హైదరాబాద్, అహ్మదాబాద్ మధ్య అలయన్స్ సేవలు

ముంబై: ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్.. ఫిబ్రవరి 1 నుంచి హైదరాబాద్ నుంచి అహ్మదాబాద్‌కు విమాన సర్వీసును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ప్రాంతీయ కనెక్టివిటీ పథకమైన ఉడాన్ కింద ఈ కొత్త సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్ నుంచి నాసిక్ మీదుగా అహ్మదాబాద్‌కు ఈ విమాన సర్వీసును ప్రారంభిస్తున్నట్లు అలయన్స్ ఎయిర్ వెల్లడించింది. కొత్త రూట్‌లో 70 సీట్లతో కూడిన ఏటీఆర్-72 విమానాన్ని వినియోగించనున్నట్లు తెలిపింది. ఆదివారాలు మినహా అన్ని రోజుల్లో నాసిక్-అహ్మదాబాద్ సర్వీసును నిర్వహించనున్నట్లు పేర్కొంది.


జావా బైక్‌తో అనుపమ్ తరేజా

హైదరాబాద్‌లో 3 జావా షోరూమ్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మూడు జావా మోటార్‌సైకిల్ షోరూమ్‌లను క్లాసిక్ లెజెండ్స్ కంపెనీ ప్రారంభించింది. బంజారాహిల్స్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్‌లో ఈ షోరూమ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో జావా షోరూమ్‌ల సంఖ్య 26కు పెరిగింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణే, బెంగళూరు, నాసిక్, డెహ్రాడూన్, ముంబై, చెన్నైలో ఇప్పటికే 23 షోరూమ్‌లను కంపెనీ ప్రారంభించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ మరికొన్ని షోరూమ్‌లను ప్రారంభించే సన్నాహాల్లో ఉన్నట్టు క్లాసిక్ లెజెండ్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ తరేజా సోమవారంనాడిక్కడ విలేకరులకు తెలిపారు. మార్చినాటికి వందకు పైగా షోరూమ్‌లను ప్రారంభిస్తామన్నారు. మార్చి నుంచే జావా బైకుల డెలివరీని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కంపెనీ ఇప్పటికే జావా, జావా ఫార్టీ టూ, పెరక్ మోడళ్లను ఆవిష్కరించింది. జావా ధర రూ.1,67,000, జావా ఫార్టీ టూ ధర రూ.1,58,000 (ఎక్స్ షోరూమ్, హైదరాబాద్)గా ఉంది. డ్యూయల్ ఏబీఎస్ వేరియంట్ల ధర వరుసగా రూ.1,75,942, రూ.1,66,942గా ఉంది. ఈ బైకులకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా భారీ స్థాయిలో బుకింగ్స్ జరుగుతున్నాయని తరేజా తెలిపారు. అయితే ఎన్ని బైకులకు బుకింగ్స్ వచ్చాయో మాత్రం ఆయన వెల్లడించలేదు.

మళ్లీ సత్తా చాటిన ఐఎస్‌బీ



ప్రపంచ ఎంబీఏ ర్యాంకింగ్‌లో 24వ స్థానం

టాప్ 25లో భారత్ నుంచి ఇదొక్కటే
2019లో విద్యార్థుల వేతనంలో 187% వృద్ధి
దేశంలోనే అతిపెద్ద మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్


హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుకుంటోంది. 2019 సంవత్సరానికి ఫైనాన్షియల్ టైమ్స్ (లండన్) ప్రకటించిన గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్‌ల్లో 24వ స్థానాన్ని కైవసం చేసుకుంది. 2018లో ఏడాదిలో ఐఎస్‌బీ 28వ స్థానంలో నిలిచింది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న బిజినెస్ స్కూళ్లలో ఐఎస్‌బీ నెంబర్ వన్‌గా ఉంది. ఫైనాన్షియల్ టైమ్స్ టాప్ 25 బిజినెస్ స్కూళ్లలో భారత్ నుంచి ఐఎస్‌బీకి మాత్రమే చోటు లభించింది. మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఐఎస్‌బీ ఆఫర్ చేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (పీజీపీ)కు విపరీతమైన డిమాండ్ లభిస్తోంది. ఐఎస్‌బీ పీజీపీ దేశంలో అతిపెద్ద మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్. ప్రపంచవ్యాప్తంగా చూస్తే టాప్ 10లో ఉంది. ఇందులో వార్షికంగా 900 మంది విద్యార్థులు చేరుతున్నారు. అంతేకాకుండా మహిళా విద్యార్థులు 34 శాతం ఉండటం గమనార్హం. గ్రాడ్యుయేషన్ పూర్తయిన మూడు నెలల కాలంలోనే ఉద్యోగం పొందే వారి విషయంలో ఐఎస్‌బీ చాలా మెరుగ్గా ఉంది.

పెరగడానికి కారణాలివే..

ఏడాదికాలంలోనే ఐఎస్‌బీ నాలుగు స్థానాలు ఎగబాకడానికి పలు అంశాలు దోహదపడ్డాయి. వీటిలో పూర్వ విద్యార్థుల వేతనాల్లో పెరుగుదల, మహిళా విద్యార్థుల సంఖ్య వంటివి ఉన్నాయి. పూర్వ విద్యార్థుల వేతనం ఏకంగా 187 శాతం పెరిగింది. ఈ విషయంలో ఐఎస్‌బీ ప్రపంచవ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. అంతేకాకుండా దేశంలోని బిజినెస్ స్కూళ్లంటికన్నా ఎక్కువ మంది మహిళా విద్యార్థులకు (34 శాతం) ఐఎస్‌బీ అవకాశం కల్పిస్తోంది. వెయిటెడ్ సాలరీ, లక్ష్యాల సాధనా, కెరీర్ పురోగతి, వాల్యూ ఫర్ మనీ, అలుమ్నీ రికమండేషన్ వంటి అంశాల్లోనూ ఐఎస్‌బీ నిలకడగా పురోగతి సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థాయిలో నిలవాలన్న లక్ష్యంతో ఐఎస్‌బీ ఏర్పాటైందని ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు. గత పన్నెండు సంవత్సరాలుగా ఎఫ్‌టీ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్‌ల్లో ఐఎస్‌బీ మంచి పనితీరును కనబరుస్తోందన్నారు. టాప్ 100 జాబితాలో భారత్ నుంచి మరో మూడు ప్రముఖ బిజినెస్ స్కూళ్లకు స్థానం లభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అత్యంత నాణ్యతతో కూడిన మేనేజ్‌మెంట్ విద్యకు భారత్ గమ్యస్థానంగా ఉందని తెలియజేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు.


- ఎఫ్‌టీ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోల్‌కతా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బెంగళూరుకు కూడా స్థానం లభించింది. ఐఐఎం-కోల్‌కతా 29 స్థానాలు ఎగబాకి 78వ స్థానం (2018) నుంచి 49వ స్థానానికి (2019), ఐఐఎం-బెంగళూరు 35వ స్థానం నుంచి 33వ స్థానానికి చేరాయి.
- ఐఐఎం-అహ్మదాబాద్ 16 స్థానాలు దిగజారి 47కు చేరుకుంది.
- అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్.. ఎఫ్‌టీ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానంలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్ ఉంది.





చిన్న పరిశ్రమలకు రుణాలు పెంచండి

వ్యవసాయ, గృహ రంగాలకు కూడా.. బ్యాంకుల అధిపతులను కోరిన గోయెల్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ సోమవారం సమావేశమయ్యారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ), వ్యవసాయ, గృహ రంగాలకు రుణాలు పెంచాలని వారిని కోరారు. ఇందుకోసం చేపట్టాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించారు. అంతేకాదు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు అన్ని విధాలా మద్దతివ్వనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. దివాలా స్మృతి చట్టంతో ప్రభుత్వ బ్యాంకులు గడిచిన మూడు త్రైమాసికాల్లో రూ.లక్ష కోట్ల మొండిబకాయిలను రాబట్టుకోగలిగాయని.. త్వరలోనే బ్యాంకులు లాభాల బాటా పడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కఠినంగా వ్యవహరించొద్దు: దాస్

ఆర్థిక మంత్రి కంటే ముందు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులు సమావేశమయ్యారు. బ్యాంకింగ్ రంగం నుంచి నియంత్రణ మండలి ఆశిస్తుందేంటో గవర్నర్ వారికి తెలియజేశారు. రుణ మంజూరులో ముందు జాగ్రత్తలు పాటించడం వరకు పర్వాలేదన్న గవర్నర్.. మరీ అంత కఠినంగా మాత్రం వ్యవహరించవద్దని బ్యాంకర్లకు సూచించారు. ప్రభుత్వం ఆర్థిక లక్ష్యాలు చేరుకోవడంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల పాత్ర కీలకమన్న దాస్.. అండర్‌రైటింగ్ ప్రమాణాలు, కెపాసిటీ బిల్డింగ్, టెక్నాలజీ వినియోగం, పాలన ప్రమాణాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు.

7న పరపతి విధాన సమీక్ష

ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ వచ్చే నెల 7న ప్రకటించనుంది. ఆర్‌బీఐ గవర్నర్‌గా నియమితులయ్యాక శక్తికాంత దాస్ అధ్యక్షతన జరగనున్న తొలి పరపతి విధాన సమీక్ష ఇదే. వచ్చే సమీక్షలో ఆర్‌బీఐ కీలక వడ్డీ (రెపో) రేట్లను మరింత తగ్గించవచ్చని మార్కెట్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

టాటా బ్రాండ్ విలువ రూ. 1.38 లక్షల కోట్లు

టాప్-100 గ్లోబల్ బ్రాండ్లలో స్థానం.. ఈ గౌరవం దక్కిన ఏకైక భారత గ్రూపు



ముంబై: టాటా గ్రూపు బ్రాండ్ విలువ ఈ ఏడాదిలో 37 శాతం పెరిగి 1,950 కోట్ల డాలర్ల (రూ.1.38 లక్షల కోట్ల పైమాటే)కు చేరుకుంది. తద్వారా ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. లండన్‌కు చెందిన కన్సల్టింగ్ సేవల సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ ఈ జాబితాను రూపొందించింది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అన్ని రంగాల్లో వ్యాపారం నిర్వహిస్తున్న టాటాలకు ఈ ఏడాది జాబితాలో 86వ స్థానం దక్కింది. 2018 జాబితాలో లభించిన 104వ ర్యాంక్ నుంచి ఏకంగా 18 స్థానాలు ఎగబాకింది. టాప్-100లో చోటు దక్కించుకున్న ఏకైక దేశీయ బ్రాండ్ టాటానే. "ఈ ఏడాది టాటా గ్రూపు బ్రాండ్ విలువ భారీగా పెరిగింది. దాంతో ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్రాండ్లలో ఒకటిగా నిలిచింద"ని బ్రాండ్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ హైగ్ అన్నారు. టాటా బ్రాండ్ విలువ పెరగడంలో గ్రూపు ప్రధాన సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌దే కీలకపాత్ర అని హైగ్ తెలిపారు.



సామ్‌సంగ్ నుంచి ఎం20, ఎం10 ఫోన్లు

న్యూఢిల్లీ: షామీకి పోటీగా తక్కువ ధర ఉన్న ఎం సిరీస్ స్మార్ట్‌ఫోన్లను సామ్‌సంగ్ సోమవారంనాడు మార్కెట్లోకి విడుదల చేసింది. ఎం20, ఎం10 పేర్లతో తెచ్చిన ఈ ఫోన్ల ధర ప్రారంభ రూ.7,990గా ఉంది. ఇవి ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. ఎం10 ఫోన్‌లో 6.2 అంగుళాల డిస్‌ప్లే, 3400 ఎంఏహెచ్ బ్యాటరీ, 13 ఎంపీ+5ఎంపీ వెనుక, 5ఎంపి ముందు కెమెరా, 2జీబీ రామ్/16జీబీ ఇంటర్నల్ మెమరీ (3జీబీ రామ్/32జీబీ మెమరీ వెర్షన్) ఫీచర్లున్నాయి. ఎం20లో 6.3 అంగుళాల డిస్‌ప్లే, 8ఎంపీ ముందు కెమెరా, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లున్నాయి.

'జీ'పై జియో ఆసక్తి!

సుభాష్ చంద్ర వాటా కొనుగోలు చేసే అవకాశం



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఎస్సెల్ గ్రూపు సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జెడ్ఈఈఎల్) వాటా కొనుగోలుకు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కూడా ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్సెల్ గ్రూపు ప్రమోటర్ సుభాష్ చంద్రకు జెడ్ఈఈఎల్‌లో సగం వాటా ఉంది. తన వాటాను ఎవరైనా వ్యూహాత్మక భాగస్వామికి విక్రయించాలనుకుంటున్నట్లు సుభాష్ చంద్ర రెండు నెలల క్రితమే ప్రకటించారు. ఈ కంపెనీ వాటా కొనుగోలుకు ఆసక్తి కనబర్చినట్లుగా ఇప్పటి వరకు చాలా కంపెనీల పేర్లు విన్పించాయి. అందులో సోనీ పిక్చర్స్, అమెజాన్, ఆలీబాబా, యాపిల్, టెన్సెంట్, కామ్‌కాస్ట్, ఎటీ అండ్ టీ, సింగ్‌టెల్‌వంటి అంతర్జాతీయ సంస్థలున్నాయి. తాజా గా జియో ఈ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.

షేర్లు జూమ్!

ఆర్థిక సంక్షోభ ప్రకంపనలతో గతవారం కుప్పకూలిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు సోమవారం రివ్వున ఎగిశాయి. పెద్ద నోట్ల రద్దు సమయంలో బ్యాంకుల్లో భారీ మొత్తాల్లో నగదు జమ చేసిన ఆరోపణలపై ఎస్ ఎఫ్ఐఓ దర్యాప్తు ఎదుర్కొంటున్న నిత్యాంక్ ఇన్‌ఫ్రా, మల్టీవెంచర్స్ లిమిటెడ్‌లతో తమకెలాంటి సంబంధం లేదంటూ ఎస్సెల్ గ్రూపు కంపెనీలైన జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వివరణ ఇచ్చాయి. దాంతో ఈ రెండు సంస్థల షేర్లు సోమవారం నాటి ట్రేడింగ్‌లో భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 19.24 శాతం మేర బలపడిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్ల ధర చివరికి 16.64 శాతం లాభంతో రూ.372.50 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో 15.73 శాతం పెరిగి రూ.368.50 తన పరుగు ఆపింది. ఇక డిష్ టీవీ షేర్లు నేటి ట్రేడింగ్ ప్రారంభంలోనూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ ఆఖరికి 5.53 శాతం లాభంతో రూ.23.85కు చేరుకున్నాయి. జీ గ్రూపులోని ఇతర కంపెనీల స్టాకులు మాత్రం మరింత పతనమయ్యాయి. జీ మీడియా కార్పొరేషన్ అత్యధికంగా 19.68 శాతం నష్టపోగా.. జీ లర్నింగ్ షేర్ల ధర 7.80 శాతం క్షీణించింది. జీ గ్రూపు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్న వార్తల నేపథ్యంలో ఈ నెల 25న షేర్లు గరిష్ఠంగా 33 శాతం వరకు నష్టపోయాయి.

మరిన్ని సంక్షోభాలు పొంచి ఉన్నాయ్

అజయ్ పిరామల్ హెచ్చరిక

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ తరహా సంక్షోభాలు మరిన్ని వచ్చే అవకాశాలున్నాయని పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ అజయ్ పిరామల్ హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండటమే ఇందుకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగానికి సంబంధించి ఇప్పటికీ వ్యవస్థలో పలు పుకార్లు చేస్తున్నాయని, ఏ ఒక్క చిన్న ప్రతికూల పరిస్థితి ఏర్పడినా ఈ రంగం పూర్తిగా కుదుపునకు లోను కావటం ఖాయమన్నారు. కాగా జీఎస్‌టీ అమలు తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో కన్సాలిడేషన్‌కు అవకాశం లభించిందని, ఇదే తరహాలో ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో కన్సాలిడేషన్ ఉండనుందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం తెరపైకి రావటంతో ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో మరింత కన్సాలిడేషన్‌కు అవకాశాలు ఏర్పడ్డాయయని అన్నారు. ఓ మోస్తరు స్థాయి ఎన్‌బీఎఫ్‌సీలు నిధులను అందుకోవటంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయని, దీంతో అవి పటిష్ఠమైన వాటితో కలిసిపోవచ్చని తెలిపారు. దీంతో ఈ రంగం మున్ముందు బలపడే అవకాశాలు లేకపోలేదన్నారు. మరోవైపు ఎస్సెల్ గ్రూప్ అధినేత సుభాష్ చంద్ర.. తన సంస్థ చేసిన తప్పిదాలను ఒప్పుకుంటూ ప్రకటన విడుదల చేయటం ఆయనలో ఉన్న ధైర్యాన్ని వెల్లడిస్తోందని, ఈ తరహా ప్రకటనను తాను స్వాగతిస్తున్నట్లు అజయ్ పేర్కొన్నారు.

ప్రోత్సాహకాలు కొనసాగించాలి



మధ్యంతర బడ్జెట్ సమయం దగ్గర పడుతోంది. ఈ బడ్జెట్‌లోనూ ఐటీ, ఐటీ ఆధారిత సేవల (ఐటీఈఎస్) పరిశ్రమ ప్రభుత్వం నుంచి కొన్ని ప్రోత్సాహకాలు ఆశిస్తోంది. ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే 'నాస్కామ్' ఇప్పటికే దీనిపై ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాజీ మంత్రిత్వ శాఖకు ఒక వినతి పత్రం అందజేసింది. ఐటీ పరిశ్రమ వచ్చే కేంద్ర బడ్జెట్ నుంచి ఏం ఆశిస్తోందంటే...

ఐటీ రంగం

ఎఫ్‌టీసీ నిబంధనల్లో మార్పు

విదేశీ కంపెనీలకు ఐటీ సేవలు అందించే దేశీయ కంపెనీలు, పన్నుల పరంగా కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఫారిన్ టాక్స్ క్రెడిట్ (ఎఫ్‌టీసీ) నిబంధనలు ఇందులో అతి ముఖ్యమైన సమస్య. ప్రస్తుతం ఈ నిబంధనలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేవు. వచ్చే బడ్జెట్‌లో అయినా ప్రభుత్వం ఈ ఇబ్బందిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఇదే సరైన సమయం

పన్నుల నిబంధనలను మరింత సరళీకృతం చేసి, సంస్కరణల జోరు పెంచితే మన దేశం అంతర్జాతీయ పెట్టుబడులకు ముఖ్యంగా ఐటీ పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారే అవకాశం ఉందని నాస్కామ్ ప్రభుత్వానికి తెలియజేసింది. అలా చేయడం వల్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ద్వారా అంది వచ్చే అవకాశాలనూ మన దేశం సద్వినియోగం చేసుకోగలుగుతుంది.

శిక్షణపై చేసే ఖర్చుకు..

సరికొత్త టెక్నాలజీలలో నైపుణ్యాలు ఉన్న నిపుణుల కొరత ఐటీ కంపెనీలను వేధిస్తోంది. ఉన్న ఉద్యోగులకు ఈ నైపుణ్యాల్లో అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు కంపెనీలు పెద్ద మొత్తాల్లో ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వ పరంగానూ ఇందుకోసం సహకారం అవసరం. ఎగుమతుల ద్వారా ఈ రంగం పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూరుస్తోంది. ఉపాధి పరంగా చూసినా దాదాపు 45 లక్షల మంది ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే



బడ్జెట్‌లో కొత్త టెక్నాలజీలపై శిక్షణ కోసం కంపెనీలు చేసే ఖర్చులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని నాస్కామ్ కోరుతోంది.

మారుతున్న వ్యాపారాల స్వభావం

కొత్త టెక్నాలజీల పుణ్యమాని ఇప్పుడు వ్యాపారాల స్వభావాలే మారిపోతున్నాయి. ఆఫీసుగానీ, పెద్దగా ఉద్యోగులుగానీ లేకుండానే మరో దేశంలో వ్యాపారాలు నిర్వహించే స్థాయికి భారత ఐటీ కంపెనీలు ఎదిగాయి. అయితే ఈ మార్పుల వల్ల పన్నుల చెల్లింపుకు సంబంధించి కొంత అనిశ్చితి ఏర్పడుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రజెన్స్ (ఎస్ఈపీ), ప్లేస్ ఆఫ్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ (పీఏఈఎం) నిబంధనలను ప్రభుత్వం సవరించాలి.



బడ్జెట్ దగ్గర పడుతోంది. ఈ బడ్జెట్‌లో కూడా పరిశ్రమకు అందిస్తున్న సహాయాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ విషయంలో మా సిఫారసులను ప్రభుత్వం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని భావిస్తున్నా.

- దేబ్‌జాని ఘోష్, ప్రెసిడెంట్, నాస్కామ్

టీడీఎస్ తగ్గించాలి

కాల్ సెంటర్లపై ప్రస్తుతం మూలంలో పన్ను కోత (టీడీఎస్) కింద 10 శాతం పన్నుల భారం మోపుతున్నారు. దీన్ని రెండు శాతానికి కుదించాలని నాస్కామ్ ప్రభుత్వాన్ని కోరుతోంది. చిన్న, మధ్య తరహా సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల కంపెనీలకూ ఈ చర్య ఎంతో మేలు చేస్తుంది. ఇంకా విదేశీ కంపెనీల ఉద్యోగులు ఎవరైనా మన దేశంలో పని చేస్తుంటే, ఆ కంపెనీ మన దేశంలో శాశ్వతంగా పని చేస్తున్నట్టు భావించి అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు. దీంతో విదేశీ కంపెనీలేవీ తమ ఉద్యోగులను భారత్‌కు డెప్యుటేషన్‌పైన పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇది దేశీయ కంపెనీల వ్యాపారాలనూ దెబ్బతీస్తోంది. వచ్చే బడ్జెట్‌లో అయినా ప్రభుత్వం ఈ లోపాన్ని సరిదిద్దాలని నాస్కామ్ కోరుతోంది.

జీఎస్‌టీ సమస్యలు

దేశంలో జీఎస్‌టీ అమలులోకి వచ్చి ఏడాదికిపైగా అవుతోంది. ఈ చట్టం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం ఇప్పటికే అనేక వివరణలు ఇచ్చింది. అయినా ఆచరణలో ఇంకా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఐటీ కంపెనీల ఎగుమతులకు దెబ్బలేని విధంగా ప్రభుత్వం జీఎస్‌టీ నిబంధనలు సవరించాలని నాస్కామ్ కోరుతోంది. ముఖ్యంగా ప్లేస్ ఆఫ్ సప్లయ్, సొంత అవసరాల కోసం సరఫరా చేసే ఐటీ సేవలకు సంబంధించి వర్కింగ్ క్యాపిటల్‌ను బ్లాక్ చేయడం, ప్రధాన బ్రాంచ్ కార్యాలయం లావాదేవీలను ఎలా పరిగణించాలి? ప్రత్యేక ఆర్థిక మండలా(ఎస్ఈజడ్)ల్లోని సంస్థల నుంచి కొనుగోళ్లకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలరుకు)	ముడి చమురు
		325	790		
35,656.70	10,661.55	32,800	39,655	71.10	60.61
368.84	119.00	ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)		10 పైసలు	

డాక్టర్ రెడ్డీస్ ప్లాంట్‌లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు

» ఫారమ్ 483 జారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్లాంట్‌లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ అథారిటీ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీలు నిర్వహించింది. ప్లాంట్ తనిఖీ సోమవారం పూర్తయిందని, యూఎస్ఎఫ్‌డీఏ అధికారులు ఒక లోపం ఉన్నట్లు గుర్తించారని కంపెనీ వెల్లడించింది. ఫారమ్ 483ని జారీ చేసినట్లు పేర్కొంది. కాగా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తీవ్రమైన పార్శ్వపు నొప్పి నివారణకు ముక్కు ద్వారా తీసుకునే ఔషధం 'టోసిమ్రా'కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ అనుమతి లభించింది. డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ ప్రోమియస్ ఫార్మా పార్శ్వపునొప్పి ఔషధాల్లో కొత్తగా చేర్చనున్న ఔషధం ఇది. టోసిమ్రాకు అనుమతి లభించడం వల్ల రోగులకు ఇంతవరకు అందుబాటులో లేని ఒక కొత్త ఔషధం లభిస్తున్నదని కంపెనీ కో చైర్మన్, సీఈఓ జీవీ ప్రసాద్ తెలిపారు.

బడ్జెట్ భయాలతో భారీ నష్టాల్లోకి



సెన్సెక్స్ 368 పాయింట్ల పతనం

ముంబై: ఈ వారంలోనే మధ్యంతర బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో సోమవారం స్టాక్ మార్కెట్లో తీవ్ర ఆందోళనలు చోటు చేసుకున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతిపాదించనున్న బడ్జెట్ కావడం వల్ల ఇందులో జనాకర్షక చర్యలు అధికంగా ఉంటాయని, అవి ఆర్థిక క్రమశిక్షణను నీరుగార్చనున్నాయని భయాలతో సర్వత్రా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 119 పాయింట్ల నష్టంతో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. ఆ విభాగాల షేర్లు 5.46 శాతం మేరకు దిగజారాయి. అలాగే నిరాశా నిస్పృహల్లో ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర కేబినెట్ ఒక ప్యాకేజీ ప్రకటించవచ్చన్న వార్తలు కూడా ఇన్వెస్టర్లలో భయాందోళనలు రేకెత్తించాయి. దీనికి తోడు అమెరికా-చైనా మధ్య చర్చల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు తిరోగమన పథంలో ఉండడం కూడా దేశీయ మార్కెట్లను ప్రతికూలంగా ప్రభావితం చేసిందని పరిశీలకులంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు మార్కెట్లలో భారీ పతనాలు ఏర్పడ్డాయని, భారత మార్కెట్ ఇందుకు అతీతం కాదని శాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ శర్మ అన్నారు. మొత్తం మీద సర్వత్రా నిరాశాపూరితమైన వాతావరణంలో సెన్సెక్స్ 36124.26 పాయింట్లు, 35565.15 పాయింట్ల మధ్య కదలాడి చివరికి 368.84 పాయింట్ల నష్టంతో 35656.70 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 10630.95 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకి చివరికి 119 పాయింట్ల నష్టంతో 10661.55 వద్ద ముగిసింది.

- యెస్ బ్యాంక్ 5.46 శాతం నష్టంతో సెన్సెక్స్‌లో నష్టపోయిన షేర్లలో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ 5.40 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 3.82 శాతం, ఇండస్ఇండ్ బ్యాంక్ 3.10 శాతం, హీరోమోటోకార్ప్ 2.55 శాతం నష్టపోయాయి. సన్ ఫార్మా, బజాజ్ ఆటో, వేదాంతా, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా, రిలయన్స్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్, హిందుస్థాన్ యునీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఓఎన్‌జీసీ, మారుతి షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి.
- మార్కెట్ ఒడిదుడుకులను ఎదురీది లాభపడిన షేర్లలో టీసీఎస్ 1.71 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, ఎన్‌టీపీసీ కూడా లాభపడిన షేర్లలో ఉన్నాయి.
- రంగాలవారీగా బీఎస్ఈ ఫైనాన్స్ ఇండెక్స్ 2.1 శాతం, హెల్త్ కేర్ ఇండెక్స్ 2 శాతం నష్టపోగా టెక్ సూచి 0.8 శాతం లాభపడింది.

10700 దిగువన బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమైనా ప్రధాన నిరోధం 10800 వద్ద విఫలమై డౌన్‌ట్రెండ్‌లో పడింది. ఇంట్రాడేలో 10630 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకిన అనంతరం చివరికి 120 పాయింట్ల నష్టంతో 10700 కన్నా దిగువన ముగిసింది. స్వల్పకాలిక కరెక్షన్‌కు ఇది సంకేతం. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే ఇక్కడ బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి. మార్కెట్ 50, 100 డీఎంఏల కన్నా దిగువకు రావడం స్వల్పకాలిక బలహీనతకు సంకేతం.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10720 మద్దతు : 10650

- రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10720 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10800. కాని మార్కెట్ అప్‌ట్రెండ్ స్వల్పకాలిక విరామం ఇచ్చినట్టు కనిపిస్తోంది.
- ప్రధాన మద్దతు స్థాయి 10650 కన్నా దిగజారితే మరింత బలహీనతలో పడుతుంది. ఇతర ప్రధాన మద్దతు స్థాయిలు 10500, 10450. ఇదే స్వల్పకాలిక మద్దతు స్థాయి కావడం వల్ల రికవరీ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.
- బ్యాంక్ నిఫ్టీ 27000 కన్నా దిగువనే బలహీనంగా ముగిసింది. దిగువన మద్దతు స్థాయిలు 26400, 26000.

■ వి.సుందర్ రాజా

ఆటుపోట్ల కదలికలు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ నవమి
నక్షత్రం : విశాఖ
అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10661.55 (-119)

ట్రెండ్ మార్పు వేళలు : 12.38; 3.12

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.15 నుంచి 11.50 మధ్యలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.40 వరకు నిస్తేజంగా ఉండి తదుపరి చివరి వరకు మరోసారి మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.
ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.30 సమయానికి, 11.45 తర్వాత కూడా ఎటిపి కన్నా దిగువనే ఉంటే మరిన్ని షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10700, 10735
మద్దతు స్థాయిలు : 10620, 10595

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,850	33,430	33,790	33,400	32,740
క్రితం ముగింపు	33,380	33,260	33,350	33,100	32,390
22 క్యారెట్లు	31,350	31,000	31,080	30,930	31,270
క్రితం ముగింపు	30,910	30,850	30,680	30,710	30,920
వెండి (కిలో)	41,000	41,200	40,800	40,900	43,200
క్రితం ముగింపు	39,900	40,200	39,800	40,000	42,200

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.55 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	395	చిత్తూరు	423
వరంగల్	397	చెన్నై	430
విజయవాడ	408	నమక్కల్	420
గోదావరి	408	బెంగళూరు	425
విశాఖపట్నం	410	ముంబై	450

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	83	విజయవాడ	84
కరీంనగర్	84	గుంటూరు	85
వరంగల్	83	ఒంగోలు	86
మహబూబ్‌నగర్	83	చిత్తూరు	83
కర్నూలు	83	నెల్లూరు	83
విశాఖపట్నం	81	అనంతపురం	82
గోదావరి	82		

దేశీయ మార్కెట్లోకి నాట్కో కొత్త ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హృద్రోగుల కోసం నాట్కో ఫార్మా దేశీయ మార్కెట్‌లోకి కొత్త ఔషధాన్ని విడుదల చేసింది. రక్త నాళాల్లో మరింత వేగంగా రక్తం ప్రవహించడానికి వీలు కల్పించి, గుండె వేగంగా రక్తాన్ని పంప్ చేయడానికి ఈ ఔషధం దోహదం చేస్తుంది. ఆమోదయోగ్యమైన ధరకు దేశీయ మార్కెట్‌లోకి వాల్‌సార్టన్-సకుబిట్రిల్ బిళ్లలను ప్రవేశపెట్టినట్లు నాట్కో వెల్లడించింది. వాల్సాక్ బ్రాండ్‌తో ఈ బిళ్లలను విడుదల చేసింది. 50 ఎంజీ మోతాదు బిళ్ల ధర రూ.45, 100 ఎంజీ మోతాదు బిళ్ల ధర రూ.55 ఉంటుందని తెలిపింది.

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లాభం రూ.635 కోట్లు

న్యూఢిల్లీ: శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ (ఎస్‌టీఎఫ్‌సీ).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.635.45 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గడచిన ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.541.54 కోట్లు)తో పోల్చితే నికర లాభం 17.34 శాతం వృద్ధి చెందిందని కంపెనీ తెలిపింది. త్రైమాసిక కాలంలో కంపెనీ మొత్తం రాబడులు కూడా 18.22 శాతం పెరిగి రూ.3,378 కోట్ల నుంచి రూ.3,993.40 కోట్లకు చేరుకున్నాయని పేర్కొంది. కాగా ఈ కాలంలో నికర వడ్డీ రాబడి కూడా 16.12 శాతం వృద్ధి చెంది రూ.2,026.91 కోట్లకు చేరిందని తెలిపింది. డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) రూ.90,964.22 కోట్ల నుంచి రూ.1,03,817.94 కోట్లకు పెరిగాయని ఎస్‌టీఎఫ్‌సీ తెలిపింది. కాగా పబ్లిక్ ఇష్యూ బాండ్ల జారీ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. సోమవారం బీఎస్ఈలో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ షేరు 5.70 శాతం నష్టంతో రూ.1,055.30 వద్ద స్థిరపడింది.

కెనరా బ్యాంక్ లాభం రెండింతలు

మొండి పద్దులు తగ్గటమే కారణం

డిసెంబరు త్రైమాసిక లాభం రూ.317.52 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు గణనీయంగా తగ్గటంతో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో నికర లాభం రెండింతలు వృద్ధి చెంది రూ.317.52 కోట్లుగా నమోదైందని కెనరా బ్యాంక్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.125.75 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షాకాలంలో మొత్తం రాబడులు కూడా రూ.12,341.09 కోట్ల నుంచి రూ.13,513.35 కోట్లకు పెరిగాయని తెలిపింది. త్రైమాసికకాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 10.38 శాతం నుంచి 10.25 శాతం నుంచి తగ్గటం కలిసి వచ్చిందని పేర్కొంది. ఇదే సమయంలో నికర ఎన్‌పీఏలు కూడా 6.78 శాతం నుంచి 6.37 శాతానికి తగ్గాయని తెలిపింది. 2018 డిసెంబరు 31 నాటికి స్థూల ఎన్‌పీఏలు రూ.44,621.27 కోట్లు ఉండగా నికర ఎన్‌పీఏలు రూ.26,591.07 కోట్లుగా ఉన్నట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. ఈ కాలంలో మొండి పద్దుల కోసం కేసిన కేటాయింపులు, కాంటిన్జెన్సీస్ రూ.2,673.64 కోట్ల నుంచి రూ.1,977.34 కోట్లకు తగ్గాయని తెలిపింది. డిసెంబరు చివరి నాటికి ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 62.54 శాతంగా ఉందని పేర్కొంది.

కాగా ఈ నెల 21న ప్రారంభమైన ఎంప్లాయీస్ స్టాక్ పర్చేజ్ స్కీమ్ (కెన్‌బ్యాంక్ ఈఎస్‌పీఎస్) 25వ తేదీన ముగిసిందని తెలిపింది. ఈ పథకంలో ఉద్యోగులు భారీగా పాల్గొనటంతో ఇది 134 శాతం ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయిందని పేర్కొంది. మొదటి దశలో 2 కోట్ల షేర్లను జారీ చేయటం ద్వారా రూ.557 కోట్ల మూలధనాన్ని సమీకరించినట్లు బ్యాంక్ తెలిపింది. కాగా సోమవారం బీఎస్ఈలో కెనరా బ్యాంక్ షేరు 5.23 శాతం నష్టపోయి రూ.240.30 వద్ద క్లోజైంది.

పెరిగిన వోకార్డ్ నష్టం

న్యూఢిల్లీ: ఔషధ రంగంలోని వోకార్డ్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికరలాభం రూ.71.11 కోట్లకు పెరిగినట్టు ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో నష్టం రూ.40.76 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.1005.30 కోట్ల నుంచి రూ.1045.86 కోట్లకు పెరిగింది.

ప్రెస్టీజ్ లాభం 34 శాతం వృద్ధి

కిచెన్ అప్లయెన్సుల రంగంలోని టీటీకే ప్రెస్టీజ్ నికర లాభం మూడో త్రైమాసికంలో 33.66 శాతం పెరిగి రూ.84.85 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం కూడా రూ.473.78 కోట్ల నుంచి రూ.558.63 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో కంపెనీ వ్యయాలు 18.99 శాతం వృద్ధితో రూ.473.78 కోట్లకు చేరాయి.

బీఓఐకి మొండి పద్దుల దెబ్బ

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) నష్టాలు మరింతగా పెరిగాయి. మొండి పద్దుల (ఎన్‌పీఏ) కోసం చేసిన కేటాయింపులు ఏకంగా రెండింతలు పెరగటంతో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో బీఓఐ రూ.4,737.56 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ రూ.2,341.20 కోట్ల నికర నష్టాలను మూటగట్టుకుంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం రాబడి రూ.10,376 కోట్ల నుంచి రూ.11,839.53 కోట్లకు పెరిగింది. 40 భారీ ఖాతాలపై దివాలా ప్రొసీడింగ్స్‌ను చేపట్టాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆదేశించటంతోపాటు తాజాగా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం పనితీరును దెబ్బతీసిందని తెలిపింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు బీఓఐ రూ.3,400 కోట్ల రుణాలను అందించింది. కాగా 2017 నుంచి ఆర్‌బీఐ ప్రకటించిన సత్వర దిద్దుబాటు చర్య పరిధిలో బీఓఐ ఉంది. మరోవైపు మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు రూ.4,373 కోట్ల నుంచి రూ.9,179.48 కోట్లకు పెరగటం పనితీరుపై తీవ్ర ప్రభావం చూపించిందని బీఓఐ తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో నికర ఎన్‌పీఏలు 5.87 శాతానికి, స్థూల ఎన్‌పీఏలు 16.31 శాతానికి తగ్గాయి. స్థూల ఎన్‌పీఏలు రూ.64,248.58 కోట్ల నుంచి రూ.60,798 కోట్లకు, నికర ఎన్‌పీఏలు రూ.36,117.23 కోట్ల నుంచి రూ.19,437.35 కోట్లకు చేరాయి.


బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 5.4(5.41)5520
AGRO TECH FO 580.9(579.2)106
AISHWARYA TE 2.73(2.85)2780
ALPHAGEO (I) 468.85(465.2)2938
ALU FLUORIDE 91.95(102.15)13032
AMAR RAJA BA 741.6(764.65)13559
ANDHRA BANK 26.3(26.65)44420
ANDHRA CEMEN 4.64(4.87)6788
ANDHRA PETRO 56.9(58.7)70483
ANJANI PORTL 112.8(115.55)1122
ASTRA MICRO 79.45(79.65)15874
AUROB.PHARMA 758.05(783.4)80450
AVANTEL LTD 212.95(222.1)6348
AVANTI FEEDS 329.4(349.4)52449
B.N.RATHI SE 24.25(24.75)902
BALAJI AMINE 451.85(461.45)6311
BAMBINO AGRO 178(178.85)3829
BARTRONICSIN 6.36(6.61)200
BCG 2.88(2.96)41930
BHAGIRA.CHEM 419.95(431.35)7660
BHAGYA INL 32.3(34.25)50
BHARATFIN 912.45(944.95)14842
BNR UDYOG 17.33(17.67)25
CAMBRIDGE 42.65(43.1)1167
CCHHL 6.7(6.97)14441
CCL PRODUCTS 270.35(269.55)2838
CELESTIAL 7.1(7.35)4169
COROM INTER 433.65(440.05)3124
CUBEX TUBING 13.49(14.2)2162
CYBERMATE 1.79(1.88)41520
CYIENT 591.05(597.35)57562
DANLAW TECH. 86.2(90.65)6093
DECAN CEMENT 372.05(391)2
DHAN ROTO SP 28.35(28.35)370
DIAMONPOWER 1.44(1.45)1929
DIVI'S LAB. 1473(1493)19991
DIVYA.GRANIT 94(98.7)579
DQ ENT 6.5(7.05)1110
DR.REDDY'S 2624.2(2668.9)18603
EMPEE SUGARS 1.33(1.4)111
EVEREST ORG. 135.25(146.3)10001
FACOR ALLOYS 1.99(2.21)102789
FIRSTOBJ 8.74(8.71)882
FOURTH GEN. 2.36(2.36)100
GATI LTD. 71.25(75.4)79250
GAYATRI BIO 2.33(2.44)1241
GAYATRI PROJ 163.2(167.25)2625
GENNEX LAB 3(3.25)146469
GMR INFRASTR 15.4(15.65)1865355
GODAVARI DRU 23.1(21.35)12105
GOLDSTONE EN 12.6(13.25)950
GRANULES (I) 89.05(95.1)91604
GVK POWERINF 6.68(6.91)397454
HBL P SYS 24.9(25.95)18649
HERITGFOOD 485.1(504.4)2365
HIND.FLUROCA 15.95(16)1
IPAPPM 409.8(421.4)10711
IVRCL LTD .9(.94)26745
KAKATIYA CEM 182.35(186.85)8401
KALLAM 17.5(17.35)6565
KAVERI SEED 587.8(591.25)44206
KCP LTD 82.7(86.2)2190
KERNEX MICRO 24.5(25.6)87617
KNR CONST 205(210.45)3364
KREBS BIOCHM 114.05(117.45)430
LOKESH MACH 42.75(44.05)3285
LOTUS CHOC 23.05(22.85)180
MADHUCON PRJ 6.13(6.29)2600
MOLD-TEK TEC 46.95(48.6)1756
MOSCHIP SEMI 20.8(21.55)48597
MSR INDIA 9.74(10.12)9972
N C L IND. 119.55(124.35)1632
NACLIND 27.25(27.25)4144
NATCO PHARM 671.45(678.55)6964
NCC 79.3(81.6)1177261
NEHA INTER. 4.32(4.12)28246
NETTLINX LTD 44.4(45.2)347
NEULAND LAB. 498.65(493.45)610
NILE LTD. 340.75(343.35)748
OIL COUNTRY 13.3(13.6)3175
OLECTRA 220.9(222.8)7922
PADMALAYA TE 2.2(2.12)101
PALRED 36.8(38)950
PANYAM CEMEN 10.34(11.59)30063
PENNAR STEEL 36.3(36)24098
PFL INFOTECH 8.33(8.33)110
PHYTOCHEM I. 42.4(43.1)1050
PITTIENG 52.6(55.65)4824
POKARNA LTD 166.15(164.45)6383
PRAJAY ENGS. 8.25(8.18)707
PREMIER EXPL 254.15(255.15)2339
PRSMJOHNSN 74.6(76.25)8079
RAIN 110.35(114.65)127436
RAJ PACKAGIN 27.8(26.5)1328
REG.CERAMIC 4.2(4.04)1
RESTILE CER. 3.93(4.2)3171
SAGAR CEM. 583.7(612.1)692
SAMKRG PIST. 176.9(186.65)3884
SANGHI IND. 57.2(57.8)14071
SATVAH.ISPAT 10.39(9.02)1736
SAVEN TECHNO 27.65(28)26021
SIBAR AUTO 29(29)1
SMPL .38(.37)6020
SMS PHARMACE 66.05(69.75)3029
SREE RAYALA 147.1(152.55)5118
STEEL EXCH 12.1(12.95)1822
SUJANA INDUS .3(.3)25
SURANATP 4.3(4.19)100
SURYACHAKRA .27(.27)19400
SURYAMBA SP 63.3(66.3)222
SURYAVA SPIN 4.92(5.17)50
SURYLAK.COTT 39.85(42)525
SUVEN LIFE S 186.1(193.4)34283
TAJ GVK HOTL 172.05(179.55)1092
TANLA 33.95(31.7)84812
TRANSCORP IN 24.55(24.5)966
TRANSGENE BI 5.59(5.7)12268
TRANSPORT CO 280.2(289.45)951
VICEROY HOTE 3.64(3.83)6540
VIJAY TEXTIL 37.7(39)10853
VIMTA LABS 253(257.9)3087
VIRAT CRANE 28.5(31)1932
VIRINCHI 69.3(73.05)46004
VISAKA IND. 371(375.15)2103
VISTA PHARMA 25.15(26.45)5037
VIVIMED LABS 22.75(23.2)60570
VST INDUS. 3195(3201.3)224
WATERBASE 141.65(151.25)46278
XLENERGY 1(1)1060
ZEN TECH 80.55(83.4)133620
ZENOTECH 29.25(30.2)8091

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 589.8(602)6092
AARTIIND 1565.85(1547.5)87495
ABAN 66.8(69.75)318162
ABB 1235.15(1254.6)61118
ABFRL 201.4(200.4)1399675
ABGSHIP 1.8(1.85)22900
ACC 1357.25(1375)469918
ADANIENT 136.4(137.35)9404485
ADANIPORTS 326.1(373.85)15177384
ADANIPOWER 40.05(49.15)50291637
ADANITRANS 210.2(207.9)423614
AEGISCHEM 192.3(196.95)101149
AHLUCONT 273(280.8)34777
AIAENG 1636.15(1612.1)41872
AJANTPHARM 1133.55(1126.85)273215
AKZOINDIA 1739.25(1725.1)4593
ALBK 42.3(43.4)2927614
ALLCARGO 105(106.8)47806
ALOKTEXT 3.6(3.75)2431209
AMARAJABAT 740.2(766.65)365775
AMBUJACEM 199.75(202.35)3278879
AMTEKAUTO 2.95(3.05)54146
ANANTRAJ 31.8(33.1)287126
ANDHRABANK 26.15(26.55)647765
APARINDS 622.65(615.4)3444
APLLTD 592.15(589.7)21378
APOLLOHOSP 1265.8(1292.3)254670
APOLLOTYRE 209.65(210.75)1887429
ARVIND 88.15(86.75)2300645
ASHIANA 112.45(112.2)34764
ASHOKA 118.75(123.55)81695
ASHOKLEY 83(82.6)20419146
ASIANPAINT 1379.5(1372.15)1590764
ASTRAL 1084.4(1030.15)46797
ASTRAZEN 1601.45(1600.15)13710
ATUL 3313.95(3472.65)30511
AUROPHARMA 755.6(786.15)2576685
AXISBANK 656.3(669.75)7792690
BAJAJ-AUTO 2565.55(2626.35)332409
BAJAJCON 357(344.55)160775
BAJAJELEC 436.95(454.65)101760
BAJAJFINSV 6050.9(6321.55)299286
BAJAJHIND 7.75(8.3)3119958
BAJAJHLDNG 2853.5(2861.8)28941
BALKRISIND 815.75(829.25)988015
BALLARPUR 3.5(3.75)1670057
BALMLAWRIE 186.25(189.15)19095
BALRAMCHIN 98.55(103.1)1538720
BANKBARODA 109.15(110.2)13633282
BANKINDIA 90.6(94.45)9725854
BASF 1351.8(1370.15)31347
BATAINDIA 1097.85(1124.2)679107
BBTC 1184.6(1213.95)116985
BEML 817.15(848.6)1314880
BERGEPAINT 312.1(313.95)589432
BFUTILITIE 195.8(204.05)224016
BGRENERGY 53.25(54.45)39543
BHARATFIN 910.95(944.05)602249
BHARATFORG 470.6(479.6)738279
BHARTIARTL 305.15(307.5)4097172
BHEL 63.75(66.4)8737901
BIOCON 649.05(664.7)1809772
BIRLACORPN 497.35(504.4)30443
BLISSGVS 154.65(156.25)1787456
BLUEDART 2940.75(2996.8)3617
BLUESTARCO 605.25(607.4)107639
BOMDYEING 106.75(112.3)650122
BOSCHLTD 18262.4(18526.25)13237
BPCL 348.7(357.45)1451374
BRFL 8.3(8.5)78225
BRIGADE 203.15(206.55)53982
CADILAHC 334.35(343.7)1483625
CANBK 240.4(254.35)10601787
CARERATING 988.15(989.1)23482
CASTEXTECH 1(1.05)340805
CASTROLIND 159.95(164.25)1028085
CCL 269.15(270.45)13104
CEATLTD 1151.65(1188.9)516578
CENTRALBK 31.05(32.7)403328
CENTURYPLY 164.25(166.15)72339
CENTURYTEX 813.05(836.6)1751784
CERA 2481.45(2510)2397
CESC 677.2(688.3)357765
CHAMBLFERT 160.75(163)171193
CHENNPETRO 243.1(256.75)683314
CHOLAFIN 1128.35(1147.85)131624
CIPLA 492.15(507.65)3215535
CLNINDIA 384.4(396.25)6328
COALINDIA 225.2(220.95)3917992
COLPAL 1264.1(1288.3)580619
COROMANDEL 434.85(440.3)57137
CORPBANK 25.75(26.55)163245
COX&KINGS 150.65(154.3)98768
CRISIL 1646.45(1646.45)4510
CUB 190.75(188.8)1332819
CUMMINSIND 809.05(830.6)404369
CYIENT 590.15(599.55)72030
DABUR 427.4(430)1613234
DBCORP 169.25(174.55)38005
DBREALTY 25(26.3)83404
DCBBANK 175.75(180.4)2156674
DCMSHRIRAM 303.2(315.05)50663
DEEPAKFERT 113.6(113.1)769559
DELTACORP 229.5(231.8)854332
DEN 71.15(71.45)1561859
DENABANK 12.45(12.65)1309657
DHANUKA 405.9(415.05)6852
DHFL 184.9(209.1)23916011
DISHTV 23.9(22.4)164851909
DIVISLAB 1473.45(1495.35)211598
DLF 164.05(158)11812368
DREDGECORP 390.9(407.5)182584
DRREDDY 2624.75(2672.4)684994
DYNAMATECH 1396.85(1398.15)220
ECLERX 1046.2(1055.25)2883
EDELWEISS 150.9(158.8)3205152
EICHERMOT 19987.4(20049.95)101907
EIDPARRY 198.65(200.1)84695
EIHOTEL 181.25(181.3)126301
ELECTCAST 19.7(21.05)381960
ELGIEQUIP 240.5(250.95)33930
EMAMILTD 405.65(418.95)364195
ENGINERSIN 113.9(112.3)1061514
EROSMEDIA 79.4(79.5)373681
ESCORTS 675.05(703.05)5177658
ESSDEE 15(15.75)14978
ESSELPACK 108.3(96.15)1876479
EVEREADY 211.75(212.3)91243
EXIDEIND 220.4(230.15)2889061
FCONSUMER 39.8(39.6)1579631
FDC 155.4(160.3)31172
FEDERALBNK 84.15(86.5)7823189
FINCABLES 422.9(424.45)22101
FINPIPE 530.35(530.05)9956
FLFL 420.3(420.85)33721
FORTIS 135.85(135.4)1242789
FSL 47.25(47.95)2909093
GAIL 333.2(334.9)3799381
GATI 71.55(75.35)414822
GDL 99.2(97.25)371561
GEPIL 800.85(801.25)4013
GESHIP 283.65(289.9)23007
GET&D 286.35(288.05)51407
GILLETTE 6500.5(6496.9)1642
GLAXO 1392.75(1402.4)8305
GLENMARK 631.6(646.9)358789
GLOBOFFS 13.7(13.8)9681
GMDCLTD 85.3(85.05)74319
GMRINFRA 15.4(15.65)21369201
GODFRYPHLP 907.85(945.8)153040
GODREJCP 759.25(780.3)1026380
GODREJIND 512(516.7)325395
GODREJPROP 742.6(745.3)565379
GPPL 86.1(88.95)158507
GRANULES 89.3(94.7)1116698
GREAVESCOT 116.6(118.1)271947
GREENPLY 129.8(131.05)88154
GRINDWELL 545.55(567.8)19351
GRUH 220.7(227.1)1363222
GSFC 94.6(97.75)1803984
GSKCONS 7239(7290.6)9532
GSPL 178.95(181.3)202423
GUJFLUORO 844.05(879.95)118850
GULFOILLUB 853.85(856.75)6509
GVKPIL 6.7(6.9)1761783
HATHWAY 31.8(31.9)4525307
HAVELLS 698.7(708.15)1425427
HCC 12.65(13.1)4424043
HCL-INSYS 19.75(20.4)1010726
HCLTECH 977.8(969.4)1514965
HDFC 1946.9(1977.8)2698966
HDFCBANK 2084.15(2096)3840109
HDIL 26.8(27.65)2991996
HEIDELBERG 142.9(148.15)43609
HEROMOTOCO 2598.6(2670.15)576248
HEXAWARE 319.6(324)1386777
HFCL 21.4(21.9)2321109
HIMATSEIDE 206.5(211.95)246356
HINDALCO 200(204.45)5741120
HINDCOPPER 45.5(46.25)305820
HINDPETRO 239.2(241.8)2334958
HINDUNILVR 1743(1756.8)1289774
HINDZINC 251.1(250.4)407107
HMT 16.35(16.95)20268
HMVL 116.5(118.5)8086
HONAUT 21548.3(21932.1)704
HOTELEELA 14.05(14.55)135293
HSIL 232.6(236.45)80138
HTMEDIA 40.2(40.1)109278
IBREALEST 76.45(81.75)1744042
IBULHSGFIN 699.3(744.5)5637650
ICICIBANK 343.55(357.2)34362360
ICRA 3012(3051.35)231
IDBI 53.6(54.9)3125334
IDEA 31.05(32.85)29488750
IDFC 39.95(40.8)2550938
IFBIND 794.25(841.65)8697
IFCI 13.9(13.7)5026600
IGARASHI 517.95(519.25)4659
IIFL 429.7(439.6)143963
IL&FSTRANS 8.6(9.05)207043
INDHOTEL 137.25(133.5)443645
INDIACEM 79.15(80.75)3663863
INDIANB 218.4(238.4)5100353
INDOCO 183.45(182.15)209337
INDUSINDBK 1443.7(1484.9)2246761
INEOSSTYRO 639.05(655.65)1086
INFRATEL 287.3(279.75)8309902
INFY 727.95(730.35)7944693
INGERRAND 588.3(589.7)14661
INOXLEISUR 249.4(251.75)282377
INOXWIND 68.15(69.1)47589
INTELLECT 193.6(206.85)1003742
IOB 13.6(14)594840
IOC 138.05(137.75)5570306
IPAPPM 408(424.5)58518
IPCALAB 779.9(779.95)105990
IRB 147.85(148.95)1682967
ITC 274.75(279.2)8992136
J&KBANK 39.6(39.1)1908266
JAGRAN 101.15(104.15)100213
JAICORPLTD 97.8(103.05)646117
JBCHEPHARM 309.85(308.25)38265
JBFIND 19.05(19.95)47451
JCHAC 1796.05(1772)2959
JETAIRWAYS 244.8(253.05)9565855
JINDALPOLY 236.55(249.7)27875
JINDALSTEL 132.25(137.4)11483485
JISLJALEQS 58.1(59.25)8476395
JKCEMENT 701.8(710.1)10450
JKIL 113.3(115.25)94044
JKLAKSHMI 298.05(291.95)64641
JKTYRE 94.05(95.9)350659
JMFINANCIL 77.6(82.65)630875
JPASSOCIAT 6.6(6.65)20143662
JPINFRATEC 3.35(3.5)561319
JPPOWER 1.9(1.95)1339072
JSWENERGY 64.95(66.8)388519
JSWHL 2632.55(2690.75)2176
JUBILANT 714.15(707.5)278959
JUBLFOOD 1202.05(1197.85)1239212
JUSTDIAL 458.85(476.85)1060139
JYOTHYLAB 175(178.35)806115
KALPATPOWR 367.35(371.75)20679
KANSAINER 438.05(449.05)165695
KEC 241.7(247.7)205333
KESORAMIND 73.7(77.2)155024
KIRLOSENG 177.6(188.15)21334
KITEX 102.1(102.9)148104
KOLTEPATIL 253.6(261.65)65643
KOTAKBANK 1260.45(1266.15)2054592
KPIT 111.75(112.4)11058081
KRBL 333(359.4)256182
KSCL 590.35(590.35)542093
KSK 1.35(1.4)153552
KTKBANK 116.05(117.45)1426205
KWALITY 6.7(6.9)1315195
L&TFH 128.45(134.65)10124940
LAKSHVILAS 69(68.5)205342
LAOPALA 209.25(214.65)11393
LAXMIMACH 5308.45(5403.1)2388
LICHSGFIN 446.7(453.05)1544866
LT 1300.45(1285.45)8004136
LUPIN 865.25(865.05)2416180
M&M 673.05(683.5)5762442
M&MFIN 403.6(416.9)3223984
MAGMA 99.95(103.2)62784
MAHINDCIE 227.4(232.25)234600
MAHLIFE 406.95(410.7)92254
MANAPPURAM 95.9(98.85)3440351
MANPASAND 73.55(78.55)236391
MARICO 365.15(369.9)1317448
MARKSANS 25.95(26.55)987806
MARUTI 6511.05(6513.4)2398091
MAYURUNIQ 367.7(370.85)5499
MCLEODRUSS 98.4(102.85)104306
MERCK 3097.95(3213.7)18475
MHRIL 205.3(205.05)59072
MINDACORP 145.1(145.65)113489
MINDTREE 868.6(886.1)2225129
MMTC 26.45(27.1)498166
MOIL 157.3(158.75)69141
MONSANTO 2552.85(2538.35)867
MOTHERSUMI 145.3(150.8)6821443
MOTILALOFS 647.2(646.2)67675
MPHASIS 940.95(920.9)326801
MRF 62559.95(63920.95)4488
MRPL 68.75(68.5)1358411
MTNL 13.8(14.25)502157
MUTHOOTFIN 509.05(534.5)2100474
NATCOPHARM 669.55(674.65)96658
NATIONALUM 59.9(60.55)6065127
NAUKRI 1673.6(1691.05)250359
NAVKARCORP 45.45(46.5)150210
NCC 79.4(81.7)5883868
NETWORK18 36.1(36.6)210571
NHPC 24.55(25)1752146
NIITTECH 1291(1294.7)670736
NITINFIRE 1.55(1.6)91544
NLCINDIA 68.05(68)213302
NMDC 91.2(90.5)2412974
NTPC 138.6(138.3)6086122
OBEROIRLTY 448.1(457.3)131400
OFSS 3727.15(3708)19146
OIL 171.7(171.85)632113
OMAXE 210.95(211.9)299671
ONGC 141.65(142)2910523
ORIENTBANK 91.45(93.7)3375907
ORIENTCEM 69.45(71.8)45986
ORISSAMINE 759.6(795.5)7816
PAGEIND 22370.8(22758.2)25359
PARSVNATH 6(6.7)183211
PCJEWELLER 74.55(75.95)6660818
PEL 2170.5(2299.2)1195252
PERSISTENT 564.95(561.95)381234
PETRONET 219(227.05)4780072
PFC 100.75(103.2)5655057
PFIZER 2804.5(2762.65)23540
PFS 15.35(15.9)586204
PGHH 9908.8(9928.85)3557
PHOENIXLTD 606.5(602.9)36031
PIDILITIND 1102(1129.8)428568
PIIND 846.7(850.85)40747
PNB 76.1(76.6)19106196
POWERGRID 187.8(185.85)4185481
PRAJIND 112.55(121.3)3435806
PRESTIGE 203.9(206.25)57697
PRSMJOHNSN 74.85(76.25)182305
PTC 80.6(85.7)2069912
PUNJLLOYD 3.05(3.2)346481
PURVA 70.15(73.05)109638
PVR 1577.2(1561.8)264800
RADICO 417.6(420.8)402779
RAIN 110.6(114.85)849416
RAJESHEXPO 584.95(584.55)118476
RALLIS 163.1(162.3)109191
RAMCOCEM 569.95(579.25)348896
RAMCOSYS 240.7(245.05)9379
RATNAMANI 884.8(885.25)7434
RAYMOND 746.65(774.4)708484
RCF 60(61.95)769318
RCOM 12.15(12.45)47207121
RECLTD 118.95(120.7)3490410
REDINGTON 73.3(69.25)2210698
RELAXO 731(720.6)26120
RELCAPITAL 198.5(209.25)7179567
RELIANCE 1229.55(1246)8569265
RELINFRA 257.5(270.7)4587277
RENUKA 10.3(10.55)507063
REPCOHOME 396.65(408.7)488388
RIIL 314.7(323.45)108725
RKFORGE 501.6(501.15)17471
RNAVAL 11.65(12.1)1345181
ROLTA 6.05(6.35)946983
RPOWER 26.95(28.05)8916262
RTNPOWER 3.5(3.6)1725195
RUCHISOYA 7.1(7.35)720001
SADBHAV 190.6(199.3)1095404
SADBHIN 90.45(92.65)3928
SAIL 46.15(47.25)8158462
SANOFI 6324.6(6277.95)3561
SBIN 281.6(285.4)18905470
SCHAEFFLER 5260.85(5345.3)6528
SCHNEIDER 88.6(90.85)31396
SCI 40.65(42.05)338264
SHARDACROP 306.15(305.55)16753
SHILPAMED 383.7(391.6)7489
SHK 162.15(169.4)32048
SHOPERSTOP 519.15(517)12099
SHREECEM 15052.4(15723.2)29244
SHRIRAMCIT 1752.1(1742.65)338559
SIEMENS 991.45(1029.75)319557
SIMPLEXINF 163.45(167.8)48662
SINTEX 10.1(10.9)2894022
SITINET 7.1(8.65)1093467
SJVN 25.85(25.8)483879
SKFINDIA 1918(1926.75)17211
SMLISUZU 587.55(601.7)5968
SNOWMAN 31.5(32.8)129151
SOBHA 484.05(490.15)72595
SOMANYCERA 338.65(344.1)56692
SONATSOFTW 316.2(318.3)131829
SOUTHBANK 13.15(13.45)14794262
SPARC 166.2(167.95)590638
SREINFRA 29.7(30.25)4681895
SRF 2008.05(2076.35)279384
SRTRANSFIN 1055.7(1120.15)2398246
STAR 504.5(518.6)1189348
STCINDIA 113.9(116.95)73966
SUNDARMFIN 1400.15(1453.1)52637
SUNDRMFAST 510.5(520.05)74087
SUNPHARMA 411.75(422.4)5809082
SUNTV 532.35(505.85)4524193
SUPREMEIND 994.2(997.9)42786
SUVEN 186.6(194.15)310679
SUZLON 4.95(5.05)22110865
SWANENERGY 100.7(97.95)228223
SYMPHONY 1153.3(1206.5)9463
SYNDIBANK 34.55(34.9)4146527
SYNGENE 567.15(588.85)359237
TAKE 138.6(143.4)113041
TATACHEM 661.45(682.45)555258
TATACOFFEE 91.4(92.6)152007
TATACOMM 500.4(493.15)838301
TATAELXSI 875.1(912.8)687170
TATAGLOBAL 209.25(207.05)1629992
TATAMOTORS 172.3(173.25)8167430
TATAMTRDVR 88.9(90.45)2443776
TATAPOWER 70.95(73.95)5766908
TATASPONGE 672.2(695.9)56520
TATASTEEL 445.7(452.9)4335147
TATASTLBSL 31.3(32.7)482907
TBZ 57.8(61.4)43166
TCS 1955(1920.8)2769033
TECHM 735.15(729.05)1804582
TEXRAIL 53.3(55.65)330008
THERMAX 1117.5(1130.55)40514
THOMASCOOK 214.8(220.9)99996
TIDEWATER 5156.2(5233.55)465
TIMKEN 529.25(550.85)17138
TITAN 958.65(978)1499181
TNPL 230.2(230)31333
TORNTPHARM 1846.8(1861.65)73752
TORNTPOWER 246.5(251.4)628086
TREEHOUSE 4.15(4.35)12188
TRIDENT 64.55(65.65)534385
TRITURBINE 105.75(106.55)31863
TTKPRESTIG 7668.55(7754.85)10398
TTML 3.75(3.85)1418386
TV18BRDCST 32.4(32.55)5152285
TVSMOTOR 477.75(496.1)2314265
TVSSRICHAK 2344.3(2361.45)1151
TVTODAY 351.25(345.45)21411
UBL 1404.35(1427.8)318205
UCOBANK 18.55(19.15)394554
UFLEX 250.5(255.2)35424
ULTRACEMCO 3374.45(3510.8)1260559
UNICHEMLAB 200.8(204.55)25912
UNIONBANK 78.4(79.45)7611090
UNITECH 1.65(1.7)1150664
UPL 760.05(753.1)1226284
VAIBHAVGBL 682.3(685.35)6183
VAKRANGEE 41.05(43.2)4965498
VEDL 191.5(194.7)6045200
VIDEOIND 2.9(2.95)115199
VIJAYABANK 43(43.7)1547916
VINATIORGA 1547.1(1567.25)18470
VIPIND 468.25(478.25)164652
VOLTAS 534.1(532.45)942490
VRLLOG 260(259.55)43497
VSTIND 3177.5(3201.2)8697
VTL 1065.1(1070)4128
WABAG 292.35(295.25)112873
WABCOINDIA 6249.2(6262.5)1458
WELCORP 107.4(105.25)457246
WELSPUNIND 58.6(57.3)1164632
WHIRLPOOL 1464(1458.45)33199
WIPRO 355.15(353.45)6899957
WOCKPHARMA 444.95(478.9)3243195
WONDERLA 287.55(285)66632
ZEEL 373.3(318.4)121305516
ZEELEARN 25.3(27.35)3304775
ZYDUSWELL 1300.5(1301.4)5650



పాలిండ్లపై 'పాషాణం'

వక్షోజాలు పెరగకుండా దురాగతం.. కామెరూన్‌లో ప్రతి నలుగురిలో ఒకరికి బ్రెస్ట్ ఐరనింగ్

అత్యాచారాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా.. బ్రిటన్‌కు విస్తరించిన ఆఫ్రికన్ దురాచారం

వారంతా లోకం తెలియని పసి పిల్లలు. నైర్మల్యానికి ప్రతీకలు. అందరిలా వయసుతోపాటు పెరిగే అవయవాలే తమపై జరుగుతున్న అరాచకాలకు కారణమనీ వాళ్లకు తెలియదు. ఆలోచించేంత లోకజ్ఞానం కూడా లేదు. కానీ కంటికి రెప్పలా కాపాడుకునే తమ బిడ్డలపై కసాయిల చూపు పడి కబళిస్తారేమోనన్న తల్లిదండ్రుల భయం.. పసి గుండెలపై గాయం పడేలా చేస్తోంది. అమ్మాయిల ఛాతీలపై పాషాణ పోటుకు కారణమవుతోంది.

భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నా.. ఆచారాలు, సంప్రదాయాల పేరుతో అనాగరిక విధానానికి అమ్మాయిలను బలిచేస్తున్నారు కామెరూన్ ప్రజలు. బ్రెస్ట్ ఐరనింగ్‌గా పిలిచే ఈ చర్య ఒకప్పుడు ఆఫ్రికా దేశాల్లోనే కనిపించేది. ఇప్పుడీ దురాగతం బ్రిటన్‌కూ పాకి ప్రపంచాన్ని కలవరపెడుతోంది. మగ వేషంలో తిరుగుతున్న మృగాల దృష్టి తమ బిడ్డలపై పడకుండా.. లైంగిక వేధింపుల నుంచి తమ కూతుళ్లను రక్షించుకునేందుకు ఆఫ్రికా దేశాల్లో రాళ్లు వేడి చేసి అమ్మాయిల ఛాతీపై అదిమి పెడుతూ.. బలంగా రుద్దుతున్నారు. పసి హృదయాలు తల్లడిల్లుతున్నా... కన్న బిడ్డ కన్నీరు పెడుతున్నా ఆ బాధను గుండెల్లోనే దాచుకుని దురాచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ చర్య వల్ల అమ్మాయిల వక్షోజ కణాలు దెబ్బతిని పెరుగుదల మందగిస్తుంది. అలా చేస్తే అమ్మాయిలు లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురికాకుండా ఉంటారని వారి భావన. రాళ్లతో పాటు కలపతో చేసి వస్తువులను కూడా బ్రెస్ట్ ఐరనింగ్‌కు ఉపయోగిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. దీనివల్ల వక్షోజాల పెరుగుదల తగ్గిపోయి స్తనాలు కూడా కమిలిపోతాయి. అత్యంత దారుణమైన ఈ దురాగతం బ్రిటన్‌లో రోజురోజుకూ పెరిగిపోతోంది. లండన్, యార్క్‌షైర్, ఎస్సెక్స్‌లో కౌమార దశలో ఉన్న అమ్మాయిల వక్షోజాలు పెరగకుండా ఇలాంటి అనాగరిక విధానాన్ని అనుసరిస్తున్నారు.

వారానికి రెండు మూడు సార్లు

బ్రెస్ట్ ఐరనింగ్ వల్ల శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదురవుతాయి. బ్రెస్ట్ కేన్సర్ కూడా వచ్చే అవకాశం ఉందని హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వారానికి ఒకసారి, రెండు మూడు సార్లు బ్రెస్ట్ ఐరనింగ్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇలాంటి కేసులు ఇటీవల పెరిగిపోతున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా లింగ ప్రాతిపాదికన జరుగుతున్న హింసల్లో టాప్ 5లో ఇదీ ఒకటని ఐక్యరాజ్య సమితి కూడా వెల్లడించింది.

కామెరూన్‌లో అధికం

కామెరూన్‌లోని 200 వరకు గిరిజన తెగలు బ్రెస్ట్ ఐరనింగ్‌ను ఆచారంగా కొనసాగిస్తున్నారు. అక్కడ ప్రతి నలుగురు మహిళల్లో ఒకరికి బ్రెస్ట్ ఐరనింగ్ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీని వల్ల చిన్న వయసులో గర్భం రాకుండా నిరోధించవచ్చని, బాల్యవివాహాలు కూడా తగ్గిపోతాయని వారి నమ్మకం. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా 1976 తర్వాత బాల్యవివాహాలు 50 శాతం నుంచి 20 శాతానికి తగ్గడం విశేషం. అయితే ఈ విధానాన్ని 39 శాతం మంది మహిళలు వ్యతిరేకిస్తుండగా.. 41 శాతం మంది మద్దతిస్తున్నారని 2006లో జరిపిన సర్వేలో తేలింది. ఐవరీ కోస్ట్, కెన్యా, జింబాంబ్వే వంటి దేశాల్లోనూ ఈ ఆచారం కొనసాగుతోంది.



యాదాద్రి ఆలయ ప్రాకారంలోని పడమటి రాజగోపురం ఎదుట విజయ మండపం కోసం ప్రతిష్ఠించిన నాలుగు స్తంభాలు

సంకల్ప సిద్ధి కోసం విజయ మండపం

యాదాద్రి ఆలయ ప్రాకారంలో నిర్మాణం

భక్తులను ఆకట్టుకోనున్న మరో విశిష్టత

యాదాద్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజుల కాలం నాటి సంప్రదాయాలను కొనసాగిస్తూ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాకారంలో 4 విజయ స్తంభాలతో రాతి శిలా మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరాలనే సంకల్పంతో ఐదంతస్థుల పడమటి రాజగోపురం ఎదురుగా 14 అడుగుల పొడవు 32అడుగుల వెడల్పుతో మండప నిర్మాణం చేపట్టారు. సంకల్పానికి(కోరికకు) ప్రతీకగా అశ్వపాదం.. ప్రస్తరం.. కంఠం.. పద్మం.. రాతి శిలలతో నాలుగు విజయ స్తంభాలను ప్రతిష్ఠించారు. సాలాగారాలు ఏర్పాటు చేసి మండపం ముందుభాగాన లక్ష్మీనారసింహుల రాతి విగ్రహాలు.. శంఖు, చక్ర, నామాలు.. సింహపు రాతి బొమ్మలు ప్రతిష్ఠించనున్నారు. ఈ విజయ మండపం భక్తులను ఆకట్టుకునే మరో విశిష్టత కానుంది.

కోడిపెట్టే కేన్సర్ గోలి!

- జన్యు సవరణ కోళ్ల గుడ్లలో మానవులకు అవసరమయ్యే ప్రొటీన్



వాషింగ్టన్ డీసీ, జనవరి 28: కేన్సర్ చికిత్స అంటేనే బోలెడు ఖర్చు. పైగా, మానసికంగా, శారీరకంగా బాధను అనుభవించాల్సిందే. కేన్సర్ సహా అనేక వ్యాధులను తగ్గించడంలో 'ఐఎఫ్ఎన్ఆల్ఫా2ఏ' అనే మానవ ప్రొటీన్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఔషధ రూపంలో కృత్రిమంగా ఈ ప్రొటీన్‌ను తయారుచేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని. అతి తక్కువ ఖర్చుకే ప్రభావవంతంగా ఈ ప్రొటీన్‌ను తయారు చేయడానికి శాస్త్రవేత్తలు కోళ్లను ఎంచుకున్నారు యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్ శాస్త్రవేత్తలు.. కోడిపెట్ట డీఎన్ఏను సవరించి, గుడ్డులో పచ్చసొన రాకుండా చేసి ప్రొటీన్ ఉత్పత్తి అయ్యేలా చేశారు. ల్యాబ్ వాతావరణంలో ప్రొటీన్ తయారు చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని, అదే జన్యు సవరణ చేసిన కోళ్ల ద్వారా 100 రెట్లు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయవచ్చని పరిశోధకులు తెలిపారు. ఐఎఫ్ఎన్ఆల్ఫా2ఏ ప్రొటీన్ కేన్సర్, కీళ్లవాతం సహా అనేక వ్యాధులపై పోరాడుతుందని వెల్లడించారు. అయితే, ఇప్పుడే ఈ గుడ్లను ప్రజల కోసం అందుబాటులోకి తేవడం లేదని వివరణ ఇచ్చారు.



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై చేతిసంచి ధరించి నడుస్తున్న నరేంద్ర మోదీ పెయింటింగ్.. వేలంలో రూ.5 లక్షలకు హాట్ కేక్‌లా అమ్ముడయింది. కనీస ధర రూ.50 వేలు నిర్ణయించగా పది రెట్లకు ఎగరేసుకుపోయారు. రూ.40 వేలుగా పెట్టిన చెక్క మోటారు సైకిల్ కూడా

మోదీ చిత్తరువు ధర 5 లక్షలు

రూ.5 లక్షలు పలికింది. ఎందుకంటే.. ఇవి ప్రధాని మోదీకి లభించిన బహుమతులు. ఇవే కాదు మోదీకి లభించిన రకరకాల నజరానాలకు ఆది, సోమవారాల్లో వేలం పాట నిర్వహించారు. రెండో రోజు మొత్తం 1,900కు గాను 270 బహుమతులను ఔత్సాహికులు వేలంలో సొంతం చేసుకున్నారు.

- న్యూఢిల్లీ

ప్రియాంక రాకతో బీజేపీ నేతల్లో భయం

- సుబ్రహ్మణ్యస్వామిది ప్రతికూల వైఖరి: వీహెచ్
- మోదీ పాలనలో వ్యవసాయం ధ్వంసం: కోదండరెడ్డి

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రియాంక గాంధీ పేరు చెబితేనే బీజేపీ నేతలు భయపడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఎద్దేవా చేశారు. ఆమెపై ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు చవకబారు విమర్శలు చేస్తున్నారని, ఇకనైనా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. ప్రియాంక రాజకీయాల్లోకి రావడంతో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ప్రతికూల మనస్తత్వం కలిగిన వ్యక్తి అని, బ్లాక్‌మెయిలర్ అని విమర్శించారు. ప్రియాంక రాకను ఇతర పార్టీలు స్వాగతిస్తున్న విషయాన్ని బీజేపీ నేతలు గుర్తించాలని సూచించారు. కాగా, కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనతో ప్రయివేటు ఇన్సూరెన్సు కంపెనీలే లాభపడ్డాయని, రైతులకు నష్టమే మిగిలిందని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి విమర్శించారు. మోదీ పాలనలో దేశంలో వ్యవసాయరంగం పూర్తిగా ధ్వంసమైందన్నారు. తెలంగాణలో భూ రికార్డుల ప్రక్షాళన అస్తవ్యస్తంగా మారిందని, 30% మంది రైతులకు ఇంకా కొత్త పాస్ పుస్తకాలు అందలేదన్నారు. కాగా, ఓటరు జాబితాలో బోగస్ ఓట్లను చేర్చినందునే చాలా చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులు సర్పంచ్‌లుగా స్వల్ప మెజారిటీతో విజయం సాధిస్తున్నారని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ ఆరోపించింది.

ఎకరాకు 20వేలు పరిహారం ఇవ్వాలి: తమ్మినేని

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండురోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో గత ఆగస్టులో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ పరిహారం అందలేదని ఆరోపించారు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల పరిహారం కింద ఏటా రూ.300 కోట్లు చొప్పున కేటాయిస్తున్న నిధులను ప్రభుత్వం ఖర్చు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఖరీఫ్, రబీల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి: రావుల

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి సోమవారం డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో మార్కెట్‌యార్డులకు వచ్చిన పంటలు కూడా తడిసిపోయాయని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పంటల నష్టాన్ని పరిశీలించి బాధిత రైతులకు వెంటనే పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రావుల కోరారు.

క్లస్టర్ల వారీగా బీజేపీ సమీక్షలు

- 5న తొలి సమావేశం.. కేంద్ర మంత్రి గడ్కరీ రాక
- నేడు విద్యార్థులతో ప్రధాని మోదీ 'పరీక్ష పే చర్చ'

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ నాయకత్వం, కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించనుంది. 17 లోక్‌సభ నియోజకవర్గాలను 4 క్లస్టర్లుగా విభజించారు. ఫిబ్రవరి 5న సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి తొలి క్లస్టర్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరుకానున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తక్కువ ఓట్లు పోలైన చోట్ల ఓటు బ్యాంకును పెంచే దిశగా పార్టీ నేతలు దృష్టి సారించారు. కాగా పార్లమెంటు సమావేశాల దృష్ట్యా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పర్యటన వాయిదా పడిందని, ఫిబ్రవరి రెండో వారంలో ఆయన రానున్నారని కె.లక్ష్మణ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మరోవైపు ప్రధాని మోదీ మంగళవారం విద్యార్థులతో 'పరీక్ష పే చర్చ' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసారం జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు.

బడి 'బాట'లోనే విద్యార్థులు

రాష్ట్రంలో తగ్గిన డ్రాపవుట్‌లు.. 2017-18లో కేవలం 3.53 శాతమే

- గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో పెరుగుదల
- 23 జిల్లాల్లో సున్నా రిపిటేషన్ రేటు
- 2017-18 ఎస్ఎస్ఏ వార్షిక నివేదిక



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థ గాడిలో పడ్డట్లు కనిపిస్తోంది. 2016-17 విద్యా సంవత్సరంతో పోల్చితే 2017-18 విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ (ప్రవేశాలు) పెరగడంతోపాటు డ్రాపవుట్ రేట్ కూడా తగ్గింది. అధికారిక లెక్కల ప్రకారం 2016-17లో ప్రాథమిక పాఠశాలల స్థాయిలో 18.48 శాతం డ్రాపవుట్ రేట్ ఉంటే, 2017-18లో అది 3.53 శాతానికి తగ్గింది. ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలో 2016-17లో 32.46 శాతం డ్రాపవుట్ రేట్ ఉండగా.. 2017-18లో అది 2.62 శాతంగా నమోదైంది. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) వార్షిక నివేదికలో ఈ విషయాలను పొందుపరిచింది. బాలికల కన్నా బాలురే ఎక్కువగా బడి మానేస్తున్నట్లు నివేదికలో వెల్లడైంది. ప్రాథమిక స్థాయిలో బాలికల డ్రాపవుట్ రేట్ 3.06 శాతం ఉండగా బాలురది 3.95 శాతంగా నమోదైంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాలికల డ్రాపవుట్ రేట్ 2.12 శాతం ఉంటే.. బాలుర రేట్ 3.09 శాతం ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా వరంగల్ రూరల్ జిల్లాలో 12.5 శాతం డ్రాపవుట్ నమోదైంది. ఆ తర్వాత ఆదిలాబాద్, వనపర్తి, కుమ్రం భీం, నల్లగొండ, జగిత్యాల జిల్లాల్లోనూ డ్రాపవుట్‌లు ఎక్కువగానే ఉన్నాయి. ఇక రాష్ట్రంలో 25,660 నివాస సముదాయాలు (హ్యాబిటేషన్స్) ఉండగా.. వీటిలో 20,209 నివాస సముదాయాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉన్నట్లు, 22,498 నివాస సముదాయాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నట్లు అధికారులు నివేదికలో వెల్లడించారు. మొత్తంగా ప్రాథమిక పాఠశాలలు 98.24 శాతం నివాస సముదాయాల్లో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 451 నివాస సముదాయాల్లో మాత్రమే ప్రాథమిక పాఠశాలలు లేవని పేర్కొన్నారు. ఇక 87.67 శాతం నివాస సముదాయాలు ప్రాథమికోన్నత పాఠశాలల్ని కలిగి ఉన్నాయని, రాష్ట్రంలో 3162 నివాస సముదాయాల్లో ఈ పాఠశాలలు లేవని తెలిపారు. కాగా 2016-17 విద్యా సంవత్సరంతో పోల్చితే 2017-18లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్) శాతం కూడా పెరిగింది. ఇందులో బాలికలతో పోల్చితే బాలురదే పైచేయి కావడం గమనార్హం.

పెరిగిన ప్రమోషన్ రేట్..

రాష్ట్రంలో విద్యార్థుల్లో ప్రమోషన్ రేట్ (పై తరగతులకు వెళ్లడం) కూడా ఎక్కువగానే ఉంది. ప్రాథమిక స్థాయిలో 96.4 శాతం ఉంటే, ప్రాథమిక స్థాయిలో 97.36 శాతం ఉంది. అయితే బాలికల ప్రమోషన్ రేట్‌తో పోల్చితే బాలుర ప్రమోషన్ రేట్ ఎక్కువగా నమోదైంది. ప్రాథమిక స్థాయిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 104.97% ఉండగా, మేడ్చల్‌లో 103.93%, హైదరాబాద్‌లో 98.82% ఉంది. ఇక రిపిటేషన్ రేటు(ఒక విద్యార్థి ఒకే తరగతి రెండుసార్లు చదవడం) తగ్గింది. 2017-18 విద్యాసంవత్సరంలో 23 జిల్లాల్లో రిపిటేషన్ రేటు సున్నాగా నమోదు కావడం గమనార్హం. మొత్తంగా రిపిటేషన్ రేటు ప్రైమరీ స్కూళ్లలో 0.07%, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో 0.02% నమోదైంది.

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదల తీరు ఇదీ..

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్	2016-17లో	2017-18లో	బాలికలు	బాలురు
ప్రాథమిక స్థాయిలో	98.56%	110.02%	108.68%	111.29%
ప్రాథమికోన్నత స్థాయిలో	86.91%	99.43%	99.24%	99.61%

2017-18లో డ్రాపవుట్ రేటు ఇలా

విద్యార్థి	ప్రాథమిక	ప్రాథమికోన్నత
బాలురు	3.95	3.09
బాలికలు	3.06	2.12
మొత్తం	3.53	2.62

పెండింగ్ సమస్యలపై నిలదీయండి!

- కేంద్రానికి నిరసన తెలపండి
- టీఆర్ఎస్ ఎంపీలకు సీఎం కేసీఆర్ నిర్దేశం
- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై సమీక్ష



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కేంద్రాన్ని నిలదీయాలని టీఆర్ఎస్ ఎంపీలను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ నిర్దేశించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాల కోసం ఈసారి పార్లమెంటు సమావేశాల్లో గట్టిగా పట్టుపట్టాలని సూచించారు. ఈనెల 31 నుంచి పార్లమెంటు సమావేశాలు పునఃప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో టీఆర్ఎస్ ఎంపీ బి.వినోద్‌కుమార్ సోమవారం కేసీఆర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. అలాగే పలువురు పార్టీ ఎంపీలతో సీఎం ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. కొత్త సచివాలయం నిర్మాణం కోసం రక్షణ శాఖ పరిధిలో ఉన్న బైసన్‌పోలో మైదానం కేటాయింపునకు అనుమతి, ఐఐఎం మంజూరు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, నీతి అయోగ్ సిఫారసు మేరకు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు కేంద్ర నిధుల మంజూరుసహా పలు సమస్యల పరిష్కారానికి ఈసారి పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పార్టీ ఎంపీలను ఆదేశించారు. పదే పదే డిమాండ్ చేస్తున్నప్పటికీ, కేంద్రం పట్టించుకోకపోవటంపై అవసరమైతే సభలో నిరసన కూడా తెలియజేయాలన్నారు. కాగా, సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు టీఆర్ఎస్ ఎంపీలు ప్రత్యేకంగా సమావేశమై సభలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసుకుంటారని తెలిసింది. మరోవైపు.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై సోమవారం ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నందున.. రాష్ట్రంలోనూ అదే రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికైతే ఫిబ్రవరి మూడో వారంలో బడ్జెట్ సమావేశాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.

తుది దశ 'పంచాయతీ' రేపే

- తొలి రెండు దశల్లో పోలింగ్ నిలిచిన వాటికి కూడా..

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చివరిదైన, మూడో విడత ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. వీటితో పాటు మొదటి, రెండో దశల్లో పోలింగ్ నిలిచిపోయిన చోట్ల కూడా రేపే ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు పెట్టి సాయంత్రానికి ఫలితాలు వెల్లడించనున్నారు. మూడో విడతలో 4,116 పంచాయితీలు, 36,729 వార్డులు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 577 సర్పంచ్, 8,956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,539 సర్పంచ్, 27,773 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ పోటీలో 11,667 మంది, వార్డు సభ్యుల పదవుల కోసం 67,316 మంది పోటీలో ఉన్నారు.



దండం పెడతా.. ఓటు నాకే వేయాలి

కాళ్లు మొక్కుతూ ఓటు అడుగుతున్న సర్పంచ్ అభ్యర్థి

ఆత్మకూర్(ఎస్) జనవరి 28: అన్న దండంపెడతా.. ఓటు మాత్రం నాకే వేయాలి. ఓటు వేసే రోజున తప్పనిసరిగా ఊరికి రావాలని కాళ్లకు నమస్కారం చేస్తూ ఓ అభ్యర్థి ఓటు అడుగుతున్నారు. సోమవారం సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ సర్పంచ్‌గా పోటీ చేస్తున్న టీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి దావీద్ రోడ్డుపై వెళ్తున్న గొర్రెల కాపరి కాళ్లు మొక్కుతూ ఓట్లు అడుగుతున్నారు. ఇళ్లలో యాదవులు ఉండకపోవడంతో రోడ్డుపై ఓట్లు అడుగుతున్నారు. ఈ గ్రామంలో ఈ నెల 30న ఎన్నికలు జరగనున్నాయి.

ఎస్‌ఐ పోస్టుల భర్తీకి హైకోర్టు లైన్ క్లియర్



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల భర్తీకి హైకోర్టు ధర్మాసనం లైన్ క్లియర్ చేసింది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు జడ్జి ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం నిలుపుదల చేసింది. ఈమేరకు సీజే రాధాకృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. సివిల్, ఏఆర్, టీఎస్‌ఎస్పీ తదితర కేటగిరీల్లో 1,217 ఎస్‌ఐ పోస్టుల భర్తీకి రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు 2015 మే 31న నోటిఫికేషన్ ఇచ్చింది. తర్వాత అర్హత పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షలో 6 ప్రశ్నలు తప్పుగా ప్రచురించారంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. 6 ప్రశ్నలు తొలగించి వాటి మార్కులను జతచేసి తిరిగి మూల్యాంకనం చేయాలంటూ హైకోర్టు జడ్జి మధ్యంతర ఆదేశాలిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనానికి అప్పీలు చేసింది. ఎస్‌ఐ పోస్టుల పరీక్షలో ఎలాంటి తప్పు లు దొర్లలేదని, ప్రశ్నపత్రాన్ని నిపుణుల కమిటీ రూపొందించిందని పేర్కొంది. ఈ వ్యాజ్యాన్ని విచారించిన ధర్మాసనం సింగిల్ జడ్జి ఆదేశాలను నిలుపుదల చేసింది.

ఆర్టిజన్లకు 10 లక్షల బీమా

TS TRANSCO
TSTRANSCO

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు చనిపోయినా లేదా శాశ్వత/పాక్షిక వైకల్యం బారిన పడినా.. వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా అందనుంది. దీనికోసం ప్రతీ ఆర్టిజన్ పేరిట రూ.325 నెలనెలా ప్రీమియంగా ట్రాన్స్‌కో చెల్లించనుంది. ఆర్టిజన్లు చనిపోయినా, పూర్తి వైకల్యానికి గురైనా, ఒకటి లేదా రెండు కాళ్లు కోల్పోయినా/ఒక కాలుతో పాటు ఒక కన్ను కోల్పోయినా 100% బీమా కింద రూ.10 లక్షల సహాయం చేస్తారు. ఒక కాలు లేదా ఒక కన్ను కోల్పోతే రూ.5 లక్షలు చెల్లిస్తారు. శాశ్వత/పాక్షిక వైకల్యం కలిగినట్లు వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆర్టిజన్ల పిల్లల చదువు కోసం రూ.15 వేలు, చనిపోతే అంత్యక్రియల కోసం రూ.2500, ప్రమాదం జరిగితే వైద్యంకోసం రూ.50 వేలు చెల్లిస్తారు. ఈ మేరకు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఉత్తర్వులు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఆర్టిజన్లకు జరిగే ప్రమాదాలకు మాత్రమే బీమా సౌకర్యం అందనుంది. తాగిన మత్తులో లేదా ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో, గర్భస్రావం సంబంధించిన కేసుల్లో పరిహారం అందదు. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో 20,903 మంది దాకా ఆర్టిజన్లు 4 గ్రేడ్‌లలో పనిచేస్తున్నారు.

ఎంబీబీఎస్ ఫార్మకాలజీ ప్రశ్నపత్రం తారుమారు



హైదరాబాద్/హన్మకొండ అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల్లో ఫార్మకాలజీ (ఔషధ శాస్త్రము) పేపర్-1 ప్రశ్నాపత్రం తారుమారైంది. సోమవారం పరీక్షకు హాజరైన విద్యార్థులకు అధికారులు రెండు రకాల ప్రశ్నాపత్రాలు ఇచ్చారు. ఈ విషయం తెలియని విద్యార్థులు పరీక్ష రాశారు. పొరపాటున రెండు రకాల ప్రశ్నాపత్రాలు వచ్చాయన్న విషయాన్ని పరీక్ష ప్రారంభమైన గంట తరువాత కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. విద్యార్థులకు నష్టం జరగకుండా జరిగిన పరీక్షను రద్దు చేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. తిరిగి ఫిబ్రవరి 12న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఎంబీబీఎస్ వార్షిక పరీక్షల కోసం ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసేందుకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నిపుణులు రూపొందించిన 10-15 రకాల ప్రశ్నాపత్రాలను హెల్త్ వర్సిటీ సేకరిస్తుంది. వాటిలో నాలుగు ప్రశ్నాపత్రాలను ర్యాండమ్‌గా తీసుకుంటుంది. ఆ ప్రశ్నాపత్రాలను ఆ సబ్జెక్టులో నిపుణులచే పరీక్షించి నిర్ధారించిన తరువాత వాటిని అప్‌లోడ్ చేయడానికి సాంకేతిక సిబ్బందికి ఇస్తారు. ఆ ప్రశ్నాపత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో ప్రతిదానికి ఒకపాస్ వర్డ్ ఇస్తారు. అయితే ఫార్మకాలజీ పరీక్షకు సంబంధించి పొరపాటున రెండు ప్రశ్నాపత్రాలకు ఒకే రకమైన పాస్‌వర్డ్ ఇచ్చారు. దాంతో ఆ పాస్‌వర్డ్ ద్వారా అధికారులు ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోగా.. కొందరు విద్యార్థులకు ఒకరకమైన ప్రశ్నాపత్రం, మరికొందరికి మరో రకమైన ప్రశ్నాపత్రం వచ్చింది. కాగా, తాము రాసిన పరీక్షనే పరిగణనలోకి తీసుకోవాలని, మళ్లీ పరీక్ష నిర్వహించవద్దని విద్యార్థులు కోరుతున్నారు.

విచారణకు ఆదేశించిన కాళోజీ హెల్త్ వర్సిటీ

ఒకే పాస్ వర్డ్‌తో రెండు రకాల ప్రశ్నాపత్రాలు డౌన్‌లోడ్ కావడంపై కాళోజీ హెల్త్ వర్సిటీ విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

రేపు ట్విటర్‌లో 'ఆస్క్ ఎంపీ కవిత'

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత బుధవారం నెటిజన్లతో ముచ్చటించనున్నారు. "జనవరి 30న మధ్యాహ్నం 1 గంటకు ట్విటర్లో మీతో నా అభిప్రాయాలను పంచుకుంటాను. మీ ప్రశ్నలకూ సమాధానాలిస్తాను. 'ఆస్క్ ఎంపీ కవిత' హాష్ ట్యాగ్‌పై మీ ప్రశ్నలు పంపండి." అని కవిత ట్వీట్ చేశారు.

● పీజీటీ ఉర్దూ పోస్టులకు ఎంపిక పూర్తి

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పీజీటీ ఉర్దూ సబ్జెక్టు పోస్టులకు ఎంపిక ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బి) కన్వీనర్ నవీన్ నికోలస్ తెలిపారు. 81 పోస్టులకు 78 మంది అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు.

● 1న 'రేడియోలాజికల్ ఫిజిక్స్'కు ఇంటర్వ్యూ

వైద్య విధాన పరిషత్‌లోని రేడియోలాజికల్ ఫిజిక్స్ అండ్ ఫిజిసిస్ట్ లెక్చరర్ పోస్టులకు ఫిబ్రవరి 1న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ సోమవారం ప్రకటించింది. అభ్యర్థులు ఉదయం 10గంటలకు కమిషన్ కార్యాలయంలో హాజరు కావాలని, వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొంది.

● 'ధరణి'ని చూడనీయండి: బ్యాంకర్లు

సమీకృత భూరికార్డుల యాజమాన్య విధానం(ధరణి)లో డిజిటల్ సంతకాలు చేసిన రైతుల రికార్డులను పరిశీలించే అవకాశం ఇవ్వాలంటూ బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. 1,48,10,359 కమతాల(రైతుల)కు సంబంధించిన వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నందున రైతులు తీసుకునే క్రాప్ లోన్స్, టర్మ్‌లోన్స్ సమాచారాన్ని అందులోనే పొందుపర్చాలని భావిస్తున్నారు. 'ధరణి' పూర్తిస్థాయిలో సిద్ధం కానందున బ్యాంకర్లకు లాగిన్ అవకాశం ఇవ్వలేదు. కాగా, పాస్‌పుస్తకాలు, టైటిల్ డీడ్ లేకుండానే బ్యాంకులు రుణాలివ్వాలన్న కొత్త రికార్డ్ ఆఫ్ రైట్(ఆర్వోఆర్) చట్టాన్ని బ్యాంకర్లు వ్యతిరేకిస్తున్నారు.

● ఆర్టీసీ మినీ థియేటర్లపై నివేదిక

ఆర్టీసీ నిర్మించే మినీ థియేటర్లపై అధ్యయన నివేదికను సోమవారం రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి, సంస్థ ఎండీ సునీల్‌శర్మకు అధికారుల బృందం అందజేసింది. ఈడీ పురుషోత్తం, సీటీఎం రాజేంద్రప్రసాద్, ఈఈ రాంబాబుల బృందం విజయవాడలో ఏపీఎస్‌ఆర్టీసీ మినీథియేటర్‌ను సందర్శించింది. అక్కడ రెండు తెరలపై ప్రదర్శించే చలనచిత్రాల ద్వారా ఆ సంస్థకు నెలకు రూ. 4.45 లక్షల ఆదాయం సమకూరుతున్నట్లు గుర్తించింది.

● ప్రభుత్వ పరీక్షల ఏడీకి రెండేళ్ల జైలు

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల అదనపు సంచాలకుడు(ఏడీ) ఎ.దానకోటి రవీంద్రరావుకు ఏసీబీ కోర్టు జడ్జి కె.శైలజ రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన విధించారు. దానకోటి ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఏసీబీ 2007లో కేసు నమోదు చేసింది. ఆయన ఆస్తుల విలువ రూ.34,18,864గా గుర్తించారు.

● ఆ ఏడు మండలాల్లో జోక్యానికి సుప్రీం నో

న్యూఢిల్లీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీలో విలీనమైన తెలంగాణకు చెందిన ఏడు మండలాలకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిలో జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం రాజ్యాంగ విరుద్ధంగా జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్న శశిధర్ రెడ్డి వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. దీన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

● ప్రతిరోజూ ఖైదీలతో 'ములాఖత్'

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో కుటుంబ సభ్యులు జైలులో రోజూ ములాఖత్‌లో మాట్లాడొచ్చు. ఈ వెసులుబాటు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. జైళ్లశాఖ ఏర్పాటు చేసిన ల్యాండ్ ఫోన్లను ఖైదీలు సెలవు రోజులు మినహా రోజూ 30 నిమిషాలు వాడుకునే వెసులుబాటు కల్పించారు. రిమాండ్ ఖైదీలకు మునుపటి లాగే వారానికి రెండు ములాఖత్‌లు ఉంటాయి.

● తెలంగాణకు 75 మంది హైకోర్టు ఉద్యోగులు

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవిభజన సమయంలో తెలంగాణకు కేటాయితమై, హైకోర్టులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న 75 మంది ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(ఏపీఏటీ) ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు. తమ జాయినింగ్ రిపోర్టులను సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ)కు సోమవారం అందించారు. ఏపీఏటీలో పనిచేస్తున్న 75మంది ఉద్యోగులను తెలంగాణకు కేటాయిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015 అక్టోబరు 4న ఉత్తర్వులు జారీ చేసింది.

● టీఆర్ఎస్ సర్కారుపై ఒత్తిడి తెస్తాం: వైసీపీ

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీల నుంచి తొలగించిన 32కులాలకు న్యాయం జరిగేలా ఏపీలో అధికారంలోకి రాగానే టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వైసీపీ నేత పార్థసారథి అన్నారు. 'తెలంగాణలో 32 బీసీ కులాలను ఓసీ కేటగిరీలోకి మార్చినప్పుడు కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారా? ఆ కులాలను బీసీల జాబితాలో చేర్చాలని గవర్నరును కోరారా? ఇవేమీ ప్రశ్నించకుండా కేటీఆర్ వచ్చి మొదటిసారి జగన్‌ను కలిస్తే నిందలేస్తారా?. సిగ్గుందా?.' అని ఏపీ సీఎం చంద్రబాబును ప్రశ్నించారు.

● రావత్, రజత్ నకిలీ ఓటర్ కార్డులపై ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ ఓంప్రకాశ్ రావత్, సీఈవో రజత్‌కుమార్ తదితరుల పేర్లతో ఒకే చిరునామాపై ఓటరుకార్డులు ముద్రితమైన ఉదంతంపై జీహెచ్‌ఎంసీ సీరియస్ అయ్యింది. దీనిపై జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఖాజా ఇన్‌కెషాఫ్ అలీ హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)కు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీసీలోని 419, 465, 471, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 31, ఐటీ చట్టంలోని 66డీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

● ఇక్కడ సర్వేలపై మాట్లాడను: లగడపాటి

తిరుమల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): "శ్రీవారి దర్శనానికి వచ్చా. కొండపై నేను రాజకీయాలు మాట్లాడను. అందుకు వేరే వేదికలు ఉన్నాయి. ఆ రోజు తెలంగాణ ఫలితాలపై అనుకోకుండా మాట్లాడా " అని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ అన్నారు. శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఏపీ ఎన్నికలపై సర్వే, తెలంగాణ ఎన్నికల్లో లెక్క తప్పిన సర్వేపై మీడియా ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు నిరాకరించారు.



శ్రీవారి ఆలయం వద్ద లగడపాటి

అటవీ నేరాలకు ఏడేళ్ల ఖైదు

అడవుల రక్షణకు త్వరలో కొత్త చట్టం.. బెయిల్ రాకుండా కఠిన నిబంధనలు

- ఫిబ్రవరి 6లోగా కార్యాచరణ: సీఎస్ జోషి
- నేరగాళ్ల స్థావరాలకు జియోట్యాగింగ్: డీజీపీ



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను దోచుకుంటూ, వన్యప్రాణులను వేటాడుతూ.. చట్టంలో లొసుగులను వాడుకుంటూ సులువుగా బయటపడుతున్న నేరగాళ్లపై తెలంగాణ ప్రభుత్వం ఇక ఉక్కుపాదం మోపనుంది. ప్రస్తుతం ఉన్న అటవీ చట్టాల వల్ల అటవీ నేరాలను అదుపు చేయడం సాధ్యం కాకపోతుండటంతో.. అడవుల రక్షణ కోసం త్వరలోనే కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి తెలిపారు. అటవీ నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు పడేలా ఈ చట్టాన్ని రూపొందిస్తామన్నారు. సోమవారం 'అడవుల రక్షణ-అటవీ నేరాల నియంత్రణ'పై సచివాలయం నుంచి సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అటవీ నేరాలపై సమాచారం ఇచ్చేవారికి రివార్డులు అందజేస్తామన్నారు. ఫిబ్రవరి 6కల్లా అడవుల పరిరక్షణ కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

నిషేధిత జాబితాలో అటవీ భూములు

అటవీ భూములను రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేని జాబితాలో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటవీ శాఖ గణాంకాల ప్రకారం 66.67 లక్షల ఎకరాల్లో అడవులు ఉండగా.. భూరికార్డుల నవీకరణలో మాత్రం 47.09 లక్షల ఎకరాలే తేలింది. మిగిలిన భూముల లెక్క తేలాల్సి ఉంది. కాగా అటవీ సరిహద్దు వివాదాలున్న 2.18 లక్షల ఎకరాల లెక్క తేల్చేందుకు సమగ్ర సర్వే చేయనున్నారు.

ఫిబ్రవరిలో అసెంబ్లీలో బిల్లు

కొత్త అటవీ రక్షణ చట్టం ఫిబ్రవరిలో అమల్లోకి వచ్చే అవకాశాలుండగా.. ఇందులో అటవీ నేరాలకు ప్రస్తుతమున్న ఏడాది శిక్షను.. 3-7 ఏళ్లకు పెంచనున్నారు. బెయిల్ కూడా సులువుగా లభించే అవకాశాలుండవు. పక్కా ఆధారాలతో నిందితులకు శిక్షపడేలా.. పోలీసులూ దర్యాప్తులో పాలుపంచుకుంటారు. ఈ బిల్లును ఫిబ్రవరిలో అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

జియోట్యాగింగ్‌తో నేరస్థులపై నిఘా!

అటవీ నేరాలను అరికట్టేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలు బృందంగా పనిచేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. తరచూ అటవీ నేరాలకు పాల్పడేవారి ఇళ్లను, స్థావరాలను జియోట్యాగింగ్ చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంవో ప్రత్యేకకార్యదర్శి భూపాల్‌రెడ్డి, అటవీ సంరక్షణ ప్రధానాధికారి (పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, అదనపు డీజీపీ జితేందర్, ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, పీసీసీఎఫ్ (విజిలెన్స్) రఘువీర్, అదనపు పీసీసీఎఫ్‌లు మునీంద్ర, లోకేశ్ జైస్వాల్, డోబ్రియల్, తిరుపతయ్య, స్వర్గం శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు. కాగా, తరచూ కలప స్మగ్లింగ్‌కు పాల్పడే 13 మందిపై పీడీ యాక్టు ప్రయోగించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

అటవీ నేరాలకు ఏడేళ్లు ఖైదు!

విషయం	పాత చట్టం	కొత్త చట్టం
అటవీనేరం	ఏడాది జైలుశిక్ష	3-7 ఏళ్ల జైలుశిక్ష
బెయిల్	సులభంగా వచ్చేది	కఠినతరం
దర్యాప్తు	అటవీశాఖ	అటవీ, పోలీసుశాఖలు
జరిమానా	అటవీశాఖ	పోలీసుశాఖ
కఠిన చర్యలు	పెద్దగా లేవు	పీడీ యాక్టు నమోదు

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపిన సీఎస్

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపారు. శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ ఆరోరా సోమవారం ఆయా రాష్ట్రాల సీఎస్‌లు, ఎన్నికల ప్రధానాధికారులు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ జోషి మాట్లాడుతూ.. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ అవార్డు పొందిందని గుర్తు చేశారు. కాగా రాష్ట్రానికి సంబంధించి ఓటరు జాబితాను ఫిబ్రవరి 22న ప్రచురిస్తామని, సరిహద్దు రాష్ట్రాల అధికారులతో ఫిబ్రవరి 5న సమావేశం నిర్వహిస్తామని సీఈవో రజత్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో అవసరమైన సిబ్బంది, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు ఉన్నారని తెలిపారు. ఓటర్ల నమోదు గడువును ఫిబ్రవరి 4 వరకు పొడిగించామని చెప్పారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ. అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికలను ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా నిర్వహించామని, లోక్‌సభ ఎన్నికలనూ ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నక్సల్స్ ప్రభావంపై ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్రలతో కలిసి కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య కార్యదర్శులు సోమేశ్‌కుమార్, రాజీవ్ త్రివేది, అదనపు డీజీ జితేందర్, ఎన్నికల అధికారులు ఆమ్రపాలి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు స్థానచలనం!

(మొదటి పేజీ తరువాయి)

సమాయత్తమవుతోంది. సహజంగా మే, జూన్ నెలల్లో సాధారణ బదిలీలు చేపడతారు. కానీ, ఈసారి ప్రత్యేక పరిస్థితుల్లో ఫిబ్రవరిలోనే పెద్ద ఎత్తున బదిలీలు చేయవచ్చని సమాచారం. వాస్తవానికి, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత బదిలీలు చేపట్టడం కుదరదు. షెడ్యూల్ ప్రకటించిన తదుపరి ప్రతి బదిలీకి ఈసీ అనుమతి తప్పనిసరి. అందుకు కారణాలనూ వివరించాలి. ఎన్నికల విధుల్లో ఉన్న వారిని బదిలీ చేయడానికి ఈసీ అంగీకరించదు. అందుకే, షెడ్యూల్ వెలువడే లోగానే బదిలీలు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వానికి సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు బదిలీలకు మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేయాల్సి ఉంటుంది. సహజంగా ఒకేచోట మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న వారికి సాధారణ బదిలీల్లో లేదా ఎన్నికలకు ముందు నిర్వహించే బదిలీల్లో స్థాన చలనం తప్పదు.

ఉన్నతస్థాయిలోనే అత్యధికం

ఫిబ్రవరి మొదటివారంలో పాక్షిక మంత్రివర్గ విస్తరణ జరగనుందని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే, జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల పోస్టుల్లో పెద్ద ఎత్తున బదిలీలు జరుగుతాయి. మంత్రివర్గంలో చోటు దక్కేవారి అభీష్టానికి అనుగుణంగా బదిలీలు చేయనున్నారని సమాచారం. ఇటీవలి కాలంలో సాధారణ, అత్యవసర బదిలీలు జరిగాయి. దాంతో, జిల్లాస్థాయి బదిలీలు పెద్దగా ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఇక, నారాయణపేట, ములుగు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తూ ఫిబ్రవరి మూడో వారంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. వాటికి కలెక్టర్లు, ఎస్పీలను నియమించాల్సి ఉంటుంది.

బదిలీలకు సంబంధించి మరికొన్ని అంశాలు..

- శాఖల ఏకీకరణ కొలిక్కి వస్తున్న నేపథ్యంలో, దానికి అనుగుణంగా ఉన్నతాధికారులు/ముఖ్యకార్యదర్శుల బదిలీలు ఉంటాయి.
- విదేశీ పర్యటనలో ఉన్న హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్ రెడ్డి స్థానంలో మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జనార్దన్ రెడ్డి స్థానంలో మరొకరిని నియమిస్తారా? అరవింద్‌కుమార్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తారా? ఇన్‌చార్జ్‌గానే కొనసాగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.
- మహబూబ్‌నగర్ కలెక్టర్ రొనాల్డ్ రాస్ బదిలీ కోరుకుంటున్నారు.
- హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్‌రావు విదేశాల్లో ఉన్నందున ఇక్కడ పూర్తిస్థాయి కలెక్టరును నియమించవచ్చు.
- వనపర్తి జిల్లా కలెక్టర్ దివ్య బదిలీ కోరుకుంటున్నారు. ఆమె భర్త పూర్వపు ఖమ్మం జిల్లా పరిధిలో కలెక్టరుగా ఉన్నందున... ఆమె కూడా సమీప జిల్లాలకు బదిలీ కోరుకునే అవకాశం ఉంది.
- బీసీ, ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. వాటికి అధికారులను నియమించవచ్చు.
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు వికాస్‌రాజ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తాజా బదిలీల్లో పూర్తి స్థాయి అధికారిని నియమించవచ్చని సమాచారం.
- త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలనూ పరిగణనలోకి తీసుకుని కోడ్ రాకముందే.. బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మంత్రుల చాంబర్లకు ముస్తాబు

కొత్తగా కొలువుదీరనున్న మంత్రులకు చాంబర్లను ప్రభుత్వ పరిపాలనా విభాగం అధికారులు సిద్ధం చేస్తున్నారు. సచివాలయంలోని డి బ్లాక్‌లోని మొదటి నాలుగు అంతస్తుల్లో మంత్రుల చాంబర్లు ఉన్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం నేపథ్యంలో జీఏడీ అధికారులు సోమవారం నుంచి చాంబర్లకు రిపేర్లు చేస్తున్నారు. దాంతో, త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.



ఆవుల్ని కుక్కేశారు

63ఆవులు, దూడలున్న ట్రక్కును పట్టుకున్న రాజాసింగ్

శామీర్‌పేట రూరల్, జనవరి 28: తుర్కపల్లి నుంచి శామీర్‌పేట వైపు ఓ డీసీఎం ట్రక్కు వెళ్తోంది.. అందులో నుంచి పెద్ద ఎత్తున ఆవుల అరుపులు.. అటుగా వచ్చిన ఓ గోసంరక్షణదళ్ సభ్యుడు ఆ వాహనాన్ని అడ్డుకొని డ్రైవర్‌ను ప్రశ్నించగా ఆవులున్నాయని చెప్పాడు. ట్రక్కు తలుపులు తెరిచి చూడగా అందులో 63 ఆవులు, గోవుల్ని కుక్కేసి ఉన్నాయి. ఊపిరాడక అవి ఆర్తనాదాలు చేసినట్లు గుర్తించాడు. అప్పటికే సమాచారం అందుకున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, గో సంరక్షణదళ్, హిందూ టైగర్స్ టీం సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని వాహనం పైకి ఎక్కి ఆవులను పరిశీలించారు. సంగారెడ్డి కబేళాకు తరలిస్తున్నామని డ్రైవర్ చెప్పడంతో ఆ వాహనాన్ని(టీఎస్11యూబీ8737) శామీర్‌పేట పోలీసులకు అప్పగించారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. గోవధను నిరోధించేందుకు పకడ్బందీ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని రాజాసింగ్ డిమాండ్ చేశారు.

జనార్దన్ రెడ్డి ఆకస్మిక బదిలీ

(మొదటి పేజీ తరువాయి)


ఉన్న జనార్దన్ రెడ్డిని అసెంబ్లీ ఎన్నికల ముందు గత ఆగస్టు 24వ తేదీన హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన బాధ్యతలు స్వీకరించి సరిగ్గా ఐదు నెలల మూడు రోజులు! అంతలోనే ఆయనకు స్థానచలనం కలిగింది. కోకాపేట భూముల కేటాయింపు వివాదమే ఆయన బదిలీకి కారణమనే చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. ప్రస్తుతం రూ.4000 కోట్లకుపైగా విలువైన భూములను అందులో సగం ధరకే చేజిక్కించుకునేందుకు కొందరు పెద్దలు స్కెచ్ వేశారని, వారి ఒత్తిళ్లకు తలొగ్గకపోవడం వల్లే జనార్దన్ రెడ్డిని బదిలీ చేశారని అధికారులు గుసగుసలాడుకుంటున్నారు.

ఏమిటీ కోకాపేట వివాదం!?

కోకాపేటలోని 623 ఎకరాల భూమిని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు అప్పగించింది. నిధుల సమీకరణలో భాగంగా ఆ భూములను ప్లాట్లుగా విభజించి వేలంలో విక్రయించాలని నిర్ణయించింది. 2006-08 మధ్య కాలంలో 166 ఎకరాలను హెచ్‌ఎండీఏ వేలం వేసింది. వేలంలో ఎకరం రూ.5.50 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ధర పలికింది. మొత్తం భూములను రూ.1,775 కోట్లకు కొనుగోలు చేసేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. వేలం సందర్భంగా ఈఎండీతోపాటు మొదటి, రెండో కిస్తు కింద రూ.687 కోట్లను చెల్లించాయి.

వివాదం మొదలు..

వేలం వేసిన భూముల కేటాయింపునకు ముందే ఆ భూములు తనవంటూ కేఎస్‌బీ అలీ అనే వ్యక్తి కోర్టులో కేసు వేశారు. కోకాపేట భూములు వివాదాస్పదం కావడం.. వివాదం కాస్తా కోర్టుకు చేరడం.. హైకోర్టులో కేసు పెండింగులో పడడంతో కొనుగోలుదారులు కూడా కోర్టుకెక్కారు. వేలం సందర్భంగా కట్టిన ఈఎండీ, కిస్తీలను తిరిగి తమకు ఇప్పించాలని హైకోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏడాదికి తొమ్మిది శాతం చొప్పున వడ్డీ లెక్కకట్టి వారు చెల్లించిన రుసుమును తిరిగి ఇవ్వాలని 2010లో ఆదేశించింది. దీనిపై హెచ్‌ఎండీఏ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. రెండేళ్ల విచారణ తర్వాత 2012లో హెచ్‌ఎండీఏకు అనుకూలంగా తీర్పు వచ్చింది.



మలుపులే మలుపులు

కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో కొనుగోలుదారులకు హెచ్‌ఎండీఏ నోటీసులు పంపింది. మిగిలిన మొత్తం చెల్లిస్తే భూములు కేటాయిస్తామని 2013లో స్పష్టం చేసింది. అదే సమయంలో, ఆ భూములపై యాజమాన్య హక్కులు పూర్తిగా హెచ్‌ఎండీఏవే అని హైకోర్టు స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు అలీ వేసిన పిటిషన్‌పై ఆదేశాలు ఇచ్చింది. దీనిపై అలీ ధర్మాసనంలో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడంతో కోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఇచ్చింది. కోర్టు వివాదాలు ఎంతకూ తెగకపోవడం.. ప్రభుత్వానికి తాము కోట్లు చెల్లించడం.. వాటికి వడ్డీలు పెరిగిపోతుండడంతో కొనుగోలుదారులు ఈసారి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాలని స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. తాము చెల్లించిన డబ్బులు వడ్డీతో సహా ఇవ్వాలని కొందరు కోరగా.. తాము చెల్లించిన మొత్తానికి అప్పటి ధర ప్రకారం సమానమైన భూమిని ఇవ్వాలని మరికొందరు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇంకొందరు.. అప్పటి ధర ప్రకారమే తాము వేలంలో దక్కించుకున్న భూమి మొత్తం కేటాయించాలని కోరారు. దీనిపై హెచ్‌ఎండీఏ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఇప్పటికే కొనుగోలుదారులు చెల్లించిన డబ్బులకు ప్రో-రేటా ప్రకారం పాత ధరకే భూమి కేటాయిస్తామని, మిగతా భూమి కావాలంటే ప్రస్తుత ధరను పరిగణనలోకి తీసుకుని కేటాయిస్తామని అందులో పేర్కొన్నట్టు సమాచారం. దీనిపై తీర్పును సుప్రీం వాయిదా వేసింది.

ఒత్తిళ్లకు తలొగ్గనందుకా...?

కోకాపేట భూములపై పెద్దల కన్ను పడింది. పాత ధర ప్రకారమే మొత్తం భూమిని కాజేసేందుకు కీలక వ్యక్తులు రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది. అప్పటి కొనుగోలుదారులను ముందు పెట్టి భూమిని దక్కించుకునేందుకు వారు ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం. ఈ క్రమంలో పాత ధర ప్రకారమే 166 ఎకరాలను కేటాయించాలని ఉన్నత స్థాయిలో ఒత్తిడి చేసినట్టు చెబుతున్నారు. గతంలో డబ్బులు చెల్లించాలని కోరిన కొనుగోలుదారులు కూడా ఇప్పుడు భూమినే కేటాయించాలని పట్టుబట్టినట్టు తెలిసింది. ఇందుకు కారణం భూమి విలువ భారీగా పెరగడమే. అప్పట్లో రూ.5.50 కోట్ల నుంచి రూ.13 కోట్లు పలికిన ఎకరం ధర ఇప్పుడు రూ.20-25 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ధర ప్రకారం వేలం వేసిన 166 ఎకరాల విలువ సుమారు రూ.4 వేల కోట్ల వరకు ఉంటుంది. అదే పాత ధరను పరిగణనలోకి తీసుకుంటే ఆ మొత్తం రూ.1,775 కోట్లు మాత్రమే. ఇందులో గతంలోనే రూ.687 కోట్లు చెల్లించిన నేపథ్యంలో కొనుగోలుదారులు మరో రూ.1,088 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది. దాదాపు రూ.2500 కోట్ల మేర లబ్ధి జరగనున్న దృష్ట్యా భూమి కేటాయింపునకు కీలక వ్యక్తుల నుంచి ఒత్తిళ్లు తీవ్రమైనట్టు తెలుస్తోంది. సుప్రీం ఆదేశాల ప్రకారం విచక్షణతో నిర్ణయం తీసుకునే అధికారం కమిషనర్‌కు ఉందని, కనక, పాత ధర ప్రకారమే భూములను కేటాయించాలని జనార్దన్ రెడ్డిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. అందుకు ఆయన అంగీకరించలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే బదిలీ వేటు పడి ఉండవచ్చని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.



రాయుడు బౌలింగ్‌పై నిషేధం

దుబాయ్: అంబటి రాయుడు బౌలింగ్‌పై ఐసీసీ నిషేధం విధించింది. ఇకముందు ఏ అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ అతడు బౌలింగ్ వేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఈనెల 12న ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో అతడి బౌలింగ్ సందేహాస్పదంగా ఉండడంతో మ్యాచ్ రెఫరీ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. దీంతో బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించి విచారణకు రావాలని ఐసీసీ 14 రోజుల గడువిచ్చినా.. అతడు పరీక్షకు హాజరుకాలేదు. దీంతో ఐసీసీ నిబంధన ప్రకారం అతడి బౌలింగ్‌పై తక్షణం వేటు వేస్తున్నట్టు పేర్కొంది.



మిథాలీ

అమ్మాయిలూ.. ఇక మీవంతు

- న్యూజిలాండ్‌తో భారత్ రెండో వన్డే నేడు
- ఆత్మవిశ్వాసంలో మిథాలీ సేన

ఉ. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో

మౌంట్ మాంగనూ: తొలి వన్డేలో ఘన విజయం సాధించి ఆత్మవిశ్వాసంలో ఉన్న భారత మహిళల జట్టు న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. మూడు వన్డేల ఈ సిరీస్‌ను రెండో మ్యాచ్‌తోనే గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ సిరీస్‌కు ముందు ఏర్పడిన కోచ్ వివాదానికి సంబంధించిన ఛాయలేవీ కనపడకుండా తొలి మ్యాచ్‌లో మిథాలీ సేన అదరగొట్టింది. కొత్త కోచ్ డబ్ల్యూవీ రామన్ నేతృత్వంలో తొలి సిరీస్ ఆరంభంలోనే భారత మహిళలు అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో కళ్లు చెదిరే ప్రదర్శన చేశారు. ఐసీసీ మహిళా చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ మొదటి మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో న్యూజిలాండ్‌ను భారత్ చిత్తు చేసింది. స్పిన్ త్రయం ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, దీప్తి శర్మ అదరగొట్టగా... స్టయిలిష్ బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధాన వన్డేల్లో నాలుగో సెంచరీ సాధించి దుమ్మురేపింది. ఈ మ్యాచ్‌లో 33 ఓవర్లలోనే మిథాలీ సేన లక్ష్యాన్ని చేరడంతో ఐసీసీ చాంపియన్‌షిప్ పట్టికలో భారత్ నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ చాంపియన్‌షిప్ ద్వారా 2021 వన్డే ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించే జట్లను ఖరారు చేస్తారు. రెండో వన్డేలో నెగ్గి సిరీస్‌ను సొంతం చేసుకుంటే.. ఉమెన్స్ చాంపియన్‌షిప్ (2014-16)లో భాగంగా స్వదేశంలో న్యూజిలాండ్‌తో 1-2తో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకున్నట్టవుతుంది. మరోవైపు చాంపియన్‌షిప్ పట్టికలో రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్.. ఆతిథ్య దేశంగా వన్డే వరల్డ్ కప్‌లో చోటు ఖాయమే. ఇక.. తొలి వన్డేలో భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు కివీస్ మహిళలు నానా తంటాలు పడ్డారు. ఓపెనర్ సుజీ బేట్స్ (36), కెప్టెన్ అమీ శాటర్త్‌వెయిట్ (31) మినహా అంతా విఫలమయ్యారు. రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యాలను అధిగమించాలని ఆ జట్టు భావిస్తోంది.



సమష్టిగా రాణిస్తే ఫలితమెలా ఉంటుందో భారత జట్టు నిరూపించింది. ఈ సిరీస్ ఆరంభానికి ముందు కివీస్‌తో పోరు సులువు కాదని అంతా ఓ అంచనాకు వచ్చినా.. బరిలోకి దిగాక పూర్తిగా ఏకపక్షమే.. జోరంతా టీమిండియాదే. ప్రపంచకప్‌నకు ముందు ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ ప్రతీ మ్యాచ్‌లోనూ జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతోంది. ఈ ఊపులో సుదీర్ఘకాలంగా ఎదురుచూసిన వన్డే సిరీస్‌ను కూడా పట్టేసింది. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రమే. భారత బౌలింగ్ ధాటికి ఎప్పటిలాగే కివీస్ తక్కువ స్కోరుకే పరిమితమవగా.. బ్యాటింగ్‌లో రోహిత్, కోహ్లీ అర్ధ సెంచరీలతో చెలరేగారు. దీంతో విజయం సునాయాసమైంది. 2009లో ధోనీ కెప్టెన్సీలో ఇక్కడ చివరిసారిగా భారత్ వన్డే సిరీస్ గెలవగా, ఆ తర్వాత ఇప్పుడే కావడం విశేషం.

2 వన్డేల్లో అత్యంత విజయవంతమైన కెప్టెన్ (63 వన్డేల్లో)గా రెండో స్థానంలో కోహ్లీ (47 విజయాలు). క్లైవ్ లాయిడ్, పాంటింగ్ (50) టాప్‌లో ఉన్నారు.

వన్డేల్లో అత్యధిక శతక భాగస్వామ్య (16)లు అందించిన మూడో జోడీగా గిల్‌క్రిస్ట్-హేడెన్‌లతో సమంగా నిలిచిన కోహ్లీ-రోహిత్. **3** సచిన్-గంగూలీ (26), దిల్షాన్-సంగక్కర (20) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

విరాట్ కోహ్లీ (60)

రోహిత్ శర్మ (62)

హ్యాట్రిక్‌తో పట్టేశారు

కివీస్ గడ్డపై పదేళ్ల తర్వాత భారత్‌కు సిరీస్

మూడో వన్డేలో విజయం ● రోహిత్, కోహ్లీ అర్ధ సెంచరీలు ● ఆకట్టుకున్న పాండ్యా

మౌంట్ మాంగనూ: వరుసగా మూడో మ్యాచ్.. ఇరు జట్ల ఆటతీరులోనే కాదు.. ఫలితంలోనూ మార్పులేదు.. బౌలర్లు విశేషంగా రాణిస్తూ కివీస్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడం, ఆ తర్వాత బ్యాట్స్‌మెన్ ధాటిని కొనసాగించడాన్ని భారత్ మూడో వన్డేలోనూ పునరావృతం చేసింది. ఫలితంగా జట్టుకు హ్యాట్రిక్ విజయం. అంతేకాదు.. దశాబ్దకాలంగా జట్టును ఊరిస్తున్న వన్డే సిరీస్ అలవోకగా చేజిక్కించుకుంది. అలాగే 2014లో 0-4తో చిత్తుగా ఓడించిన కివీస్‌పై ప్రతీకారం తీర్చుకుంది. రోహిత్ శర్మ (77 బంతు ల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 62), విరాట్ కోహ్లీ (74 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 60) అర్ధ సెంచరీలతో చెలరేగిన వేళ ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే 3-0తో సిరీస్ దక్కించుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌ను షమి (3/41), పాండ్యా (2/45), భువనేశ్వర్ (2/46), చాహల్ (2/51) మూకుమ్మడిగా దెబ్బతీశారు. దీంతో ఆతిథ్య జట్టు 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. రాస్ టేలర్ (106 బంతుల్లో



షమి (3/41)

9 ఫోర్లతో 93) పోరాటానికి టామ్ లాథమ్ (64 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 51) ఒక్కడే సహకారం అందించాడు. ఆ తర్వాత ఓ మాదిరి లక్ష్యాన్ని భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లకు 245 రన్స్‌తో ఛేదించింది. అంబటి రాయుడు (42 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 40 నాటౌట్), దినేశ్ కార్తీక్ (38 బంతుల్లో 5 ఫో ర్లు, 1 సిక్స్‌తో 38 నాటౌట్) వేగంగా ఆడారు. బౌల్ట్ రెండు వికెట్లు తీశాడు. షమికి 'మ్యాన్ ఆఫ ద మ్యాచ్' దక్కింది.

శతక భాగస్వామ్యం: 244 పరుగుల ఓ మాదిరి లక్ష్యఛేదనను భారత్ ధాటిగానే ఆరంభించింది. రోహిత్ నిదానం కనబరిచినా ధవన్ (28) దూకుడుగా ఆడాడు. రెండో ఓవర్‌లోనే అతడు హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత మరో మూడు ఫోర్లు బాదినా తొమ్మిదో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. అనంతరం రోహిత్, కోహ్లీ జోడీ ఆరంభంలో ఆచితూచి ఆడినా.. కుదురుకున్నాక బౌండరీలతో సత్తా చూపింది. రెండు సిక్సర్లు కూడా బాదిన రోహిత్ 63 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, కోహ్లీ 59 బంతుల్లో కెరీర్‌లో 49వ అర్ధసెంచరీ సాధించాడు. సమయోచితంగా ఆడుతున్న ఈ జోడీని శాంట్నర్ విడదీశాడు. 29వ ఓవర్‌లో రోహిత్ స్టంపౌట్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో రెండు ఓవర్ల తర్వాత కోహ్లీ కూడా వెనుదిరిగినా, రాయుడు వచ్చీ రాగానే బౌండరీలతో వేగం కనబరిచాడు. అతడికి జతగా దినేశ్ కార్తీక్ కూడా పోటీపడి ఆడడంతో లక్ష్యం మరీ సునాయాసమైంది. నాలుగో వికెట్‌కు వీరు అజేయంగా 77 పరుగుల భాగస్వామ్యం అందించడంతో జట్టు మరో 42 బంతులు మిగిలి ఉండగానే గెలిచింది.

అదే తడబాటు..: మొదట బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఎప్పటిలాగే తడబడింది. పేసర్లు షమి, భువనేశ్వర్ బౌలింగ్‌కు జట్టు 59 పరుగులకే గప్టిల్ (13), మన్రో (7), విలియమ్సన్ (28) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో టేలర్, లాథమ్ నాలుగో వికెట్‌కు 119 రన్స్ జత చేసి భారీ స్కోరుపై ఆశలు రేపారు. కానీ లాథమ్ వికెట్ తీసి చాహల్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత మరో రెండు వికెట్లు పడినా టేలర్ ధాటిని కొనసాగించాడు. అయితే శతకం వైపు సాగుతున్న అతడిని షమి బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు.

4 లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లో వేగంగా పది వేల పరుగులు పూర్తి చేసిన నాలుగో భారత బ్యాట్స్‌మన్ రోహిత్. కోహ్లీ, గంగూలీ, సచిన్ ముందున్నారు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: గప్టిల్ (సి) దినేశ్ కార్తీక్ (బి) భువనేశ్వర్ 13; మన్రో (సి) రోహిత్ (బి) షమి 7; విలియమ్సన్ (సి) పాండ్యా (బి) చాహల్ 28; టేలర్ (సి) దినేశ్ కార్తీక్ (బి) షమి 93; లాథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51; నికోల్స్ (సి) దినేశ్ కార్తీక్ (బి) పాండ్యా 6; శాంట్నర్ (సి)దినేశ్ కార్తీక్ (బి) పాండ్యా 3; బ్రేస్‌వెల్ (రనౌట్) 15; సోధీ (సి) కోహ్లీ (బి) షమి 12; బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 2; ఫెర్గూసన్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 49 ఓవర్లలో 243 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-10, 2-26, 3-59, 4-178, 5-191, 6-198, 7-222, 8-239, 9-239, 10-243. **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-46-2; షమి 9-0-41-3; చాహల్ 9-0-51-2; పాండ్యా 10-0-45-2; కుల్దీప్ 8-0-39-0; జాదవ్ 3-0-17-0.

భారత్: రోహిత్ (స్టంప్డ్) లాథమ్ (బి) శాంట్నర్ 62; ధవన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28; కోహ్లీ (సి) నికోల్స్ (బి) బౌల్ట్ 60; రాయుడు (నాటౌట్) 40; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 43 ఓవర్లలో 245/3. వికెట్ల పతనం:** 1-39; 2-152, 3-168. **బౌలింగ్:** బౌల్ట్ 10-1-40-2; బ్రేస్‌వెల్ 6-0-49-0; ఫెర్గూసన్ 10-1-57-0; శాంట్నర్ 10-0-45-1; సోధీ 7-0-53-0.



పాండ్యా 'సూపర్ క్యాచ్'

సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత తొలి మ్యాచ్ ఆడిన పాండ్యా అందరినీ ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీయడంతో పాటు ఫీల్డింగ్‌లో మెరుపు విన్యాసాలతో అబ్బురపరిచాడు. చాహల్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్ రెండో బంతిని విలియమ్సన్ ముందుకొచ్చి ఆడగా మిడ్ వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న పాండ్యా కళ్లు మూసి తెరిచే లోపే ఎడమవైపు గాల్లో సమాంతరంగా డైవ్ చేస్తూ సూపర్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో కొన్ని క్షణాలు షాక్‌లో ఉండిపోయిన కివీస్ కెప్టెన్ నిరాశగా పెవిలియన్‌కు చేరాడు.

ఆ వివాదం.. హార్దిక్‌ను మార్చేస్తుంది — కోహ్లీ

మౌంట్ మాంగనూ: టీవీ షో వివాదం తర్వాత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆటలో కొత్త శిఖరాలను అధిరోహించగలడన్న ఆశాభావాన్ని కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యక్తం జేశాడు. 'జీవితంలో ఊహించని సంఘటన జరిగినప్పుడు రెండే మార్గాలుంటాయి. ఆ ఘటనతో అధఃపాతాళంలో కూరుకుపోవడం ఒకటి. దానిని నుంచి గుణపాఠం నేర్చుకొని మళ్లీ జీవితాన్ని కొనసాగించడం రెండోది' అని పేర్కొన్నాడు. సస్పెన్షన్ నుంచి బయటపడ్డాక తొలి మ్యాచ్‌లో ఎంత తీవ్రతతో ఆడాల్సి ఉంటుందో..పాండ్యా అలానే ఆడాడని చెప్పాడు. 'అతడు జీవితంలో సరైన దిశలో సాగుతూ ఉత్తమ క్రికెటర్‌గా ఎదుగుతాడని ఆశిస్తున్నా' అని కోహ్లీ అన్నాడు.

ధోనీకి గాయం..




సూపర్ ఫామ్‌లో ఉన్న ధోనీ మూడో వన్డేలో గాయం కారణంగా బరిలోకి దిగలేదు. తొడ కండరాల నొప్పితో బాధపడుతున్న అతడికి విశ్రాంతినివ్వగా దినేశ్ కార్తీక్ కీపర్‌గా బాధ్యతలు చేపట్టి రాణించాడు. ఇక సరిగా ఆకట్టుకోలేకపోయిన విజయ్ శంకర్ స్థానంలో ఊహించినట్టుగానే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులోకి వచ్చాడు.

68 ఏళ్లకు రిటైర్మెంట్!



- కివీస్ క్రికెటర్ చాట్‌ఫీల్డ్ సుదీర్ఘ కెరీర్
- క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న బౌలర్

వెల్లింగ్టన్: ఇయాన్ చాట్‌ఫీల్డ్.. న్యూజిలాండ్ క్రికెట్ జట్టు మాజీ పేసర్. తన తరంలో 'నేనే ఎక్స్‌ప్రెస్'గా ప్రఖ్యాతుడైన చాట్‌ఫీల్డ్ గురించి ఇప్పటి క్రికెట్ అభిమానులకు తెలియకపోవచ్చు. అయితే 68ఏళ్ల వయసు వరకు అతడు క్రికెట్ ఆడి రెండ్రోజుల క్రితమే రిటైర య్యాడంటే ఇప్పటి ఆటగాళ్లతోపాటు అభిమానులూ నోరు వెళ్లబెడతారు. అంతర్జాతీయ క్రికెటర్‌గా ఖ్యాతి గడించిన చాట్‌ఫీల్డ్ ప్రస్తుతం కారు డ్రైవర్‌గా జీవితం వెళ్లదీస్తున్నాడు. 1975లో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసిన చాట్‌ఫీల్డ్ కెరీర్ 14 ఏళ్లు కొనసాగి 1989లో ముగిసింది. పేస్ గ్రేట్ సర్ రిచర్డ్ హ్యాడ్లీ అతడి సమకాలికుడు.



43 టెస్టులు, 114 వన్డేలు ఆడిన చాట్‌ఫీల్డ్. మొత్తం 243 వికెట్లు పడగొట్టాడు. 11వ నెంబర్ బ్యాట్స్‌మన్‌గా ప్రత్యర్థి బౌలర్లను తీవ్ర అసహనానికి లోనుచేసి విలువైన పరుగులు చేయడంలో ఇయాన్‌ను మించిన ఆటగాడు మరొకరు లేరు. 30 ఏళ్ల కిందటే ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా, ఇప్పటిదాకా క్లబ్ క్రికెట్ ఆడడం అతడి గొప్పతనం. 1968లో వెల్లింగ్టన్‌లోని నేనేపార్క్‌లో క్రికెట్ ఆడడం ప్రారంభించిన ఇయాన్.. అదే పార్క్‌లో ఓల్డ్‌బాయ్స్ క్లబ్ తరపున చివరి మ్యాచ్ ఆడాడు. '68 ఏళ్ల వయస్సులో కూడా నాలో క్రికెట్ ఆడే సత్తా ఉందని చెప్పడం సిల్లీగా ఉండొచ్చు. కానీ నాలో సత్తా ఉంది. కాకపోతే ఆ సత్తామేర ఆడలేమోననే అనుమానంతో గుడ్‌బై చెప్పేశా' అని రిటైర్మెంట్ సందర్భంగా ఇయాన్ చెప్పాడు. బ్యాట్స్‌మన్‌గా సెంచరీ చేయాలన్నది అతడి కోరిక. కానీ అది నెరవేరకుండానే ఆటకు గుడ్‌బై చెప్పడం ఒకింత అసంతృప్తి. అరంగేట్ర టెస్ట్‌లో ఇంగ్లండ్‌పై జెఫ్ హోవర్త్‌తో కలిసి చివరి వికెట్‌కు 44 పరుగులు జోడించడం ఇయాన్ బ్యాటింగ్ నైపుణ్యానికి అద్దం పడుతుంది. అదే టెస్ట్‌లో ఇంగ్లండ్ పేసర్ పీటర్ లెవెర్ బౌన్సర్‌కు చాట్‌ఫీల్డ్ తలపగిలింది. అయితే సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అందుకేనేమో..పేసర్ అయినా బౌన్సర్లు వేయడం ఇయాన్‌కు అస్సలు ఇష్టముండదు. తన ఇంటర్నేషనల్ కెరీర్‌లో అతడు ఒక్క బౌన్సర్ కూడా వేయకపోవడం అందుకు నిదర్శనం. బౌన్సర్లకంటే కూడా లైన్,లెంగ్త్‌లో బంతులేసి వికెట్లు పడగొట్టవచ్చని గట్టిగా చెబుతాడు ఇయాన్.

రోజుకు 12 గంటల డ్రైవింగ్: వెల్లింగ్టన్‌లో ఏ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగినా ఇయాన్ అతిథే. వీఐపీ స్టాండ్‌లో కూర్చుని మాజీ సహచరులతో కలిసి డ్రింక్ చేస్తూ మ్యాచ్ తిలకిస్తుంటాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యాక కుటుంబ పోషణ కోసం అతడు క్యాబ్ డ్రైవర్‌గా మారాడు. ఉదయం 4.45కే ఇంటినుంచి బయలుదేరే అతడు విధులు ముగించుకొని ఇంటికి చేరేది రాత్రి ఏడు గంటలకే. 'రోజూ నా ట్యాక్సీలో ఎందరో ప్రయాణిస్తుంటారు. వారు క్రికెట్ గురించి మాట్లాడుతుంటారు. కానీ నేనో క్రికెటర్ అని వాళ్లకు తెలీదు' అని చెప్పాడు. సాధారణంగా చాట్‌ఫీల్డ్ వెల్లింగ్టన్ ఎయిర్‌పోర్ట్ దగ్గర తన ట్యాక్సీ ఉంచుతాడు. తన మాజీ సహచరుడు హ్యాడ్లీ సహా ఎందరో క్రికెటర్లను ట్యాక్సీలో గమ్యస్థానాలకు చేరవేస్తుంటాడు. ప్రస్తుతం భారత్‌తో జరుగుతున్న సిరీస్‌కు కామెంటేటర్లుగా వ్యవహరిస్తున్న కివీస్ మాజీ క్రికెటర్లనూ తన కారులో తీసుకెళ్లాడు.


రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర

సెమీస్‌లో కర్ణాటకపై విజయం



బెంగళూరు: రన్‌మెషీన్ చతేశ్వర్ పుజారా (131 నాటౌట్) తుదికంటా అజేయంగా నిలవడంతో.. సౌరాష్ట్ర మూడోసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో సౌరాష్ట్ర 5 వికెట్ల తేడాతో కర్ణాటకపై గెలిచింది. వచ్చే నెల 3 నుంచి 7 వరకు జైపూర్‌లో జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ విదర్భతో సౌరాష్ట్ర తలపడనుంది. 279 పరుగుల లక్ష్య ఛేదనలో చివరి రోజు విజయం కోసం 55 పరుగులు కావాల్సి ఉండగా.. పుజారా లాంఛనాన్ని పూర్తి చేశాడు. 224/3తో సోమవారం ఆఖరి రోజు ఆటను ఆరంభించిన సౌరాష్ట్ర.. రెండో ఇన్నింగ్స్‌లో 282/5తో గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ షెల్డన్ జాక్సన్ (100) శతకం పూర్తి చేయగా.. వసవాడే (12) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. పుజారాతోపాటు ప్రేరక్ (7) నాటౌట్‌గా నిలిచాడు. వినయ్ కుమార్ (3/75) మూడు వికెట్లు పడగొట్టాడు. నాలుగో రోజు ఆటలో వినయ్ బౌలింగ్‌లో పుజారా క్యాచ్ అవుటైనా.. అంపైర్ తోసి పుచ్చడం వివాదాస్పదమైంది. కానీ, వాటిని చతేశ్వర్ ఏమాత్రం పట్టించుకోకుండా జట్టును విజయ తీరాలకు చేర్చాడు. కర్ణాటక 275, 239 పరుగులు చేయగా.. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగుల స్కోరు చేసింది.

ఓడినా.. సెమీస్‌కు యూపీ



గ్రేటర్ నొయిడా: ఆఖరి బౌట్‌లో జితేందర్ గెలవడంతో.. మ్యాచ్ ఓడినా యూపీ దంగల్ జట్టు ప్రొ రెజ్లింగ్ లీగ్ సెమీస్‌కు చేరుకుంది. సోమవారం జరిగిన పోరులో యూపీ దంగల్ 3-4తో పంజాబ్ రాయల్స్ చేతిలో ఓడింది. చివరగా జరిగిన 74 కిలోల్లో యూపీ రెజ్లర్ జితేందర్ 10-9తో అమిత్ ధన్‌కర్‌పై గెలిచాడు. దీంతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంతో యూపీ ఫైనల్ ఫోర్‌కు చేరుకోగా.. పంజాబ్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. సెమీస్‌లో ఈ రెండు జట్లూ మరోసారి తలపడనున్నాయి. అంతకుముందు జార్జి సకన్‌డెలిడ్జె 4-2తో జార్విస్‌పై గెలిచి యూపీకి పాయింట్ అందించాడు. తర్వాత మహిళల 53 కిలోల బౌట్‌లో వనేసా కలడ్జిన్‌కయా 12-6తో అంజుపై నెగ్గి యూపీని 2-0 ఆధిక్యంలో నిలబెట్టింది. అయితే, వరుసగా నాలుగు బౌట్‌లు నెగ్గిన పంజాబ్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. 65 కిలోల్లో బజరంగ్ పూనియా 7-0తో పంకజ్‌ను మట్టికరిపించాడు. 57 కిలోల కేటగిరీలో మిమి హ్రిస్టోవా 4-2తో సరితను ఓడించగా.. 86 కిలోల్లో మార్గషివిలి 5-0తో ఐరక్లీ మిసిటురిపై నెగ్గాడు. ఆరో బౌట్‌లో నవజోత్ కౌర్‌పై నెగ్గిన అనిత రాయల్స్ విజయాన్ని ఖరారు చేసింది. మరో సెమీస్ మ్యాచ్‌లో హరియాణా హ్యామర్స్‌తో ఢిల్లీ సుల్తాన్స్ అమీతుమీ తేల్చుకోనుంది.

గల్ఫ్ నుంచి మృతదేహాల తరలింపులో..
ఎయిర్ ఇండియా చార్జీల తగ్గింపు



న్యూఢిల్లీ, జనవరి 28: గల్ఫ్ దేశాల్లో ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న భారతీయుల పట్ల ఎయిర్ ఇండియా ఉదారత ప్రదర్శించనుంది. 6 గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి మృతదేహాల తరలింపులో 40% డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించింది. విదేశీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖలతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని ఎయిర్ ఇండియా సీనియర్ అధికారి తెలిపారు. మృతదేహాలు భారత్‌కు తరలించాలంటే తగ్గించిన ధరల ప్రకారం యూఏఈ నుంచి రూ.29,000, సౌదీ అరేబియా నుంచి రూ.41,800, ఖతర్ నుంచి రూ.43,000, బహ్రెయిన్ నుంచి రూ.42,500, ఒమన్ నుంచి 29,500, కువైత్ నుంచి రూ.40,900 చార్జీ అవుతుందన్నారు.

● 'సాహిత్య' ఉత్సవాల్లో హిజ్రా కవుల భేటీ

» తెలుగు హిజ్రా కవయిత్రి దీపికకు అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ వార్షిక సాహిత్యోత్సవాల్లో భాగంగా తొలిసారి హిజ్రాలతో కవిసమ్మేళనం ఏర్పాటు చేయనున్నారు. తెలుగు హిజ్రా కవయిత్రి దీపిక ఈ సమ్మేళనంలో పాల్గొని, తన కవితలు చదవనున్నారు. సోమవారం భాషా సమ్మాన్ పురస్కారాల ప్రదానం, గిరిజన మహిళా రచయితల సమావేశంతో ప్రారంభమైన ఈ సాహిత్యోత్సవాలు.. ఫిబ్రవరి 2 వరకు జరుగుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన 24 మంది వివిధ భాషల రచయితలకు అవార్డులు ప్రదానం చేస్తారు. ప్రముఖ రచయిత కొలకనూరి ఇనాక్ ఈ ఏడాది తెలుగు పురస్కార గ్రహీత కాగా.. సదస్సులో రాష్ట్రం నుంచి వాసిరెడ్డి నవీన్, దేవీప్రియ, ఎం.నారాయణ శర్మ తదితరులు పాల్గొంటారు.

● 12వ తరగతి వరకు విద్యాహక్కు చట్టం!

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం ఎనిమిదో తరగతి వరకే అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్య (విద్యాహక్కు చట్టం)ను ఇకపై 12వ తరగతి వరకూ అమలు చేయబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇప్పటికే ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది. కాగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు హెల్త్ సైన్స్‌ను కొత్త సబ్జెక్టుగా ప్రవేశ పెట్టాలని సీబీఎస్ఈ నిర్ణయించింది.

● అంతుచిక్కని వైరస్‌తో ఇండోర్ విలవిల

» 4 నెలల్లో 64 మంది మృత్యువాత

ఇండోర్, జనవరి 28: ఇండోర్ నగరాన్ని గుర్తుతెలియని వైరస్ పట్టి పీడిస్తోంది. ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ తరహా లక్షణాలు గల ఈ వైరస్ సోకి ఇండోర్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో నాలుగు నెలల్లోనే 64 మంది మృత్యువాతపడ్డారు. మృతిచెందిన 13 మంది సహా మరో 39 మందికి స్వైన్ ఫ్లూ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. మరో 350 మందికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. ఏటా స్వైన్‌ఫ్లూ వైరస్ జన్యు రూపాన్ని మార్చుకుంటుందని గుర్తించామని ఐడీఎస్‌పీ అధికారి డాక్టర్ అమిత్ మలాకర్ వెల్లడించారు.

● ఢిల్లీ నుంచి ఆర్కిటిక్‌కు సూపర్‌బగ్

లండన్, జనవరి 28: యాంటీబయాటిక్ పనితనాన్ని అడ్డుకొనే జన్యువు అది.. తొమ్మిదేళ్ల క్రితం తొలిసారి ఢిల్లీ నీళ్లలో కనిపించింది. ఆ తర్వాత జాడ లేకుండా పోయింది. దాదాపు 13వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇప్పుడు ఆర్కిటిక్ ప్రాంతానికి చేరుకుని నార్వేలోని స్వాల్బర్డ్‌లోని మంచు దిబ్బల్లో పరిశోధకుల కంట పడింది. మానవుల నుంచి, పక్షుల నుంచి, లేదా ఇతర జీవాల ద్వారా ఆ ప్రాంతానికి చేరి ఉండవచ్చని పరిశోధకులు వెల్లడించారు. బ్లాఎన్‌డీఎమ్-1 అనే జన్యువు అవశేషాలు 2008లో కనిపించగా, దాని జాడ కోసం వెతకగా 2010లో ఢిల్లీలో నీళ్లలో కనిపించింది.

'అయోధ్య'పై విచారణ ఇంకెన్నాళ్లు?



అయోధ్య కేసు వివిధ కోర్టుల్లో 70 ఏళ్లుగా నలుగుతోంది. శబరిమల, వివాహేతర సంబంధం, అర్బన్ మావోయిస్టులు, కర్ణాటక వంటి సున్నిత అంశాల్లో సుప్రీంకోర్టు వేగంగా స్పందించి తీర్పు వెలువరించింది. అయోధ్య విషయంలోనూ ఇదే విధానం అవలబించాలని సామాన్య పౌరుడిగా కోరుతున్నా.

- కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్

ఆర్డినెన్స్ ఆలోచన లేదు



అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై ఆర్డినెన్స్ తీసుకొచ్చే ఆలోచన లేదు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడే వరకూ వేచి చూస్తాం. ఈ విషయాన్ని ప్రధాని మోదీ పార్లమెంటులోనే చెప్పారు. అందుకే రామ మందిర నిర్మాణంపై ఆర్డినెన్స్ గానీ చట్టంగాని చేయబోం.

- కేంద్రమంత్రి రామ్ విలాస్ పాసవాన్

రామాలయంపై చట్టం తెస్తే.. ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



రామాలయం నిర్మాణం కోసం చట్టం తెస్తే 2019 సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుంది. కానీ చట్టం తీసుకొస్తే దానిపై మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారేమోనని బీజేపీ ఆలోచిస్తోంది.

- వీహెచ్‌పీ చీఫ్ వీఎస్ కోక్జే





పేదకు రొక్కం

గోవా బీచ్‌లో రాహుల్ హల్‌చల్

బిజీ బిజీగా ఉండే రాహుల్ గాంధీ కాస్త రిలాక్స్ అయ్యారు. తల్లి సోనియాను తీసుకుని శనివారం గోవా బీచ్‌కు వెళ్లారు. సీ ఫుడ్స్ తింటూ, సెల్ఫీలు తీసుకుంటూ హల్‌చల్ చేశారు. రాహుల్ ఓ రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు రచనా ఫెర్నాండెజ్ అనే స్థానికురాలు ఆయన్ను కలిశారు. ఆయనతో సెల్ఫీ తీసుకున్నారు. ఆ ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

మెహుల్ చోక్సీలది అయితే, మరొకటి నిరుపేద రైతులదని అభివర్ణించారు. తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోనూ కనీస ఆదాయ పథకాన్ని అమలు చేస్తుందని, రెండు భారత్‌లను తాము కోరుకోవడం లేదని, కేవలం ఒకే భారతదేశం ఉండాలనేది తమ లక్ష్యమని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఆర్థిక పేదలకు పది శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో దానికి కౌంటర్‌గా రాహుల్ ఈ ప్రతిపాదన తెచ్చారన్న రాజకీయ కోణాన్ని పక్కన పెడితే.. అసలేంటీ కనీస ఆదాయ పథకం? ఇంతటి విస్తృతి ఉన్న దేశంలో దీని అమలు సాధ్యమేనా? నిధుల సమీకరణ ఎలా చేస్తారు? అసలు పేదరికానికి ఇచ్చే నిర్వచనమేంటి..? మొదలైన అంశాలపై చర్చకు ఆస్కారమేర్పడుతోంది. అయితే, ఈ పథకం అమలు కావాలంటే ప్రభుత్వం ప్రస్తుతం ఖర్చు చేస్తున్న వైఖరిలో సమూల మార్పులు రావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎకాఎకిన సంక్షేమ పథకాల ఎత్తివేత సమంజసం కాదని, సమాంతరంగా అమలు చేయాలని జయతీ ఘోష్ లాంటి నిపుణులు అభిప్రాయపడ్డారు. నిజానికి, ఈ ప్రతిపాదన కొత్తదేమీ కాదు. గతంలో కొన్ని దేశాల్లో అమలై విఫలమయినదే. 2016-17 ఆర్థిక సర్వేలో అప్పటి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ దీన్ని మళ్లీ దేశం ముందుకు తెచ్చారు. సంక్షేమ పథకాలన్నింటినీ ఎత్తేసి 'సార్వత్రిక కనీస ఆదాయ పథకం'(యూబీఐ)తేవాలన్నారు. "మేం ఏడెనిమిది పెద్ద సామాజిక సంక్షేమ పథకాలను తీసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. అందులో తేలిందేంటంటే కేంద్ర పథకాలు లక్ష్యాలను చేరడం లేదని! పేదరికాన్ని తగ్గించేట్లుగా రాష్ట్రాల్లో పథకాలు అమలు కావడం లేదు. వీటన్నింటినీ పరిశీలించిన మీదట కనీస ఆదాయ పథకం పేరిట నేరుగా సొమ్ము వారి ఖాతాల్లో జమచేయలి. ఆ పథకాల కంటే యూబీఐ మరింత ప్రభావాన్వితం కాగలదు"అని ఆయన సూత్రీకరించారు. యూబీఐ వైపుగా దేశం దృష్టి సారించాల్సిన

సాధ్యాసాధ్యాలు?

రాహుల్ ప్రతిపాదిస్తున్న పథకం అమలు వెన్వెంటనే సాధ్యమా అన్నది విశ్లేషకుల్ని వేధిస్తున్న ప్రశ్న. భారత్‌లో ప్రస్తుతం దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారు 36.3 కోట్ల మంది అనీ నిరుడు రంగరాజన్ కమిటీ ఓ నివేదికలో తెలిపింది. కనీసం ఈ 36 కోట్ల మందిలో నమోదైన వారెంతమంది, వారందరికీ ఆధార్‌లున్నాయా, వారందరికీ బ్యాంకు అకౌంట్లున్నాయా, వారికి ఎంత ఇవ్వదల్చుకున్నారన్న విధివిధానాలు ముఖ్యం. ప్రస్తుతం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికే కేంద్రం రూ.50,000 కోట్లు ఏటా కేటాయిస్తున్నది. కనీస ఆదాయ పథకాన్ని తేవాలంటే అంతకు పది రెట్ల కేటాయింపులు జరపాలన్న అభిప్రాయాలున్నాయి. ఆహార, ఇంధన సబ్సిడీలను భారత్ రద్దు చేస్తే, ఒక మనిషికి ఏడాదికి రూ.2600 ఆదాయాన్ని ఇవ్వగలదని ఐఎంఎఫ్ 2017లో పేర్కొంది.

చరిత్రాత్మకం: చిదంబరం

రాహుల్ ప్రకటించిన కనీస ఆదాయ హామీ పథకం 'చరిత్రాత్మకం'అని చిదంబరం అభివర్ణించారు. బడుగుల జీవితాలకు టర్నింగ్ పాయింట్ అని అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం వరుస ట్వీట్లు చేశారు. దేశ వనరులకు మొదటి హక్కుదారులు పేదలేనని, రాహుల్ హామీ అమలుకు వనరులను అన్వేషిస్తామని తెలిపారు.

సమయం వచ్చిందని ఆ సర్వేను లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి జైట్లీ ఇందుకు కొన్ని కారణాలు చూపారు.

జీవన ప్రమాణాల మెరుగు

మహిళా సాధికారికత సాధించవచ్చు. ఎందుకంటే ఇంటిని యూనిట్‌గా అమలు చేస్తాం కాబట్టి వ్యక్తులకు విడిగా నగదు బదిలీ ద్వారా మహిళలు సొంతంగా తమ ఆదాయం సాధించుకునే వెసులుబాటు ఏర్పడుతుంది. సుపరిపాలన సాధ్యం చేయవచ్చు. ఈ పథకం ద్వారా ప్రజలు తమ అవసరాలను చూసుకుంటారు. ప్రభుత్వం ఇతరత్రా ముఖ్యాంశాలపై దృష్టిపెట్టవచ్చు. పేదలను వ్యవస్థలో భాగస్వామ్యం చేయవచ్చు. ప్రజల భాగస్వామ్యం పెరిగితే అన్నిటా ఆదాయమూ పెరిగి పరిస్థితులూ మెరుగుపడతాయి.

వ్యతిరేక వాదనలు

ఈ పథకం ప్రజలను మరింత సోమరులుగా తయారుచేస్తుంది. ప్రభుత్వం మీద ఆధారపడే తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. వచ్చే ఆదాయాన్ని ప్రజలు ఖచ్చితంగా విద్య, వైద్యం మొదలైన వాటికో ఖర్చు చేస్తారన్న గ్యారంటీ ఏమీ లేదు. లిక్కర్, సిగరెట్లు, ఇతర దుర్వ్యసనాలకు ఖర్చు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వంపై భారం పెరిగి ఆర్థిక నావను తల్లకిందులు చేయగలదు. పరోక్ష పన్నుల్ని పెంచి ఆ ఆదాయాన్ని దీనికి బదలాయిస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

సవాళ్లేంటి?

దేశంలోని వయోజనుల్లో మూడో వంతు మందికి బ్యాంకు అకౌంట్లు లేవు. జన్‌ధన్ యోజన డేటా ప్రకారం 26కోట్ల అకౌంట్లే ఉన్నాయి. ముందు వీరందరికీ అకౌంట్లు ఏర్పాటు చేయాలి. దేశంలో 30 కోట్ల మందికి మొబైల్ ఫోన్లు లేవు. సమాచార పంపిణీకి ఇది అవసరం. ప్రస్తుత సబ్సిడీ పథకాలకు ఇది అదనంగా అమలు చేస్తే భారం ఎన్నో రెట్లు పెరుగుతుంది.

లాభాలు లేకపోలేదు

- ● డబ్బు ఖర్చులో వెసులుబాటు లభిస్తుంది.
- ● నిరుద్యోగానికి కొంత ప్రత్యామ్నాయం... తద్వారా పేదరికాన్ని తగ్గించగలదు
- ● సంపదను సమానంగా పంచవచ్చు.
- ● ఆదాయం పెరిగితే బేరమాడే శక్తి పెరుగుతుంది. అధ్వానంగా ఉన్న పని-అనుకూల పరిస్థితులను ప్రశ్నించవచ్చు.
- ● లీకేజీలు, పక్కదార్లు పట్టే చాన్స్ తక్కువ
- ● ప్రభుత్వ బదలాయింపుల్లో అనవసర వ్యయం తగ్గించవచ్చు. అవినీతి తగ్గుతుంది.
- ● ఆర్థిక సేవలు విస్తరించడానికి దోహదపడుతుంది. సమ్మిళిత ఆర్థికవ్యవస్థకు అవకాశం.
- ● కొన్ని అంశాల్లో ఉత్పాదకత పెంచేందుకూ దోహదపడుతుంది.

గోవా టేపులు నిజమైనవే!: రాహుల్

రాఫెల్ విషయంలో కేంద్రాన్ని తప్పుబడుతూ తమ పార్టీ విడుదల చేసిన గోవా ఆడియో టేపులు నిజమేనవేనని, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అందుకే, ప్రధాని మోదీని పర్రీకర్ లెక్క చేయడం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రిగా ఉండడానికి అనంత్ కుమార్ హెగ్డే అనర్హుడని, ఆయనపై వెంటనే వేటు వేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ప్రతి భారతీయుడినీ ఆయన అవమానించారని, మండిపడ్డారు.

అమలుకు నోచుకోదు: బీజేపీ

రాహుల్ ప్రకటనపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఆ పార్టీ ఇచ్చిన వందలాది హామీల్లాగే కనీస ఆదాయం పథకం కూడా అమలుకు నోచుకోదని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని.. కాంగ్రెస్ ఆడుతున్న రాజకీయ క్రీడలను వారు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదని గుర్తు చేశారు.

దక్షిణాదిన ప్రియాంక ప్రచారం?

తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్న నేత.. రాష్ట్రంలో ఓటమిపై సీరియస్‌గా ఉన్న అధిష్ఠానం



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలకు దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచార బాధ్యతలను ప్రియాంకాగాంధీకి అప్పగించనున్నారా! తెలంగాణపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారా!! ప్రస్తుతం టీపీసీసీ వర్గాల్లో జోరుగా నడుస్తున్న చర్చ ఇది. వచ్చే ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకంగా మారిన నేపథ్యంలో దక్షిణాది బాధ్యతలను సోదరికి అప్పగించి.. రాహుల్‌గాంధీ ఉత్తరాదిపైనే ఎక్కువగా దృష్టి పెట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రియాంకను ఇటీవల రాజకీయ క్షేత్రంలోకి దించిన రాహుల్.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించి, తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలను ఆమెకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాంతంలో కేవలం 40 లోక్‌సభ స్థానాలు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రజాకర్షణ మెండుగా ఉన్న ప్రియాంకను అక్కడికే పరిమితం చేయకుండా.. దక్షిణాది రాష్ట్రాల ప్రచార బాధ్యతలను కూడా అప్పగించే యోచనలో ఏఐసీసీ ఉన్నట్లు టీపీసీసీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణపై ఆమె ప్రత్యేకంగా దృష్టి పెట్టవచ్చని అంటున్నారు. వాస్తవానికి తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను కాంగ్రెస్ ఆశించింది. అధిష్ఠానం తన పూర్తిస్థాయి సహకారాన్నీ అందించింది. సోనియాగాంధీ మేడ్చల్ ప్రచార సభలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ సుడిగాలి పర్యటనలు చేశారు. అయినా మహాకూటమి ఘోర పరాజయం పొందడంపట్ల అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించే బాధ్యతలను ప్రియాంకకు ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

'అసెంబ్లీ' ఓటమిపై వచ్చేవారం సమీక్ష..!

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చి 2 నెలలు గడిచినా ఇంతవరకూ ఓటమిపై ఏఐసీసీ సమీక్ష నిర్వహించలేదు. ఫిబ్రవరి తొలివారంలో ఈ సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు టీపీసీసీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ఇక డీసీసీలకు అధ్యక్షులను మరో వారంలో ప్రకటించే అవకాశం ఉంది.

కొత్త యూపీ.. దక్షిణాది!

» అయిదు రాష్ట్రాలపై ప్రధాని మోదీ ఆశలు

» ప్రాంతీయ పార్టీలపై విమర్శలకు దూరం

» హిందీ రాష్ట్రాల్లో ఓటమితో ముందుజాగ్రత్త



న్యూఢిల్లీ, జనవరి 28: మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ దక్షిణాది రాష్ట్రాలను ప్రత్యామ్నాయ మార్గంగా భావిస్తోంది. హస్తినకు దగ్గరి దారి ఉత్తరప్రదేశ్ అనేది దేశ రాజకీయాల్లో తరచూ వినిపించే మాట. అది 80 లోక్‌సభ స్థానాలు ఉన్న అతి పెద్ద రాష్ట్రం. అక్కడ మెజారిటీ సీట్లు కైవసం చేసుకున్న పార్టీకి కేంద్రంలో అధికారం తథ్యమనేది అందుకే! అయితే దేశ రాజకీయాల్లో దక్షిణాది కొత్త యూపీగా బీజేపీ భావిస్తోందా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు. 'హిందీ హార్ట్‌ల్యాండ్' రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో కమలం పార్టీ అయిదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం (పుదుచ్చేరి) ఉన్న దక్షిణాదిపై దృష్టి సారించింది. తిరిగి అధికారంలోకి రావడానికి ఇక్కడి ప్రాంతీయ పార్టీలు ఉపయోగపడతాయని ఆశలు పెట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం తమిళనాడు, కేరళలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడం, సభల్లో ఆయన ప్రాంతీయ పార్టీలను పల్లెత్తు మాట అనకపోవడం ఎత్తుగడలో భాగమేనని భావిస్తున్నారు. ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణల్లో కలిపి 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒక్క కన్నడ సీమలోనే బీజేపీ అధికార పీఠానికి చేరుకోగలిగింది. అలాగే 27 లోక్‌సభ స్థానాలకు 2014 ఎన్నికల్లో 17 దక్కాయి. కర్ణాటకను మినహాయిస్తే మిగతా 4 రాష్ట్రాల్లో ఆ పార్టీ బలం నామమాత్రమే. తమిళనాడులో కమలానికి ఉన్నవి కేవలం రెండే సీట్లు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కొక్కటే. కేరళలో సున్నా. తమిళనాడు, కేరళ పర్యటనలతో దక్షిణాదిలో మోదీ ఎన్నికల శంఖం పూరించారు. మదురైలో ఆదివారం ఎయిమ్స్ శంకుస్థాపన సందర్భంగా సభలో ప్రసంగించిన మోదీ.. ఏ ప్రాంతీయ పార్టీ జోలికి వెళ్లలేదు. వాటిని కించిత్ మాటనలేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టులను తూర్పారబట్టడానికే పరిమితమయ్యారు. ఇది అన్నా డీఎంకేతో బీజేపీ పొత్తు కోరుకుంటోందనడానికి సంకేతంగా భావిస్తున్నారు.



ఇదేం పని సిద్దూ..!

మహిళా కార్యకర్త చున్నీ లాగేసిన సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం సిద్దరామయ్యను 'చున్నీ' వివాదం చుట్టుముట్టింది. సిద్దరామయ్య కుమారుడు, ఎమ్మెల్యే డా.యతీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ నియోజకవర్గంలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కార్యకర్తల్లో.. జమలార్ అనే గిరిజన మహిళ.. 'మీరు పట్టించుకోరు. మా ఎమ్మెల్యే పత్తాలేరు. మా సమస్యలు ఎవరితో చెప్పుకోవాలి?' అంటూ సిద్దరామయ్య ముందున్న బల్లను గట్టిగా చరుస్తూ మాట్లాడారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన సిద్దరామయ్య మహిళ చేతిలోని మైక్‌ను లాగేసుకుని గదమాయించి కూర్చోబెట్టారు. ఈ క్రమంలో ఆయన చేయి తగిలి ఆమె మెడలోని చున్నీ కూడా కిందకు జారింది. కాగా ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. మహిళలకు ఇచ్చే మర్యాద ఇదేనా..? అంటూ కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ ఘటనపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు సిద్దరామయ్యను కౌరవుల ప్రభుత్వంలో ఆధునిక దుశ్శాసనుడని అభివర్ణిస్తూ కర్ణాటక బీజేపీ ట్వీట్ చేసింది. జమలార్ విషయంలో తాను అసభ్యంగా ప్రవర్తించలేదని, అది అనుకోకుండా జరిగిన ఘటన అని సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. ఈ సంఘటనను సుమోటాగా స్వీకరించి దీనిపై విచారణ జరపాలని జాతీయ మహిళా కమిషన్ చీఫ్ రేఖాశర్మ డిమాండ్ చేశారు.

● రాజీనామా చేసేస్తా: మళ్లీ కుమార ఆక్రోశం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు మారకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేస్తానని కర్ణాటక సీఎం కుమారస్వామి మరోమారు హెచ్చరించారు. తాను రాజీనామా చేస్తే తనకేం కాదని, కాంగ్రెస్‌కే నష్టమని అన్నారు. ఇప్పటికీ తనకు సిద్దరామయ్యే ముఖ్యమంత్రి అని ఆదివారం బెంగళూరులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పుట్టరంగశెట్టి వ్యాఖ్యానించడంపై ఆయన సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దరామయ్య సీఎం అయి ఉంటే అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేవని ఎస్టీ సోమశేఖరన్ చేసిన వ్యాఖ్యలపైనా మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హద్దులు దాటుతున్నారని, వారిని ఆ పార్టీ నేతలే నియంత్రించాలని స్పష్టం చేశారు. సిద్దరామయ్య స్పందిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తామే కంట్రోల్ చేసుకుంటామన్నారు. సోమశేఖరన్‌కు షోకాజ్ నోటీసు పంపుతామని కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు తెలిపారు. కర్ణాటకలో కరువు, వ్యవసాయ సంక్షోభం కంటే కుమారుడి సినిమా ప్రమోషన్‌పైనే కుమారస్వామి దృష్టి కేంద్రీకరిస్తున్నారని బీజేపీ ఆరోపించింది.


● ఎస్పీ-బీఎస్పీ కూటమికి కాంగ్రెస్ మద్దతివ్వాలి

» ప్రియాంక రాకను స్వాగతిస్తున్నాం: అఖిలేశ్

లఖ్‌నవూ, జనవరి 28: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలనుకుంటే కాంగ్రెస్ తప్పనిసరిగా ఎస్పీ-బీఎస్పీ కూటమికి మద్దతివ్వాలని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ చెప్పారు. సోమవారం ప్రయాగరాజ్‌లో ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. ప్రియాంక ప్రభావంపై ప్రశ్నించగా.. కాంగ్రెస్‌ది గొప్ప ఎత్తుగడ అన్నారు. ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో అత్యధిక నైపుణ్యం కలిగిన బీజేపీపై పోరాడాలంటే కాంగ్రెస్ పార్టీ ఎస్పీ-బీఎస్పీ కూటమికి మద్దతివ్వక తప్పదన్నారు.

ఆ పరిస్థితుల్లో భార్య హంతకి కాదు!

» సుప్రీం సంచలన తీర్పు



న్యూఢిల్లీ, జనవరి 28: తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన ఓ మహిళ తన పొరుగింటాయనతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇది సహించ లేక భార్యను భర్త నిలదీశాడు. మాటా మాటా పెరిగింది. భర్త ఆమెను, తన కూతుర్ని కూడా 'వేశ్యలు' అని అర్థం వచ్చేలా బూతులు తిట్టాడు. ఆమె ఆగ్రహం చెంది భర్తను కొట్టింది. అతని మెడకు ఓ తాడుతో నులిమేసి చంపేసింది. పక్కనే ఉన్న ప్రియుడు కూడా ఆమెకు సహకరించాడు. శవాన్ని దహనం చేశారు. ఈ ఘటన 40 రోజుల తరువాత బయటపడింది. స్థానిక కోర్టు, మద్రాస్ హైకోర్టు కూడా ఆ భార్య, ప్రియుడూ హత్యకు పాల్పడ్డట్లు తేల్చి జైలుశిక్ష విధించాయి. తమను హంతకులనడాన్ని ఆ మహిళ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆమెపై హత్య కేసు పెట్టడం తప్పు అని సుప్రీం తీర్పునిచ్చింది. "భారతీయ సమాజంలో ఏ మహిళా తనను వేశ్య అనీ, కూతుర్ని వేశ్య అనీ తిట్టడాన్ని సహించదు. అప్పుడున్న పరిస్థితుల్లో ఆమె ఆగ్రహంతో దాడిచేసింది. పథకం ప్రకారం చేసిన హత్య కాదు. దీన్ని మర్డర్ అనరాదు, కల్పబుల్ హోమిసైడ్ (ఉద్దేశపూర్వకం కాని, దండనీయ హత్య)గా పరిగణించాలి" అని జస్టిస్ ఎం శంతన్‌గౌడార్, జస్టిస్ దినేశ్ మాహేశ్వరిల బెంచ్ తీర్పిచ్చింది.

అంతా ఆమే చేసింది!

» విమాన ప్రమాదంలో 51 మంది మృతి

» 11నెలల తర్వాత వెలుగులోకి..

మహిళా ఉద్యోగి మాటలతో తీవ్ర మనస్తాపం చెందాడా పైలెట్. కొత్తవారికి ఎలా శిక్షణ ఇవ్వాలో అతనికి సరిగ్గా తెలియదని అందరికీ చెప్పడంతో డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఒకవైపు విమానం నడుపుతూనే ఏకధాటిగా సిగరెట్లు తాగుతూ.. క్యాబిన్‌లోని సిబ్బందికి తన ఆవేదన చెప్పుకుని బాధపడ్డాడు. మాటల్లోపడి విమానాన్ని ల్యాండ్ చేయాలన్న స్పృహ కోల్పోయాడు. రన్‌వేకు దగ్గరకొచ్చాక ఒక్కసారిగా విమానాన్ని ల్యాండ్ చేశాడు. దీంతో విమానంలో మంటలు చెలరేగి అందులోని 51మంది మృతి చెందారు. గతేడాది మార్చి 12న నేపాల్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి విస్తుపోయే నిజాలివి. విచారణ కమిటీ.. విమానంలోని వాయిస్ రికార్డును పరిశీలించగా ఈ విషయాలు బయటకొచ్చాయి. *- కాఠ్మాండూ*

దేశ భద్రతే మాకు ముఖ్యం

రక్షణ కొనుగోళ్లపై మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 28: దేశ భద్రత కోసం భారీ, కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి తన ప్రభుత్వం వెనుకాడబోదని ప్రధాని మోదీ చెప్పారు. ఫైటర్ జెట్ల కొనుగోలు కానీ, ఇతర ఆధునికీకరణ పనులు కానీ, దశాబ్దాలుగా పెండింగులో ఉన్న రక్షణ ప్రాజెక్టులన్నీ ఆ కారణంతోనే ఖరారు చేశామని చెప్పారు. సోమవారం ఆయన ఎన్‌సీసీ కేడెట్ల సమావేశంలో మాట్లాడారు. భారత్ శాంతి కోసమే ప్రయత్నం చేస్తున్నదని, అదే సమయంలో దేశ భద్రత కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. అవినీతికి పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వీఐపీ సంస్కృతికి చరమగీతం పాడతామన్నారు."దశాబ్దాలుగా పెండింగులో ఉన్న యుద్ధ విమానాలు, ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. క్షిపణులు, ట్యాంకులు, హెలికాప్టర్లు ఇక్కడే తయారు అవుతున్నాయి" అని చెప్పారు. నాలుగున్నరేళ్లలో దేశ రక్షణకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలను యువత ఉత్సాహంగా ముందుకు తీసుకెళుతున్నట్లు ప్రకటించారు. నోట్ల రద్దు నిర్ణయానికి కూడా యువత గట్టిగా మద్దతు తెలిపారని, మహిళలకు అన్ని రకాలా అవకాశాలను ఇస్తున్నట్లు తెలిపారు. యుద్ధ విమానాల పైలట్లుగా, భారత నావికాదళం సాహస యాత్రికులుగా భారతీయ మహిళలు రాణిస్తున్నారని కొనియాడారు.



● త్రిపుర రథానికి ప్రథమ బహుమతి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌పథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో 'గాంధేయ మార్గంలో గ్రామీణ ఆర్థిక సాధికారత'ను కళ్లకు కట్టిన త్రిపుర శకటం ప్రథమ బహుమతి గెలుచుకుంది. అలాగే 'జాతీయ ఆస్తుల రక్షణలో 50 ఏళ్లు' థీమ్‌తో రూపొందిన సీఐఎస్‌ఎఫ్ శకటం, 'కిసాన్ గాంధీ' పేరుతో భారత వ్యవసాయ పరిశోధన సంస్థ రూపొందించిన శకటం ప్రభుత్వ విభాగాల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఈ అవార్డులు అందజేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.